సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15

సంచిక: 297

బుధవారం 18-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

పిల్లలు ఎలా ఉండాలి?
వికసించే పువ్వుల్లా ఉండాలి.
సంతోషానికి చిరునామాలా ఉండాలి.
ఆందోళన అంటే ఏమిటో తెలియకుండా పెరగాలి.
స్కూల్ బ్యాగ్‌లో భవిష్యత్తును నింపుకెళ్లిన పిల్లలు...
అదే స్కూల్ బ్యాగ్‌లో భయాన్ని పోగుచేసుకుని వస్తే...
తల్లిదండ్రులు అప్పుడేం చేయాలి?
పిల్లలను దగ్గరకు తీసుకోవాలి...
చేతల్లో ధైర్యాన్నివ్వాలి.
ఆనందాల రెక్కలను విరిచేసే
దుష్టశక్తుల బారి నుంచి కాపాడాలి.
పువ్వుల్లా పరిమళించడానికి
కావల్సినంత భరోసా కల్పించాలి.


ప్రతీకాత్మక చిత్రం

పిల్లలు... పరిమళించాలి

స్కూల్‌లో అందరు పిల్లలూ ఒకేలా చేరుతారు. స్నేహానికి చిరునామాల్లా, ఉత్సాహంగా ఉంటారు. కొందరు అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తుంటే, మరికొందరు మాత్రం వెనుక పడుతుంటారు. స్వతహాగా ఉండే ఐక్యూ లెవెల్స్ పరిమితులకు లోబడి చదువులో వెనుకబడడం కాదిది. ఉత్సాహంగా ఉంటే పిల్లలు కూడా నిరుత్సాహంగా మారి అన్నింటిలోనూ వెనుకబడుతుంటారు. ఆ వెనుకబాటు వెనుక వాళ్లను వెనుక పడేటట్లు చేసిన కారణం ఏదో ఉండే ఉంటుంది. ఎందుకు బిడియపడుతున్నారో, ఎందుకు తమను తాము ఒంటరిని చేసుకున్నారో బయటకు తెలియదు. ఆ పిల్లల ప్రవర్తనలో అనారోగ్యకరమైన మార్పు మొదలవుతుంది. అది క్రమంగా మొండితనానికి, ధిక్కారతకు దారి తీస్తుంటుంది. స్కూల్ డైరీలో 'డిస్ ఒబీడియెంట్, ప్రాబ్లమాటిక్ బిహేవియర్ అనే పదాలతో పేరెంట్స్‌కి పిలుపు వస్తుంది. ఆ పరిస్థితి పేరెంట్స్‌కి ఊహించని శరాఘాతం. ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని అయోమయంలో, కొంత అపరాధ భావానికి లోనయ్యి, ఓవర్‌గా రియాక్ట్ అవుతూ పిల్లలను దోషులుగా నిలబెడుతుంటారు. ఈ పరిస్థితిని జాగ్రత్తగా సరిదిద్దకపోతే పిల్లలు ధిక్కారతను అలాగే కొనసాగిస్తారు. ఈ సిచ్యుయేషన్‌ని సున్నితంగా డీల్ చేయడానికి కొన్ని సూచనలు చేశారు క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ సుదర్శిని.

బాధించే పిల్లల మీదా శ్రద్ధ పెట్టాలి!

పిల్లల్లో స్వతహాగానే ఒకరికొకరు సహకరించుకునే తత్వం ఉంటుంది. అలాంటిది టీచర్ ఒక టాస్క్ ఇచ్చినప్పుడు ఆ సమాచారాన్ని కొందరికి తెలియచేసి, వాళ్లకు కోపం ఉన్న పిల్లలకు సమాచారం చేరనివ్వరు. ఆ టాస్క్‌లో ఫెయిల్ అవ్వాలనే దురుద్దేశంతో ఇలాంటి పని చేస్తారు. ఇది ఏ రకంగానూ పిల్లలను వెనకేసుకు రాదగిన విషయం కాదని పేరెంట్స్ గ్రహించాలి. బాధితులవుతున్న పిల్లల పేరెంట్స్ అయితే విషయం తెలియగానే స్పందించి తమ బిడ్డను కాపాడుకుంటారు. కానీ బాధించే పిల్లల తల్లిదండ్రులు కొన్ని సందర్భాల్లో తేలిగ్గా తీసుకునే అవకాశం ఉంది. ఇది ఆ పిల్లలకు, సమాజానికి కూడా చాలా ప్రమాదకరం.



- డాక్టర్ సుదర్శిని రెడ్డి సబ్బెళ్ల,
క్లినికల్ సైకాలజిస్ట్,
జీజీహెచ్, కాకినాడ, ఆంధ్రప్రదేశ్

పిల్లలు అద్దం వంటి వాళ్లు

"పిల్లల్లో చురుకుదనం తగ్గడం, ఎప్పుడూ డల్‌గా ఉండడం, నిద్రలో ఉలిక్కి పడడం వంటివి కనిపిస్తుంటాయి. పిల్లల మనసులో చెలరేగిన అనేక ఆందోళనలు, భయాలు, అవమానం, అపరాధ భావం వంటి అనేక సమస్యలను వ్యక్తం చేసే లక్షణాలివి. ఈ లక్షణాలను గమనించిన తర్వాత ఇక ఆలస్యం చేయకూడదు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు దగ్గర కూర్చుని పిల్లలను మాటల్లో పెట్టాలి. నేరుగా 'ఎందుకిలా ఉన్నావని' అడిగే సమాధానం రాదు. స్కూలు గురించి, ఫ్రెండ్స్ గురించి కదిపితే వాళ్లే ఒక్కొక్కటీ చెప్పడం మొదలుపెడతారు. ఆ చెప్పిన కబుర్లలోనే కారణాలు ఉంటాయి. స్కూల్లో తోటి విద్యార్థులు బాడీ షేమింగ్, బుల్లీయింగ్, ఫిజికల్- ఎమోషనల్ అబ్యూజ్ చేస్తున్నట్లు, భయపెడుతున్నట్లు, బెదిరిస్తున్నట్లు అనిపిస్తే ఆ విషయాన్ని నిర్ధారించుకోవడానికి పిల్లలను ఒకటికి రెండుసార్లు గద్దించి అడగడం ఏ మాత్రం సరి కాదు. పిల్లలు మరింతగా బిగుసుకుపోతారు, కాబట్టి వాళ్ల క్లాస్ టీచర్ దృష్టికి తీసుకు వెళ్లాలి. అయితే ఇక్కడ మన పిల్లల్ని అబ్యూజ్ చేస్తున్న పిల్లలను దోషులుగా, నేరస్థులుగా చూడవద్దు. వాళ్లూ పసిపిల్లలేనని మర్చిపోవద్దు. అయితే వాళ్ల ఆరోగ్యకరంగా పెరగడం లేదని అర్థం. ఎందుకంటే... పిల్లలు తాము దేనిని తీసుకుంటారో దానినే డెలివర్ చేస్తారు. అమ్మానాన్నలు మరెవరినో ఉద్దేశించి 'వాళ్ల ఎత్తుపళ్ల గురించో, నడక తీరు మీదనో, దేహం లావు- సన్నం, పొడవు, పొట్టి వంటి విషయాల్లో కామెంట్స్ చేసి నవ్వుతూ ఉంటే' పిల్లలకు అదే అలవాట వుతుంది. పిల్లలు వాళ్లు చూసిన దాన్ని స్కూల్లో తోటి పిల్లల మీద ప్రదర్శిస్తారు. నిజానికి ఎదుటి వాళ్లను అనుకరిస్తూ గేలి చేయడం, లోపాలను ఎత్తి చూపుతూ ఎగతాళి చేయడం అనేది అభద్రతలో ఉంటూ, ఆత్మవిశ్వాసం లేని వాళ్లు చేసే పని. ఆ పని ఇంట్లో పేరెంట్స్ చేస్తుంటే పిల్లలకు అలవడుతుంది. బాల్యంలో ఇలాంటి బీజాలు పడితే ఇక అలాంటి వాళ్లు జీవితాంతం ఏదో ఒక సందర్భంలో ఈ లక్షణాలను బహిర్గతం చేస్తూనే ఉంటారు. జీవితంలో ప్రతి రిలేషన్‌షిప్‌కీ విఘాతం కలిగించుకుంటూ ఉంటారు. కాబట్టి చిన్నప్పుడే సరిదిద్దాలి.

బొమ్మల్లో వ్యక్తమవుతుంది

పిల్లలు మూడీగా ఉంటున్నట్లు గమనిస్తే వాళ్లను డ్రాయింగ్, క్లేతో బొమ్మలు చేయడంలో ఎంగేజ్ చేయాలి. ఇది మంచి స్ట్రెస్ బస్టర్ మాత్రమే కాదు, చక్కటి పరిష్కారమార్గం కూడా. బొమ్మలు వేయడం, బొమ్మలు చేయడం ఒత్తిడికి అవుట్‌లెట్‌లా పని చేస్తుంది. మాటల్లో చెప్పలేని విషయాలు బొమ్మల్లో వ్యక్తమవుతాయి. ఆ బొమ్మల్లోని పాత్రలు... పిల్లల్లో దాగి ఉన్న కోపాన్ని, ఇష్టాన్ని, అయిష్టాన్ని, భయాన్ని, బాధించే గుణాన్ని కూడా ప్రతిబింబిస్తుంటాయి. పిల్లల మానసిక సంఘర్షణకు అద్దం పడతాయి. పిల్లల మనసు చదవడానికి ఆ బొమ్మలు ఉపయోగపడతాయి. బాధించే పిల్లలు, బాధితులయ్యే పిల్లలను అధ్యయనం చేయడానికి కూడా ఇదే సరైన మార్గం. బిహేవియరల్ ప్రాబ్లెమ్స్‌తో మా దగ్గరకు తీసుకువచ్చిన పిల్లలకు మేమిచ్చే మొదటి టాస్క్ కూడా అదే. తల్లిదండ్రులకు సూచన ఏమిటంటే... పిల్లలు డల్‌గా ఉంటే ఉపేక్షించవద్దు, అలాగే మీ పిల్లల మీద టీచర్ నుంచి కంప్లయింట్ వస్తే ఆవేశపడవద్దు. టీచర్ ఒక సూచన చేశారంటే ఆ సూచన వెనుక బలమైన కారణం ఉండి తీరుతుందని గ్రహించాలి. టీచర్‌లు కూడా పిల్లల కాండక్ట్ మీద డిజ్ ఒబీడియెన్స్, బిహేవియరల్ ప్రాబ్లమ్స్' అని రాసే ముందు వాళ్ల పేరెంట్స్‌కు అర్థమయ్యేలా వివరించి చెప్పగలగాలి. ఎందుకంటే పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దగలిగేది పేరెంట్స్- టీచర్స్ మధ్య సమన్వయం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది'' అని వివరించారు డాక్టర్ సుదర్శిని. పిల్లల మనసు సున్నితం. పువ్వులాంటి పిల్లలు పువ్వుల్లానే పెరగాలి. వారి భవిష్యత్తు సుమపరిమళాలతో వికసించాలి.

– వాకా మంజులారెడ్డి

కిచెన్ టిప్స్



- పూరీలు బాగా పొంగినట్టు రావాలంటే గోధుమపిండిలో కొద్దిగా బొంబాయి రవ్వ కలపాలి. లేదా బియ్యంప్పిండి కలిపినా మంచి ఫలితమే కనిపిస్తుంది.



- మొదటగా వేసిన దోశె పెనానికి అతుక్కుపోయి రాదు. దోశె వేసే ముందు పెనంపై వంకాయ లేదా ఉల్లిపాయ ముక్కతో రుద్దితే సులువుగా వచ్చేస్తుంది.

యువతరానికి 'వ్యాయామం' దగ్గరి చుట్టం అనే విషయం తెలియనిదేమీ కాదు. అయితే ఎప్పుడూ ఒకేరకమైన వ్యాయామాల కంటే ఫిట్‌నెస్ ట్రెండ్‌ను అనుసరిస్తూ కొత్త కొత్త వ్యాయామాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. పాత వర్కవుట్లు కూడా కొత్తగా పరిచయమవుతున్నాయి.



12-3-30
కొత్త సంవత్సరం సరికొత్త వర్కవుట్స్

'కొత్త సంవత్సరం ఈ వర్కవుట్స్ చేయాలి' అని యూత్ అనుకున్నవాటిలో '12-3-30' అగ్రస్థానంలో ఉంది. ఈ టాప్ ఫిట్‌నెస్ ట్రెండ్‌ను ఫాలో కావడానికి ప్రపంచవ్యాప్తంగా యువతరం ఇష్టపడుతుంది. హెల్త్ అండ్ బ్యూటీ ఇన్‌ఫ్లూయెన్సర్ లారెన్ గిరాల్డో రూపొందించిన ఈ 30 నిమిషాల వర్కవుట్ స్టైల్ సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది.

'12-3-30' (12 పర్సంట్ ఇన్‌క్లైన్, 3.0 స్పీడ్, వాక్ ఫర్ 30 మినిట్స్) అనేది ట్రెడ్‌మిల్‌కు సంబంధించిన సెట్టింగ్స్‌ను సూచిస్తుంది.

'రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి...అని మా అమ్మమ్మ చెబుతుండేది. బయట మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్‌లు పెద్దగా చేసే అలవాటు లేదు. ట్రెడ్‌మిల్‌పై ఎక్కువ టైమ్ ఉండడం ఇబ్బందిగా ఉండేది. దీంతో ట్రెడ్‌మిల్‌పై 12-3-30 రూపంలో సెట్టింగ్స్ చేసుకున్నాను. ఇది మంచి ఫలితం ఇచ్చింది. పదమూడు కిలోల బరువు తగ్గాను' అంటుంది లారెన్.

'12-3-30' తరువాత స్థానంలో క్రాస్‌ఫిట్ ఉంది. 2000 సంవత్సరంలో కాలిఫోర్నియాలో పుట్టిన వర్కవుట్ ఇది. కొవ్వు తగ్గడానికి, కండరాల దృఢత్వానికి ఉపయోగపడే వర్కవుట్. ఆ తరువాత స్థానంలో '75 సాఫ్ట్' ఉంది. నాలుగు నిబంధనల ఆధారంగా రూపొందించిన ఈ వ్యాయామాన్ని రోజుకు 45 నిమిషాలతో, 75 రోజుల పాటు చేయాల్సి ఉంటుంది.

'రేడియో టైసో' అనేది జపాన్‌లో అబాలగోపాలానికి సుపరిచితమైన వ్యాయామం. వందసంవత్సరాల చరిత్ర ఉన్న ఈ వ్యాయామానికి ఇప్పటికీ ఆదరణ ఉంది. 'రేడియో టైసో' ఇప్పుడు మన యువతరాన్ని కూడా ఆకట్టుకుంటోంది. ఒక కొత్త వర్కవుట్‌ను ఇష్టపడి ఉత్సాహంగా చేయడమే కాదు దానికి సంబంధించిన పరిమితులు కూడా అర్థం చేసుకుంటుంది యువతరం. ఉదాహరణకు...12-3-30

ఈ టఫ్ కార్డియో వర్కవుట్‌ని ప్రతిరోజూ చేయాల్సిన అవసరం లేదు, ఒకేసారి కాకుండా జీరో ఇన్‌క్లైన్‌తో ప్రారంభించి లక్ష్యాన్ని పెంచుకుంటూ పోవాలి, ఇది చేస్తున్నప్పుడు ఇయర్‌ఫోన్‌లు ధరిస్తే ఏకాగ్రత దెబ్బతిని చేయాల్సిన దానికంటే ఎక్కువ సేపు వ్యాయామం చేసి అలసటకు గురవుతారు...నిపుణులు చెప్పే ఇలాంటి సలహాలపై యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఫిట్‌నెస్‌కు సంబంధించిన కొత్త ట్రెండ్స్‌ను ఫాలో కావడం ఇష్టమేగానీ గుడ్డిగా అనుసరించడం ఇష్టం ఉండదు. కచ్చితంగా నిపుణుల సలహాలు తీసుకుంటాను' అంటోంది బెంగళూరుకు చెందిన ఎంబీయే స్టూడెంట్ కావ్య. వర్కవుట్స్ చేయడానికి కొత్త వాళ్లకు అనుకూలమైన బాటిల్‌రోప్ (రెండు చేతులతో, రెండు తాళ్లు పట్టుకొని పైకి కిందికి ఊపుతూ చేసే ఈ వర్కవుట్ వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరగడం, కొవ్వు కరగడం లాంటి ఉపయోగాలు ఉన్నాయి)తో వ్యాయామ ప్రపంచంలోకి అడుగుపెట్టిన కావ్య ఇప్పుడు 12-3-30పై ఆసక్తి ప్రదర్శిస్తుంది.

2022 'ఇయర్ ఆఫ్ సాఫ్ట్ ఎక్సర్‌సైజ్'గా పేరు తెచ్చుకుంది. ఈ కొత్త సంవత్సరం మాత్రం హార్డర్, ఫాస్టర్, స్ట్రాంగర్ ఎక్సర్‌సైజ్‌లకు వేదిక కాబోతుందని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు.

సినిమా

మేం గెలుస్తాం

సమంతకు 'మయోసైటిస్'.. పూనమ్ కౌర్‌కి 'ఫైబ్రోమయాల్జియా'.. ఇది అందరికీ తెలిసిన విషయమే. మంగళవారం నాడు మమతా మోహన్‌దాస్ తాను చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. 'ఈ కష్టాన్నీ దాటేస్తాను' అనే నమ్మకాన్ని వ్యక్తపరిచారామె. ఇక సమంత తన అనారోగ్యం గురించి చెప్పినప్పుడు 'నాలానే ఎంతోమంది పోరాడుతున్నారు. మేం గెలుస్తాం' అన్నారు. ఇదే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచిన పూనమ్, మమతా.. ఈ మధ్యకాలంలో తమ అనారోగ్యం గురించి పేర్కొన్న కొందరు తారల గురించి తెలుసుకుందాం.


సమంత


మమతా మోహన్‌దాస్

గత ఏడాది అక్టోబర్‌లో సమంత తాను మయోసైటిస్ వ్యాధి (ఎక్కువ పని చేయలేకపోవడం, కండరాల నొప్పి, త్వరగా అలసిపోవడం వంటివి)తో బాధపడుతున్నట్లు ప్రకటించారు. ఆస్పత్రి బెడ్‌పై ఉండి ఆమె 'యశోద' సినిమాకి డబ్బింగ్ చెప్పారు కూడా. ''జీవితంలో మంచి రోజులతో పాటు చెడ్డ రోజులు కూడా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో (మయోసైటిస్‌ని ఉద్దేశించి) ఇంకొక్క అడుగు కూడా ముందుకు వేయలేనేమో అనిపించింది. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే ఇంతదూరం వచ్చానా అనిపించింది. అందుకే పోరాడతా. నాలానే చాలా మంది పోరాడుతున్నారు. మేం గెలుస్తాం'' అని పేర్కొన్నారు సమంత. ఇక సమంత తనకు మయోసైటిస్ అని ప్రకటించిన తర్వాత పియా బాజ్‌పాయ్ ('రంగం' సినిమా ఫేమ్) కూడా గతంలో తాను ఇదే వ్యాధితో బాధపడ్డాననే విషయాన్ని బయట పెట్టారు. అయితే ఇంట్లోవాళ్లు భయపడతారని తనకు మయోసైటిస్ అనే విషయాన్ని చెప్ప లేదన్నారు పియా. కుటుంబ సభ్యులతో ఢిల్లీలో ఉంటున్న పియా వ్యాధి చికిత్స నిమిత్తం ముంబైలో ఉన్నారు. ఇంట్లోవాళ్లకు తెలియకుండా చికిత్స చేయించుకుని, కోలుకున్నాక చెప్పానని పియా పేర్కొన్నారు. ఇటీవల 'లాస్ట్' అనే హిందీ చిత్రంలో నటించారామె. ఇక సమంత తన అనారోగ్యం విషయం బయటపెట్టిన రెండు నెలలకు డిసెంబర్‌లో పూనమ్ కౌర్ తనకు 'ఫైబ్రోమయాల్జియా' అనే విషయాన్ని బయట పెట్టారు. కండరాల నొప్పి, అలసట, నిద్రలేమితో ఈ వ్యాధి బాధపెడుతుంటుంది. రెండేళ్లుగా ఈ వ్యాధితో తాను బాధపడుతున్నట్లు తెలిపారు పూనమ్. కేరళలో ఆయుర్వేద చికిత్స మొదలుపెట్టిన ఆమె త్వరలోనే కోలుకుంటానని ఈ వ్యాధి గురించి ప్రకటించినప్పుడు తెలిపారు. మరోవైపు గత ఏడాది నవంబర్‌లో బాలీవుడ్ హీరోయిన్ ఫాతిమా సనా షేక్ తాను 'ఎపిలెప్సీ' (మూర్ఛ రోగం)తో బాధపడుతున్నట్లు తెలిపారు. అయితే తన వ్యాధి విషయాన్ని ఇప్పటివరకూ గోప్యంగా ఉంచడానికి కారణం ఇతరులు తనను బలహీనురాలు అనుకోకూడదని, ఒకవేళ అందరికీ తెలిస్తే తనకు పని ఇవ్వడానికి వెనకాడతారనే భయాలే అని పేర్కొన్నారు ఫాతిమా. కానీ ఇప్పుడు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తన విషయం బయటపెట్టానని స్పష్టం చేశారు. ''నేను షూటింగ్ చేస్తున్నప్పుడు మా యూనిట్‌లో ఒకరికి మూర్ఛ వచ్చింది. నేను ఆ వ్యక్తికి సహాయం చేశాను. నాకలా జరిగినప్పుడు ఇతరుల సహాయం కావాలి. అయితే ఇదేం తప్పు కాదు... దాచేయడానికి. అందుకే చెప్పాలనుకున్నాను. నా నిర్మాతలకు నా పరిస్థితి చెబుతుంటాను. లొకేషన్‌లో నాకు మూర్ఛ వచ్చిన సందర్భాలున్నాయి. ఆ టైమ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ముందే చెప్పడం హెల్ప్ అయింది'' అన్నారు ఫాతిమా. ఆమిర్ ఖాన్ కూతురుగా 'దంగల్'లో ఫాతిమా మల్ల యోధురాలుగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రం తనకు మంచి పేరు తెచ్చింది. ఆ తర్వాత నుంచి వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంటున్నారు ఫాతిమా. ఇక 2010లో మమతా మోహన్‌దాస్ కేన్సర్ బారిన పడ్డారు. ఆ విషయాన్ని బాహాటంగా చెప్పి, ధైర్యంగా చికిత్స చేయించుకున్నారామె. కేన్సర్‌పై అవగాహన కలిగించడానికి పలు విషయాలను పంచుకున్నారు కూడా. అయితే 2013లో మళ్లీ కేన్సర్ అని తెలిసినప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చికిత్స చేయించుకుని, కోలుకున్నారు. ఇప్పుడు మంగళవారం (17.01.) నాడు తాను చర్మ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని పంచుకున్నారు మమతా మోహన్‌దాస్. 'విటిలిగో' అనే చర్మ వ్యాధి సోకిందని పేర్కొన్నారామె. చర్మంపై మచ్చలు, చర్మం రంగు మారడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఇంకా ''ప్రియమైన సూర్యుడా.. ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు నిన్ను హత్తుకోవాలనుకుంటున్నాను. నా చర్మం రంగుని కోల్పోతున్నాను. నువ్వు ఉదయించక ముందే నీకోసం నేను నిద్రలేచి పొగమంచులో నీ తొలి కిరణాన్ని చూడటానికి వేచి చూస్తున్నాను. నీ వెచ్చదనాన్నంతా నాకు ఇచ్చెయ్. ఎందుకంటే నాకు అది ఎంతో మేలు చేస్తుంది. అందుకే నీకెప్పటికీ రుణపడి ఉంటాను'' అని మమతా మోహన్‌దాస్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. 'మీరు పెద్దవే దాటి వచ్చారు. ఇది చిన్న విషయం. ఇందులోంచీ బయటపడతారు' అని ఫ్యాన్స్ పోస్ట్ చేశారు.

అనారోగ్యం అనే విషయాన్ని బయటపెట్టడానికి ధైర్యం కావాలి. దాన్ని ఎదుర్కొని, కోలుకోవడానికి ఇంకా ధైర్యం కావాలి. ఈ చాలెంజ్‌లో 'గెలుపు ఖాయం' అని నమ్మడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన ఈ స్టార్స్ నిజమైన 'స్టార్స్'.


పూనమ్ కౌర్


ఫాతిమా సనా



పియా బాజ్‌పాయ్

హైదరాబాద్‌లో కోల్‌కతా!


చిరంజీవి

హైదరాబాద్‌లో కోల్‌కతా ఏంటీ అనుకుంటున్నారా! చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్' కోసం హైదరాబాద్‌లో కోల్‌కతా సెట్ వేశారు. మెహర్ రమేశ్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన కోల్‌కతా సెట్‌లో ఈ చిత్రం కొత్త షెడ్యూల్ మంగళవారం ప్రారంభం అయింది. ఈ సెట్‌లో చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని టాక్. ''మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. చిరంజీవిని స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో అద్భుతంగా చూపిస్తున్నారు మెహర్ రమేశ్. ఇందులో చిరంజీవి సోదరిగా కీర్తీ సురేశ్, తమన్నా కథానాయికగా నటిస్తున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: డడ్లీ.

ఏక్ ఖాకీ.. సౌ సైతాన్స్!


టబు

అజయ్ దేవగన్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'భోలా'. అజయ్ దేవగన్ ఫిలిమ్స్, టీ-సిరీస్ ఫిలిమ్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై అజయ్ దేవగన్, భూషణ్ కుమార్, కృషణ్ కుమార్, ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టబు కీలక పాత్ర చేస్తున్నారు. ఆమె చేస్తున్న పోలీస్ ఆఫీసర్ లుక్‌ని అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో షేర్ చేసి, 'ఏక్ ఖాకీ.. సౌ సైతాన్స్'(ఒక పోలీసు.. వంద మంది దెయ్యాలు) అంటూ రాసుకొచ్చారు. పోలీస్ డ్రెస్, చేతిలో గన్‌తో టబు పవర్‌ఫుల్‌గా, స్టైలిష్‌గా కనిపించారు. కార్తీ నటించిన 'ఖైదీ' చిత్రానికి హిందీ రీమేక్‌గా 'భోలా' తెరకెక్కుతోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం మార్చి 30న విడుదల కానుంది.

నీది కాని చోటే లేనే లేదు


ధనుష్

ధనుష్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు), 'వాత్తి' (తమిళం). సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సాయి సౌజన్యతో కలిసి సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఆడ ఉంది నీవే ఈడ ఉంది నీవే.. నీది కాని చోటే లేనే లేదు బంజారా...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు. ''జీవితం వెనుక ఉన్న వేదాంతాన్ని, జనన మరణాల మధ్య ఉన్న బతుకు బాట, దాని పరమార్థాన్ని ఈ పాటలో చెప్పే ప్రయత్నం చేశాం'' అన్నారు సుద్దాల అశోక్ తేజ. ''విద్యా వ్యవస్థ తీరు తెన్నులపై హీరో సాగించే జర్నీ, అందులోని సమస్యలు, ఘటనల సమాహారమే మా సినిమా'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: జె. యువరాజ్.

సూపర్ హీరో


అరవింద్

'శుక్ర, మాటరాని మౌనమిది' వంటి చిత్రాల దర్శకుడు సుకు పూర్వాజ్ తెరకెక్కిస్తున్న మూడో సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, 'బిగ్ బాస్' ఫేమ్ ఆషు రెడ్డి, స్నేహా గుప్తా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి హీరో లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. శ్రీకాంత్ కండ్రేగుల మాట్లాడుతూ– ''సూపర్ హీరో నేపథ్యంలో రూపొందనున్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. పిల్లలకు ఇష్టమైన సూపర్ హీరోను తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచయం చేస్తూ రాజీపడకుండా నిర్మించనున్నాం. ఈ నెల 26 నుండి ఫిబ్రవరి 10 వరకు అరకులో మొదటి షెడ్యూల్, ఫిబ్రవరి 18 నుండి మార్చి 30 వరకు రెండవ షెడ్యూల్ చిత్రీకరిస్తాం. ఏప్రిల్ 2 నుండి ఏప్రిల్ 10 వరకు కులూమనాలిలో జరిపే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది'' అన్నారు.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 297

బుధవారం 18-1-2023



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

భారత రాష్ట్ర సమితి ఖమ్మం బహిరంగ సభకు విచ్చేయుచున్న పెద్దలు, పార్టీ శ్రేణులకు

స్వాగతం - సుస్వాగతం

తేది. 18-01-2023 బుధవారం మం॥ 2 గం॥లకు









తెలంగాణ ఉద్యమం మొదలైన చోటు నుండే దేశ గుణాత్మక మార్పునకు, ప్రజల దుర్గతిని మాపేందుకు సమరశంఖం పూరించుటకై నేడు ఖమ్మంలో జరిగే **భారత రాష్ట్ర సమితి బహిరంగ సభ**కు విచ్చేయుచున్న ఉద్యమ పథగామి, భారత రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రివర్యులు

గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి,

కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ పినరయ్ విజయన్ గారికి,

ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ అరవింద్ కేజ్రీవాల్ గారికి,

పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ భగవంత్ మాన్‌సింగ్ గారికి,

ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ అఖిలేష్ యాదవ్ గారికి,

సిపిఐ జనరల్ సెక్రటరీ గౌ॥ శ్రీ డి.రాజా గారికి

మరియు జాతీయ స్థాయి రైతు సంఘాల నాయకులకు, వివిధ రంగాల నిపుణులకు, ప్రజాప్రతినిధులకు

స్వాగతం - సుస్వాగతం...

గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారు

భారత రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు



సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము - ఖమ్మం




మీ... పువ్వాడ అజయ్‌కుమార్

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖామాత్యులు



భారత మహిళల హాకీ జట్టు జోరు

దక్షిణాఫ్రికా జట్టుతో నాలుగు మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా 7–0 గోల్స్ తేడాతో నెగ్గింది. వందన రెండు గోల్స్ సాధించగా... ఉదిత, వైష్ణవి, రాణి రాంపాల్, సంగీత, నవనీత్ కౌర్ తలా ఒక గోల్ చేశారు. గోల్‌కీపర్ సవితా పూనియా కెప్టెన్సీలోని భారత జట్టు సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 5–1తో విజయం సాధించింది.



హర్లీ స్థానంలో యషశ్రీ

హైదరాబాద్ టీనేజ్ క్రికెటర్ సొప్పదండి యషశ్రీకి అండర్–19 టి20 ప్రపంచకప్‌లో ఆడే అవకాశం లభించింది. ప్రస్తుతం ఈ మెగా టోర్నీ దక్షిణాఫ్రికాలో జరుగుతోంది. అయితే భారత జట్టుకు ఎంపికైన హర్లీ గాలా గాయంతో టోర్నీకి దూరమైంది. దీంతో మెగా టోర్నీ సన్నాహక సిరీస్ ఆడేందుకు వెళ్లి అక్కడే ఉన్న యషశ్రీతో ఆమె స్థానాన్ని భర్తీ చేయాలనుకున్నారు. యషశ్రీ ఎంపికను ఐసీసీ టెక్నికల్ కమిటీ కూడా ఆమోదం తెలిపింది. ఈ టోర్నీలో నేడు జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడుతుంది.

హైదరాబాద్‌లో 'ఒక రోజు'...

ఆదివారం శ్రీలంకతో సిరీస్ ముగిసింది... బుధవారం మళ్లీ కొత్త వన్డే సిరీస్ మొదలు... ప్రత్యర్థి మారిందే తప్ప భారత్‌కు సంబంధించి ఇది కొనసాగింపు మాత్రమే... వన్డే వరల్డ్‌కప్ దారిలో తమ అస్త్రశస్త్రాల గురించి పరీక్షించుకునేందుకు రోహిత్ శర్మ బృందానికి ఇది మరో అవకాశం... బంగ్లాదేశ్ గడ్డపై ఓటమి, ఆపై శ్రీలంకపై క్లీన్‌స్వీప్ తర్వాత న్యూజిలాండ్ సవాల్ ఎదురుగా నిలిచింది. మరోవైపు విలియమ్సన్, సౌతీలు లేక కివీస్ కాస్త బలహీనంగా మారింది. నాలుగేళ్ల విరామం తర్వాత భాగ్యనగరం అభిమానులకు వన్డే క్రికెట్ భాగ్యం కలగడం విశేషం.

- నేడు భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే
- జోరు మీదున్న టీమిండియా
- ఆత్మవిశ్వాసంతో కివీస్
- మధ్యాహ్నం గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం


ఇషాన్, భరత్


రోహిత్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై మరో సిరీస్ విజయంపై దృష్టి పెట్టిన భారత జట్టు తొలి సమరానికి సిద్ధమైంది. నగరంలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం నేడు భారత్, న్యూజిలాండ్ మధ్య మొదటి వన్డేకు వేదిక కానుంది. లంకపై భారీ విజయం తర్వాత అదే జోరులో మరో సిరీస్ గెలుచుకునేందుకు భారత్ ముందు మంచి అవకాశం ఉంది. కివీస్‌కు సంబంధించి వన్డే వరల్డ్‌కప్ కోసం తిరిగి వచ్చే ముందు భారత్‌లో పరిస్థితులు అంచనా వేసేందుకు ఈ టూర్ ఉపయోగపడవచ్చు.

మార్పులతో...

ఆదివారం జరిగిన మ్యాచ్‌తో పోలిస్తే తుది జట్టులో మార్పులు ఖాయం. లంకతో మూడో వన్డే ఆడిన కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ వ్యక్తిగత కారణాలతో సిరీస్ నుంచి తప్పుకోగా, శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పితో మొత్తం సిరీస్‌కే దూరమయ్యాడు. రాహుల్ స్థానంలో కీపర్‌గా ఇషాన్ కిషన్ మిడిలార్డర్‌లో ఆడతాడని కెప్టెన్ రోహిత్ స్పష్టం చేశాడు. గత మ్యాచ్‌లో హార్దిక్‌కు బదులుగా సూర్యకుమార్ ఆడగా, ఇప్పుడు శ్రేయస్ తప్పుకోవడంతో వీరిద్దరు టీమ్‌లో ఉండటం ఖాయమైంది. టాపార్డర్ దుర్భేద్యంగా ఉండటంతో కివీస్‌కు కష్టాలు తప్పవు. కోహ్లి అద్భుతమైన ఫామ్, గిల్ జోరుకు తోడు రోహిత్ తనదైన శైలిలో చెలరేగితే టీమ్‌కు ఎదురుండదు. ముగ్గురు పేసర్లతో భారత్ బరిలోకి దిగనుంది. రెండో స్పిన్నర్‌గా చహల్, కుల్దీప్ మధ్య పోటీ ఉంది. వన్డే టీమ్‌లోకి ఎంపికైనా... ఆంధ్ర కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్‌కు అప్పుడే అవకాశం లభించకపోవచ్చు.

విలియమ్సన్ లేకుండా...

న్యూజిలాండ్ జట్టులో ఒక్కో ఆటగాడిని చూస్తే పెద్ద ఘనతలు కనిపించవు. కానీ జట్టుగా మాత్రం సమష్టితత్వంతో ఎంతటి కఠిన ప్రత్యర్థిపైనైనా పైచేయి సాధించగలదు. పాకిస్తాన్‌లో వన్డే సిరీస్ నెగ్గిన ఉత్సాహంతో ఉన్న జట్టు భారత్‌కు చేరుకుంది. ఇద్దరు ప్రధాన ఆటగాళ్లు విలియమ్సన్, సౌతీ ఈ సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో టీమ్‌లో అనుభవం తక్కువగా కనిపిస్తోంది. ఎక్కువ భాగం ఆటగాళ్లు భారత గడ్డపై ఎప్పుడూ ఆడనివారే. స్పిన్‌ను సమర్థంగా ఆడగల కెప్టెన్ టామ్ లాథమ్‌పై జట్టు బ్యాటింగ్ ప్రధానంగా ఆధారపడి ఉంది. అయితే స్పిన్నర్ ఇష్ సోధి గాయంతో ఈ మ్యాచ్‌కు దూరం కావడం జట్టును కొంత బలహీనపర్చింది. ఫెర్గూసన్, డౌగ్ బ్రేస్‌వెల్ తమ పేస్‌తో భారత్‌ను ఇబ్బంది పెట్టగలరు.


లాథమ్

పిచ్, వాతావరణం

హైదరాబాద్ మొదటి నుంచి బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. ప్రధాన బ్యాటర్లంతా ప్రతీసారి పరుగులు సాధించారు. అయితే పేస్‌తో పోలిస్తే స్పిన్ బౌలింగ్ కాస్త ఎక్కువ ప్రభావం చూపించగలదు. మ్యాచ్ రోజు నగరంలో ఎలాంటి వర్ష సూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, కోహ్లి, సూర్యకుమార్, ఇషాన్ కిషన్, హార్దిక్, సుందర్, కుల్దీప్ యాదవ్, షమీ, సిరాజ్, ఉమ్రాన్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), అలెన్, కాన్వే, చాప్‌మన్, మిచెల్, ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, ఫెర్గూసన్, డౌగ్ బ్రేస్‌వెల్.

55 ఇప్పటి వరకు భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మొత్తం 113 వన్డేలు జరిగాయి. ఇందులో భారత్ 55 మ్యాచ్‌ల్లో గెలుపొందగా... 50 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ విజయం సాధించింది. ఒక మ్యాచ్ 'టై' కాగా... ఏడు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

సింధు ఇంటికి... సైనా ముందుకు

- భారత స్టార్ షట్లర్లకు మిశ్రమ ఫలితాలు
- ఇండియా ఓపెన్ టోర్నీ


సైనా


సింధు

న్యూఢిల్లీ: ఈ ఏడాది వరుసగా రెండో అంతర్జాతీయ టోర్నీలోనూ భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ ఏడో ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గతవారం మలేసియా ఓపెన్ టోర్నీలోనూ సింధు తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 45 నిమిషాల్లో 12–21, 20–22తో ప్రపంచ 30వ ర్యాంకర్ సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది. గత ఏడాది ఇండియా ఓపెన్‌లో సెమీఫైనల్లో సుపనిద చేతిలోనే ఓడిపోయిన సింధుకు ఈసారీ అదే ఫలితం ఎదురైంది. మరోవైపు భారత్‌కే చెందిన మరో స్టార్ సైనా నెహ్వాల్ తీవ్రంగా శ్రమించి తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించింది. ప్రపంచ 24వ ర్యాంకర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో 63 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సైనా నెహ్వాల్ 21–17, 12–21, 21–19తో విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

లక్ష్య సేన్ శుభారంభం

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ లక్ష్య సేన్ (భారత్) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 21–14, 21–15తో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. గతవారం మలేసియా ఓపెన్ తొలి రౌండ్‌లో ప్రణయ్ చేతిలో ఎదురైన ఓటమికి ఈ విజయంతో లక్ష్య సేన్ బదులు తీర్చుకున్నాడు.

సాత్విక్ జోడీ ముందంజ

పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–13, 21–15తో మాథ్యూ–క్రిస్టోఫర్ గ్రిమ్లే (స్కాట్లాండ్) జోడీపై గెలిచింది. మరో మ్యాచ్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ (భారత్) జోడీ 21–11, 23–25, 21–9తో రూబెన్ జిలీ–టియెస్ వాన్ డెర్ (నెదర్లాండ్స్) ద్వయంపై నెగ్గింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రీసా జాలీ (భారత్) జంట 22–20, 17–21, 21–18తో మార్గోట్ లాంబర్ట్–ఆనీ ట్రాన్ (ఫ్రాన్స్) జోడీపై గెలుపొందగా... సిక్కి రెడ్డి–శ్రుతి మిశ్రా (భారత్) ద్వయం 17–21, 19–21తో లిండా ఎఫ్లెర్–ఇసాబెల్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

జొకోవిచ్ అలవోకగా...



- రెండో రౌండ్‌లోకి సెర్బియా స్టార్
- చెమటోడ్చి నెగ్గిన జ్వెరెవ్

మెల్‌బోర్న్: కోవిడ్ టీకా వేసుకోనందున... గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడే అవకాశం కోల్పోయిన తొమ్మిదిసార్లు చాంపియన్, సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ఈసారి అలవోక విజయంతో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ జొకోవిచ్ 6–3, 6–4, 6–0తో కార్‌బెలాస్ బేనా (స్పెయిన్)పై గెలుపొందాడు. 2 గంటల 2 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ తొమ్మిది ఏస్‌లు సంధించి, కేవలం ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. కార్‌బెలాస్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. నెట్ వద్దకు 26 సార్లు దూసుకొచ్చి 23 సార్లు పాయింట్లు గెలిచిన ఈ మాజీ నంబర్‌వన్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా 22వ విజయాన్ని నమోదు చేశాడు. ఈ టోర్నీలో 2019, 2020, 2021లలో విజేతగా నిలిచిన జొకోవిచ్ గతేడాది బరిలోకి దిగలేదు.

ముర్రే మారథాన్ పోరులో...

మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అత్యధికంగా ఐదుసార్లు రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ మాజీ నంబర్‌వన్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే తొలి రౌండ్‌లో అతికష్టమ్మీద విజయం అందుకున్నాడు. ప్రపంచ 14వ ర్యాంకర్ మాటియో బెరెటిని (ఇటలీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 49వ ర్యాంకర్ ఆండీ ముర్రే 6–3, 6–3, 4–6, 6–7 (7/9), 7–6 (10/6)తో గెలుపొందాడు. 4 గంటల 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముర్రే 10 ఏస్‌లు సంధించి, 34 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు బెరెటిని 31 ఏస్‌లు సంధించినా, ఏకంగా 59 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. నెట్ వద్దకు 39 సార్లు దూసుకొచ్చిన ముర్రే 23 సార్లు పాయింట్లు గెలుపొందగా... బెరెటిని 49 సార్లు నెట్ వద్దకు వచ్చి 32 సార్లు పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో 12వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) కూడా శ్రమించి గెలుపొందాడు. 'లక్కీ లూజర్' యువాన్ పాబ్లో వారిలాస్ (పెరూ)తో జరిగిన తొలి రౌండ్‌లో జ్వెరెవ్ 4–6, 6–1, 5–7, 7–6 (7/3), 6–4తో గెలిచాడు. 4 గంటల 9 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ 21 ఏస్‌లు కొట్టాడు. 46 అనవసర తప్పిదాలు చేసిన ఈ జర్మనీ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6–3, 7–6 (8/6), 6–7 (5/7), 6–3తో టొమాస్ మచాచ్ (చెక్ రిపబ్లిక్)పై, ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) 6–3, 6–4, 6–2తో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)పై, ఎనిమిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6–4, 6–2, 4–6, 7–5తో బాసిలాష్‌విలి (జార్జియా)పై విజయం సాధించారు.

ముగురుజాకు షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో 2020 రన్నరప్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్) పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఎలైజ్ మెర్‌టెన్స్ (బెల్జియం) 3–6, 7–6 (7/3), 6–1తో ముగురుజాను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ ఆన్స్ జెబర్ (ట్యునీషియా) 7–6 (10/8), 4–6, 6–1తో తామర జిదాన్‌సెక్ (స్లొవేనియా)పై, నాలుగో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 6–3, 6–0తో కేథరీన్ సెబోవ్ (కెనడా)పై, ఐదో సీడ్ సబలెంకా (బెలారస్) 6–1, 6–4తో తెరెజా మార్టిన్‌కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు.

'సిరాజ్ కీలక బౌలర్‌గా ఎదిగాడు'

హైదరాబాద్ పేసర్‌పై రోహిత్ ప్రశంసలు



సాక్షి, హైదరాబాద్: భారత పేసర్, హైదరాబాదీ మొహమ్మద్ సిరాజ్ ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. 2022 జనవరి 1 నుంచి చూస్తే 18 వన్డేల్లో అతను కేవలం 19.87 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు. అసోసియేట్ జట్లను మినహాయిస్తే ఒక బౌలర్ పడగొట్టిన అత్యధిక వికెట్లు ఇవే. అదీ 4.53 ఎకానమీతో పరుగులు కూడా ఇవ్వకుండా కట్టడి చేయగలిగాడు. 42 మ్యాచ్‌ల కెరీర్ తర్వాత తన సొంత నగరంలో సిరాజ్ బుధవారం తన తొలి మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్ శర్మ అతనిపై ప్రత్యేక ప్రశంసలు కురిపించాడు. జట్టులో సిరాజ్ విలువేమిటో చెబుతూ అతనికి బెస్ట్ విషెస్ చెప్పాడు. 'సిరాజ్ గత కొంత కాలంగా మూడు ఫార్మాట్‌లలో ఎంతో మెరుగయ్యాడు. లైన్ అండ్ లెంగ్త్ ఎంతో మెరుగైంది. ముఖ్యంగా అవుట్ స్వింగ్‌లో పదును పెరిగింది. కొత్త బంతితో బంతిని స్వింగ్ చేయడం అంత సులువు కాదు. ఈ విషయంలో అతను ఎంతో నైపుణ్యం సంపాదించాడు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కోవడం ఏ బ్యాటర్‌కైనా చాలా కష్టం. సరిగ్గా చెప్పాలంటే తన బౌలింగ్‌ను అతను అర్థం చేసుకోవడంతో పాటు జట్టు తన నుంచి ఏం ఆశిస్తుందో కూడా గుర్తించాడు. ఆరంభంలో, మధ్య ఓవర్లలో వికెట్లు తీయగల సత్తా అతనిలో ఉంది. రాన్రానూ అతని గ్రాఫ్ మరింత పైకి వెళుతోంది. సిరాజ్‌ను సరైన రీతిలో మేనేజ్ చేయడం మాకు అవసరం. వరల్డ్‌కప్, త్వరలో ఆస్ట్రేలియాతో జరిగే టెస్టు సిరీస్ కోసం అతడికి తగిన విరామాలు ఇస్తూ సరైన రీతిలో ఉపయోగించుకుంటాం. హోం గ్రౌండ్ మ్యాచ్‌లో అతనికి బెస్ట్ విషెస్' అని రోహిత్ అన్నాడు. మరోవైపు మంచు ప్రభావాన్ని తగ్గించేందుకు భారత్‌లో జరిగే వన్డేలను (రాబోయే వరల్డ్ కప్ సహా) కాస్త ముందుగా నిర్వహించాలనే సూచనతో తానూ ఏకీభవిస్తానని... అయితే ఇది సాధ్యమా, కాదా తాను చెప్పలేనని, ప్రసారకర్తలు ఇలాంటివి నిర్ణయిస్తారని రోహిత్ అభిప్రాయపడ్డాడు.

బెల్జియం, జర్మనీ మ్యాచ్ 'డ్రా'

ప్రపంచకప్ హాకీ టోర్నీ



భువనేశ్వర్: డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, మాజీ విజేత జర్మనీ జట్ల మధ్య మంగళవారం జరిగిన ప్రపంచకప్ హాకీ టోర్నీ లీగ్ మ్యాచ్ 2–2తో 'డ్రా'గా ముగిసింది. పూల్ 'బి'లో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెల్జియం ఓటమి అంచున నిలిచింది. అయితే ఆఖరి క్వార్టర్లో వెగ్నెజ్ (54వ ని.లో) చేసిన గోల్‌తో 'డ్రా'తో బయటపడింది. అంతకుముందు జర్మనీ జట్టులో వెలెన్ నిక్లస్ (22వ ని.లో), టామ్ గ్రామ్‌బుష్ (52వ ని.లో) చెరో గోల్ చేయగా, సెడ్రిక్ చార్లియర్ 9వ నిమిషంలోనే బెల్జియంకు తొలి గోల్ అందించాడు. ఈ నెల 20న జరిగే ఆఖరి లీగ్‌తో క్వార్టర్స్ బెర్త్‌లు ఖరారవుతాయి. చివరి లీగ్ మ్యాచ్‌ల్లో జపాన్‌తో బెల్జియం, దక్షిణ కొరియాతో జర్మనీ తలపడతాయి. ఈ పూల్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2–1తో జపాన్‌పై గెలిచింది. కొరియా తరఫున లీ జంగ్ జన్ (8వ, 23వ ని.లో) రెండు గోల్స్ చేశాడు. జపాన్ జట్టులో నగయొషి (1వ ని.లో) గోల్ సాధించాడు. అయితే జపాన్ 11 మందితో కాకుండా 12 మందితో ఆడటం వివాదం రేపింది.

అర్జున్ గేమ్ 'డ్రా'



విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ నిలకడగా ఆడుతున్నాడు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో అర్జున్ వరుసగా నాలుగో 'డ్రా' నమోదు చేశాడు. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో మంగళవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను అర్జున్ 45 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో ప్రజ్ఞానంద (భారత్)తో, రెండో రౌండ్‌లో సో వెస్లీ (అమెరికా)తో, మూడో రౌండ్‌లో అరోనియన్ (అమెరికా)తో జరిగిన గేమ్‌లను అర్జున్ 'డ్రా'గా ముగించాడు. నాలుగో రౌండ్ తర్వాత అర్జున్ రెండు పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి మూడు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో 12వ ర్యాంక్‌లో, గుకేశ్ ఒక పాయింట్‌తో చివరిదైన 14వ ర్యాంక్‌లో ఉన్నారు.

మెరిసిన ధీరజ్, సురేఖ

జాతీయ ఓపెన్ ఆర్చరీ ట్రయల్స్‌లో అగ్రస్థానం


ధీరజ్


సురేఖ

కోల్‌కతా: ఈ ఏడాది జరిగే ప్రపంచకప్ టోర్నీలు, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత ఆర్చరీ జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ఓపెన్ సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు బొమ్మదేవర ధీరజ్, వెన్నం జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. మంగళవారం ముగిసిన ఈ ట్రయల్స్‌లో పురుషుల రికర్వ్ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ) జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ ఓవరాల్‌గా 2767 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. పార్థ్ సాలుంకే (మహారాష్ట్ర), జయంత తాలుక్‌దార్ (జార్ఖండ్), అతాను దాస్ (పీఎస్‌పీబీ), సుఖ్‌చెయిన్ సింగ్ (సర్వీసెస్), తరుణ్‌దీప్ రాయ్ (సర్వీసెస్), సుఖ్‌మణి (మహారాష్ట్ర), నీరజ్ చౌహాన్ వరుసగా రెండు నుంచి ఎనిమిది ర్యాంక్‌ల్లో నిలిచారు. తద్వారా ఈ ఏడాది జరిగే అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే భారత జట్టులో చోటు సంపాదించేందుకు అర్హత పొందారు.

మరోవైపు మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ ఓవరాల్‌గా 2828 పాయింట్లు సాధించి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. సురేఖతోపాటు పర్ణీత్ కౌర్, అదితి, ప్రగతి, సాక్షి చౌదరీ, ముస్కాన్, ఐశ్వర్య శర్మ, సృష్టి సింగ్ కూడా ఈ ఏడాది జరిగే మెగా ఈవెంట్స్‌లో పాల్గొనే టీమిండియా సెలెక్షన్స్‌కు అర్హత పొందారు. మహిళల రికర్వ్ విభాగం ట్రయల్స్‌లో 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి ఏడో ర్యాంక్‌లో నిలిచి భారత జట్టులో పునరాగమనం చేయడానికి అర్హత సాధించింది.

ఆంధ్ర 256/5

- రికీ భుయ్ అర్ధ సెంచరీ
- సౌరాష్ట్రతో రంజీ పోరు


రికీ భుయ్

రాజ్‌కోట్: ఆంధ్ర బ్యాటర్ రికీ భుయ్ (155 బంతుల్లో 80; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో సౌరాష్ట్రతో జరుగుతున్న మ్యాచ్‌లో తొలిరోజు ఆట నిలిచే సమయానికి ఆంధ్ర జట్టు 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ముందుగా ఓపెనర్లు జ్ఞానేశ్వర్ (34; 6 ఫోర్లు), అభిషేక్ రెడ్డి (46; 8 ఫోర్లు) తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభమే ఇచ్చారు. అయితే సౌరాష్ట్ర స్పిన్నర్ ధర్మేంద్ర సింగ్ జడేజా (3/80) తన వరుస ఓవర్లలో అభిషేక్, జ్ఞానేశ్వర్‌లను పెవిలియన్ చేర్చాడు. అనంతరం కెప్టెన్ హనుమ విహారి (38; 7 ఫోర్లు), రికీ భుయ్ మూడో వికెట్‌కు 70 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ దశలో విహారిని కూడా జడేజా బౌల్డ్ చేశాడు. తర్వాత కరణ్ షిండే (31; 5 ఫోర్లు) అండతో రికీ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆట ముగిసే దశలో చేతన్ సకారియా బౌలింగ్‌లో రికీ భుయ్ వెనుదిరిగాడు.

'టాప్'లోకి శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఫుట్‌బాల్ ఐ–లీగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) మళ్లీ టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది. మంగళవారం జరిగిన తమ 12వ లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 4–0 గోల్స్ తేడాతో రౌండ్‌గ్లాస్ పంజాబ్ ఎఫ్‌సీ జట్టును చిత్తుగా ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున కెప్టెన్ డేవిడ్ కాస్టెనెడా మునోజ్ రెండు గోల్స్ (30వ, 88వ ని.లో) చేయగా... షహబాజ్ (12వ ని.లో), సొరైషామ్ దినేశ్ సింగ్ (62వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. 12 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో శ్రీనిధి జట్టు 12 లీగ్ మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 8 విజయాలు, ఒక 'డ్రా', మూడు పరాజయాలతో మొత్తం 25 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో ఈనెల 23న ముంబైకి చెందిన కెన్‌క్రె ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి జట్టు ఆడుతుంది.


దినేశ్

మహారాష్ట్ర భారీ స్కోరు

- నౌషాద్ షేక్ అజేయ సెంచరీ
- రాణించిన కేదార్ జాదవ్


కేదార్ నౌషాద్

పుణే: హైదరాబాద్ బౌలర్లపై మహారాష్ట్ర బ్యాటర్ నౌషాద్ షేక్ (145 బ్యాటింగ్; 20 ఫోర్లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. టీమిండియా మాజీ ప్లేయర్ కేదార్ జాదవ్ (71; 9 ఫోర్లు, 1 సిక్స్), ఆశయ్ పాల్కర్ (61 బ్యాటింగ్; 9 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో ఎలైట్ గ్రూప్ 'బి'లో మంగళవారం ఇక్కడ మొదలైన రంజీ మ్యాచ్‌లో మహారాష్ట్ర భారీస్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట నిలిచే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది. ఓపెనర్లు రుతురాజ్ (8)ను రవితేజ, సౌరభ్ నవాలే (29)ను కార్తికేయ తక్కువ స్కోర్లకే అవుట్ చేశారు. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ 3, రవితేజ 2 వికెట్లు తీశారు.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 297

బుధవారం 18-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



గుణపాఠాలు నేర్చుకున్నాం

భారత్‌తో జరిగిన యుద్ధాలతో గుణపాఠాలు నేర్చుకున్నామన్న పాక్ ప్రధాని - 6లో



మార్కెట్ బౌన్స్‌బ్యాక్

సెన్సెక్స్ 563 పాయింట్లు అప్... నిఫ్టీ 158 పాయింట్లు జూమ్ - 11లో



100 రోజుల్లో కోటిన్నర మందికి స్క్రీనింగ్

ఖమ్మంలో నేడు సీఎం రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 19 నుంచి మిగతా అన్ని జిల్లాల్లో ప్రారంభమవుతుంది.

- వివరాలు 3లో▶



చక్కెర స్థాయిలను నియంత్రించే..

టైప్–2 మధుమేహులకు శుభవార్త. ఒంట్లో చక్కెర మోతాదులను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచే కృత్రిమ క్లోమాన్ని కేంబ్రిడ్జి వర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు.

- వివరాలు 6లో▶

'ప్రత్యామ్నాయ' శక్తిగా..

భారీ బల ప్రదర్శన ద్వారా బీఆర్‌ఎస్ సత్తా చాటే యత్నం

జాతీయ రాజకీయాల దృష్టిని ఆకర్షించేలా నేడు ఖమ్మంలో భారీ సభ



ఖమ్మంలో బుధవారం జరిగే బీఆర్‌ఎస్ సభకు ముస్తాబైన సభాస్థలి, ప్రధాన వేదిక

- 'ప్రత్యామ్నాయాన్ని' నడిపే శక్తి కేసీఆర్‌కు ఉందని సంకేతాలిచ్చేలా...
- తెలంగాణ మోడల్‌ను దేశం ముందు పెట్టేలా ప్రణాళిక
- నలుగురు బీజేపీ వ్యతిరేక సీఎంలు నేడు ఒకే వేదికపైకి..
- యూపీ మాజీ సీఎం అఖిలేశ్, కమ్యూనిస్టు పార్టీల జాతీయ నేతలు కూడా..
- సుమారు 5 లక్షల మందిని సమీకరించేలా ఏర్పాట్లు
- ఇక్కడి నుంచే కేసీఆర్ ఎన్నికల సమర శంఖం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలే ప్రధాన ఎజెండా
- చేరికలు, విలీనాలపైనా కేసీఆర్ ప్రకటనలు చేసే అవకాశం

ఖమ్మం నుంచి సాక్షి ప్రతినిధి: ఖమ్మం వేదికగా జాతీయ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)కి బలమైన పునాదులు వేయాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మంలో బుధవారం భారీ బహిరంగ సభను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. సీఎం కేసీఆర్‌తో పాటు మరో ముగ్గురు ముఖ్యమంత్రులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు పార్టీలకు చెందిన జాతీయ నేతలు వేదిక పంచుకోనున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌లకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యామ్నాయంగా మారుతుందని చెబుతూ వస్తున్న కేసీఆర్.. ఖమ్మంలో మరింత బలంగా ఈ సందేశాన్ని ఇవ్వనున్నారు. ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు, దానిని నడిపే శక్తి బీఆర్‌ఎస్‌కు ఉందనే సంకేతాలను ఈ సభ ద్వారా కేసీఆర్ ఇచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్‌ఎస్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకుల చేరికలు, పార్టీల విలీనానికి సంబంధించిన ప్రకటన కూడా ఇక్కడ చేస్తారని సమాచారం. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ సత్తా చాటేలా భారీ జన సమీకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నలుగురు సీఎంలు తొలిసారిగా..

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో తొలిసారిగా ఖమ్మంలో విపక్ష పార్టీలకు చెందిన నలుగురు ముఖ్యమంత్రులు ఒకే వేదికను పంచుకోనున్నారు. మూడేళ్లుగా విపక్ష పార్టీలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, కేజ్రీవాల్, భగవంత్‌మాన్, నవీన్ పట్నాయక్, స్టాలిన్, పినరయి విజయన్, హేమంత్ సొరేన్‌తో పాటు

మిగతా 2వ పేజీలో ▶

ఖమ్మం గులాబీ వనం
- బీఆర్‌ఎస్ సభకు అట్టహాసంగా ఏర్పాట్లు
- నూతన కలెక్టరేట్, 'కంటివెలుగు' ప్రారంభోత్సవం

2 లో 'బీఆర్‌ఎస్ అతిథుల'కు మంత్రుల స్వాగతం



మోదీ శంఖారావం

- ఎన్నికలకు మరో 400 రోజులే
- టాప్ గేర్లోకి వెళ్లాల్సిన టైమొచ్చింది... బీజేపీ నేతలకు, శ్రేణులకు మోదీ పిలుపు
- 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి తీరాలి
- బీజేపీ జాతీయ కార్యవర్గ భేటీలో దిశానిర్దేశం

"రానున్నది మన దేశానికి అత్యుత్తమ సమయం. ప్రజలకు సేవ చేసేందుకు అన్ని విధాలుగా కష్టపడదాం. అతి విశ్వాసానికి పోతే ప్రతికూల ఫలితాలు తప్పవు. లోక్‌సభ ఎన్నికలు 400 రోజుల దూరంలోనే ఉన్నాయి. 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా పని చేద్దాం. చరిత్ర సృష్టిద్దాం.. పదండి. 'బేటీ పఢావో' మాదిరిగా 'ధర్తీ బచావో' ఉద్యమానికి శ్రీకారం చుడదాం. వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండండి.

– బీజేపీ నేతలు, శ్రేణులతో ప్రధాని మోదీ

నడ్డాకు పొడిగింపు

2024 జూన్ దాకా ఆయనే బీజేపీ చీఫ్

- వివరాలు 6లో▶

రాష్ట్రంలో అలాక్స్ రూ.750 కోట్ల పెట్టుబడి

మల్టీ గిగావాట్ లిథియం క్యాథోడ్ మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు

- తెలంగాణలో పెప్సికో సేవల విస్తరణకు నిర్ణయం... హైదరాబాద్‌లో అపోలో టైర్స్ డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్
- మంత్రి కేటీఆర్ సమక్షంలో దావోస్ వేదికగా కీలక ఒప్పందాలు

3 లో





అన్నీ ఆ ఆరుగురే!

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు కీలక బాధ్యతలు
- ఒక వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఒక లోక్‌సభ నియోజకవర్గం బాధ్యతలు.. తోడుగా ఇద్దరు ఉపాధ్యక్షుల నియామకం
- రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తగా ఒక ప్రధాన కార్యదర్శి
- మొత్తంగా ఒక పార్లమెంటు నియోజకవర్గానికి ఆరుగురు ఇన్‌చార్జులు
- అన్ని వ్యవహారాలు వీరు చక్కదిద్దాల్సిందే.. త్వరలో జాబితా విడుదల

- వివరాలు 2లో▶

ముకరంజాకు సీఎం కేసీఆర్ నివాళి

- టర్కీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న 8వ నిజాం పార్థివదేహం
- నేడు మక్కా మసీదులో అంత్యక్రియలు

- వివరాలు 5లో▶

అన్నీ ఆ ఆరుగురే!



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు కీలక బాధ్యతలు

ఒక వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఒక లోక్‌సభ నియోజకవర్గం బాధ్యతలు.. తోడుగా ఇద్దరు ఉపాధ్యక్షుల నియామకం

- రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తగా ఒక ప్రధాన కార్యదర్శి..
- మొత్తంగా ఒక పార్లమెంటు నియోజకవర్గానికి ఆరుగురు ఇన్‌చార్జులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో సంస్థాగత పని విభజన ప్రక్రియ ఊపందుకుంది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు ఇటీవల పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారికి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగించేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఒక పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఒక వర్కింగ్ ప్రెసిడెంట్‌కు పూర్తి స్థాయి బాధ్యతలు పార్టీ అప్పజెప్పనుంది. వారికి తోడుగా ఇద్దరు ఉపాధ్యక్షులను కూడా నియమించనుంది. ఈ క్రమంలోనే ఏ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షులకు ఏ పార్లమెంటు నియోజకవర్గం అప్పగించాలన్న దానిపై టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఇక టీపీసీసీ ప్రధాన కార్యదర్శులకు అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించనున్నారు. రాష్ట్రంలోని ప్రతి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక ప్రధాన కార్యదర్శిని సమన్వయకర్తగా నియమించాలని, ఒక పార్లమెంటు పరిధిలోనికి వచ్చే ముగ్గురు అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో పాటు ఒక వర్కింగ్ ప్రెసిడెంట్, ఇద్దరు ఉపాధ్యక్షులు కలిపి మొత్తం ఆరుగురు నాయకులను ఒక లోక్‌సభ నియోజకవర్గంలో రంగంలోకి దింపనుంది.



ఎక్కడా సమన్వయ లోపం లేకుండా..

గాంధీభవన్ నుంచి రాష్ట్రంలోని ప్రతి పోలింగ్ బూత్ వరకు ఎక్కడా సమన్వయ లోపం లేకుండా చూసేందుకు ఈ పని విభజన చేపడుతున్నామని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, స్థానిక నాయకులకు తోడుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పని చేస్తారని చెబుతున్నాయి. ఒకవేళ వీరిలో ఎన్నికల్లో పోటీ చేసే నేతలున్నట్టైతే వారి స్థానాలకు వెళ్లిపోతారని, మిగిలిన వారంతా ఆ పార్లమెంటు స్థానం పరిధిలోనే ఎన్నికలు పూర్తయ్యేంతవరకు పనిచేస్తారని తెలిపాయి. కిందిస్థాయి నుంచి పైవరకు అన్ని వ్యవహారాలను చక్కదిద్దే బాధ్యతతో పాటు సమన్వయం, పర్యవేక్షణ, పార్టీ కార్యక్రమాల అమలు లాంటి అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం ఈ ఇన్‌చార్జులకు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థికి అనుగుణంగా ఎన్నికల సమయంలో పనిచేయించడంతో పాటు ఎన్నికలకు ముందు ఆ నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను ఉత్సాహపరిచే బాధ్యతను ఈ ఇన్‌చార్జులు తీసుకుంటారని, అంతర్గత సమస్యల నుంచి ఎన్నికల సంఘం సూచనల వరకు అన్ని అంశాల్లోనూ ఈ ఆరుగురు నేతలు కీలకంగా వ్యవహరిస్తారని తెలుస్తోంది.

ఎన్నికలు ముగిసే వరకు అక్కడే..



స్థానిక నేతలు, పార్టీ తరపున అసెంబ్లీ.. లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో కలిసి 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంటు ఎన్నికలు ముగిసేంతవరకు ఈ ఆరుగురు నేతలు వారికి కేటాయించిన లోక్‌సభ నియోజకవర్గంలోనే పని చేయనున్నారు. ఈ మేరకు పార్లమెంటరీ నియోజకవర్గాల వారీ జాబితాను కూడా త్వరలోనే అధికారికంగా విడుదల చేయనున్నట్టు సమాచారం.

మళ్లీ ఠాక్రే మార్కు 'చర్చలు'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మరోమారు తన మార్కు చర్చలకు సిద్ధమయ్యారు. ఈనెల 20న రెండోసారి రాష్ట్రానికి రానున్న ఆయన రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో విస్తృతస్థాయిలో చర్చించనున్నారు. 20వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీ నుంచి గాంధీభవన్‌కు రానున్న ఆయన వరుసగా మూడు రోజుల పాటు పార్టీ నాయకులతో సమావేశం కానున్నారు. తొలిరోజు టీపీసీసీ ప్రచార కమిటీ, ఎన్నికల నిర్వహణ కమిటీ, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీలతో భేటీ అవుతారని, ఈ కమిటీ సమావేశాల అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. రెండోరోజు గాంధీభవన్‌లో జరిగే విస్తృతస్థాయి సమావేశానికి హాజరై హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలపై దిశానిర్దేశం చేయనున్నారు.

క్లుప్తంగా...

క్విడ్‌ప్రోకోతోనే ఖమ్మం సభ: రఘునందన్



సాక్షి, హైదరాబాద్: ఖమ్మంలో బుధవారం నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావసభ నిర్వహణ వెనుక 'క్విడ్‌ప్రోకో' కోణం ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. మియాపూర్ హఫీజ్‌పేట్‌లోని సర్వే నంబర్ 78లో ఆదిత్య కంపెనీ పేరిట తోట చంద్రశేఖర్ కొన్న 40 ఎకరాల ప్రభుత్వ భూములను (సుమారు రూ.4వేల కోట్ల విలువ) ఆయనకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇందుకు ప్రతిఫలంగా 'క్విడ్‌ప్రోకో'కింద ఖమ్మం సభకు చంద్రశేఖర్‌తో ఖర్చు పెట్టిస్తున్నారన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఈ భూములను బీఆర్‌ఎస్ ఏపీ విభాగం అధ్యక్షుడికి ఎలా కట్టబెడుతున్నారో ఖమ్మం సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాం నవాబు వారసుడికి అధికారిక అంత్యక్రియలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ద్వారా తెలంగాణ పోరాట అమరులను అవమానించినట్లు అయ్యిందన్నారు.

కేసీఆర్ ఈసారైనా నిజాలు మాట్లాడతారని భావిద్దాం



సాక్షి, హైదరాబాద్: పాత అబద్ధాలను ప్రచారం చేస్తూ, కొత్త అబద్ధాలతో ప్రజలను నమ్మించే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖమ్మం సభలోపు అయినా నిజాలు మాట్లాడతారని భావిద్దామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. భవిష్యత్తేలేని బీఆర్‌ఎస్ ఎజెండాను దేశంపై రుద్దేందుకు తమ స్వార్థ రాజకీయాలను దేశవ్యాప్తం చేయడానికి ఖమ్మం జిల్లాలో సభ నిర్వహించడం హాస్యాస్పదమని వై.ఎస్. షర్మిల విమర్శించారు. ఈ మేరకు జిల్లాలో నెలకొన్న పది సమస్యలపై టీఆర్‌ఎస్‌ను ప్రశ్నిస్తూ సీఎం కేసీఆర్‌కు మంగళవారం వై.ఎస్.షర్మిల బహిరంగ లేఖ రాశారు.

మెదక్‌లో పోటీ చేయమనండి: మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ బలంగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలో పోటీ చేస్తామంటూ ప్రధాని మోదీ, అమిత్ షాలు లీకులిస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి అన్నారు. నిజంగా కేసీఆర్‌పై బీజేపీ పోరాటం చేస్తుంటే మోదీ, అమిత్‌షాలు పోటీ చేయాల్సింది మహబూబ్‌నగర్‌లో కాదని, మెదక్‌లో పోటీ చేయాలని సూచించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌కు లబ్ధి కలిగించేలా బీజేపీ ప్రయత్నాలున్నాయని విమర్శించారు.

రాష్ట్రంలోనూ రామరాజ్యం స్థాపిస్తాం: బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ రాజరాజ్యం స్థాపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ దిశగా తెలంగాణలో క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యచరణ కొనసాగుతోందని తెలిపారు. రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం మంగళవారం ఎంపీ బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజా సంగ్రామ యాత్రపై అన్ని రాష్ట్రాలకూ ప్రధాని మోదీ సూచనలు చేశారని సంజయ్ తెలిపారు. తెలంగాణలో పార్టీ కార్యకర్తలను అభినందించారని, ప్రధాని మోదీ ఇచ్చిన జోష్‌తో రాష్ట్రంలో ముందుకి వెళ్తామన్నారు.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత : కిషన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ పార్టీ, కల్వకుంట్ల కుటుంబంపై తెలంగాణ ప్రజల్లో విశ్వాసం లేదని, తీవ్రమైన వ్యతిరేకత ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. అందుకే త్వరలోనే ఈ కుటుంబాన్ని ఫాం హౌజ్‌కు పరిమితం చేయడం ఖాయమన్నారు. జాతీయ కార్యవర్గ సమావేశాల్లో దేశంలోని రాజకీయ పరిస్థితులపై 'రాజకీయ తీర్మానం 'ప్రవేశపెట్టి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడారు. దేశంలో ఎక్కడైనా ప్రజలను నమ్ముకొని నాయకులు ఎన్నికలకి వెళ్తున్నారని. కానీ తెలంగాణలో మాత్రం ఎన్నికలు డబ్బులతో జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే భయపడే పరిస్థితి తీసుకువచ్చారని.. టికెట్ ఇచ్చే ముందే ఎన్ని డబ్బులు ఉన్నాయని అడుగుతున్నారన్నారు.

ఖమ్మంలో ఎటు చూసినా గులాబీ రెపరెపలే..



ఖమ్మం గులాబీ వనం

- ఎక్కడ చూసినా గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లు.. బీఆర్‌ఎస్ సభకు అట్టహాసంగా ఏర్పాట్లు
- నూతన కలెక్టరేట్, కంటివెలుగు రెండోదశకు ప్రారంభోత్సవం
- మంత్రులు హరీశ్, పువ్వాడ నేతృత్వంలో సర్వం సిద్ధం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) తొలి బహిరంగ సభకు ఖమ్మం ముస్తాబైంది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సభ పురస్కరించుకుని నగరమంతా గులాబీ తోటలా మారింది. రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ ఐదు రోజులుగా ఇక్కడే మకాం వేసి ఏర్పాట్లు చేయించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ఢిల్లీ, పంజాబ్, కేరళ రాష్ట్రాల సీఎంలు, పలు పార్టీల జాతీయ స్థాయి నేతలు హాజరవుతుండడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నూతన కలెక్టరేట్‌కు ప్రారంభోత్సవం, మెడికల్ కళాశాలకు శంకుస్థాపన, కంటివెలుగు రెండో దశ ప్రారంభ కార్యక్రమంలో కూడా అతిథులు పాల్గొంటారు. వీరంతా ప్రసంగించాక చివర్లో కేసీఆర్ ప్రసంగించనున్నారు. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావుకు కూడా ఆహ్వానం అందింది. మంత్రి పువ్వాడతో పాటు పలువురు ముఖ్యనేతలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా వేదికపైకి ఆహ్వానిస్తారు.

13 నియోజకవర్గాలు.. 5 లక్షల మంది

ఖమ్మం సమీపాన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని వంద ఎకరాల్లో సభకు ఏర్పాట్లు చేశారు. ఐదు లక్షల మంది వీక్షించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఉమ్మడి ఖమ్మంతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని 13 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేస్తున్నారు. ఇక ఖమ్మానికి తూర్పు, పశ్చిమం వైపు మొత్తం 20 పార్కింగ్ ప్రాంతాలకు 448 ఎకరాలు కేటాయించారు. సభ ప్రాంగణంలో 25 ఎల్‌ఈడీలు, లక్ష మంది కూర్చునేలా కుర్చీలు ఏర్పాట్లు చేశారు. 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 12 లక్షల తాగునీటి ప్యాకెట్లు సిద్ధం చేశారు. సీనియర్, జూనియర్ ఐపీఎస్‌లు, పోలీసు సిబ్బంది కలిపి 5,200 మంది బందోబస్తులో పాల్గొంటుండగా, కలెక్టరేట్, సభా ప్రాంగణంలో 100కు పైగా సీసీ కెమెరాలు అమర్చారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ, వరంగల్ సీపీ ఏ.వీ.రంగనాథ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ బందోబస్తులో నిమగ్నమయ్యారు.

సీఎంల పర్యటన షెడ్యూల్

- పినరయి విజయన్ మినహా మిగతా ముగ్గురు సీఎంలు, ముఖ్య నేతలు బుధవారం ఉదయం 10.10 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి రెండు హెలీకాప్టర్లలో బయలుదేరతారు. (పినరయి విజయన్ నేరుగా ఖమ్మంకు వెళ్తారు.)
- 10.35 గంటలకు యాదగిరిగుట్ట చేరుకుని 10.40 గంటలకు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భక్తులకు దర్శనాలు, ఆర్జిత సేవలను నిలిపివేశారు.
- 11.40 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.20 గంటలకు ఖమ్మం చేరుకుంటారు.
- ఖమ్మంలో నూతన కలెక్టరేట్‌తో పాటు కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు.
- 2.25 గంటలకు కలెక్టరేట్ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి 2.30 గంటలకు బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు.
- 2.30 నుంచి 5 గంటల వరకు సభలో పాల్గొంటారు. కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు ముగ్గురూ హెలీకాప్టర్‌లో విజయవాడ వెళ్లి అక్కడినుంచి విమానాల్లో వారి రాష్ట్రాలకు బయలుదేరతారు.
- సీఎం కేసీఆర్ ఖమ్మం నుంచి నేరుగా హెలీకాప్టర్‌లో హైదరాబాద్ చేరుకుంటారు.

ప్రత్యేకంగా ప్రధాన వేదిక

ప్రధాన వేదికను వాటర్ ప్రూఫ్, ఫైర్ ప్రూఫ్ జర్మనీ స్ట్రక్చర్ రూఫ్‌తో సిద్ధం చేయగా, గులాబీ రంగు జోడించారు. వేదికపై భారత్ రాష్ట్ర సమితి పేరు, వరుసగా సీఎంలు కేసీఆర్, పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, డి.రాజా ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. 200 మంది కూర్చునేలా వేదికను నిర్మించారు. వేదిక వెనుక నాలుగు విశ్రాంతి గదులు, వేదిక ఎదురుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలు కూర్చునేలా గ్యాలరీ సిద్ధం చేశారు. నగరంలోకి ప్రవేశించేది మొదలు చుట్టూరా గులాబీ జెండాలు, సీఎం కేసీఆర్, జిల్లా నేతల ఫొటోలతో పాటు టీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలతో కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటయ్యాయి. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి తదితరులు మంగళవారం సాయంత్రం సభా ప్రాంగణం, కలెక్టరేట్‌ను పరిశీలించారు. భారీ సభ దృష్ట్యా బుధవారం ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఖమ్మం వైపు వచ్చే సాధారణ, భారీ వాహనాలన్నింటినీ దారి మళ్లించనున్నట్లు పోలీసులు వెల్లడించారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వస్తూ సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లాల్సిన వాహనాలను కోదాడ హైవే మీదుగా విజయవాడ వైపు మళ్లిస్తారు. ఇలా వుండగా టీఆర్‌ఎస్ ఏర్పాటైనప్పటి నుంచి భారీ ఎత్తున జరిగిన సభల జాబితాలో ఖమ్మం బీఆర్‌ఎస్ సభ కూడా చేరుతుందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. 2016లో ఖమ్మంలో టీఆర్‌ఎస్ ప్లీనరీ తర్వాత ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా ఇదే భారీ సభ కావడం గమనార్హం. నాటి నుంచి నేటి వరకు సభల ఏర్పాట్లను హైదరాబాద్‌కు చెందిన సుజాత సౌండ్స్ నిర్వాహకులే చూస్తుండడం మరో విశేషం.



ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభ వేదిక

'ప్రత్యామ్నాయ' శక్తిగా..

▶ మొదటి పేజీ తరువాయి

శరద్‌పవార్, శంకర్‌సింగ్ వఘేలా, అఖిలేశ్ యాదవ్, గిరిధర్ గొమాంగో, ఠాక్రే లాంటి పలువురు మాజీ సీఎంలతో కేసీఆర్ భేటీ అవుతూ వస్తున్నారు. తాజాగా ఖమ్మం బహిరంగ సభకు కేజ్రీవాల్, భగవంత్ మాన్, పినరయి విజయన్, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌ను రప్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా తృతీయ కూటమి ఏర్పాటుపై కేసీఆర్ ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. అయితే బుధవారం జరిగే సభ ద్వారా ఈ మేరకు సంకేతాలు ఇచ్చే అవకాశముందని అంటున్నారు. తృతీయ కూటమిని నడిపే సత్తా కేసీఆర్‌కు ఉందనే సంకేతాలు ఈ సభ ద్వారా ఇచ్చేందుకే భారీ బల ప్రదర్శనకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతోందని చెబుతున్నారు. సుమారు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేలా..

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే కూటమి వరుసగా రెండోసారి అధికారంలోకి రాగా, కాంగ్రెస్ పలు రాష్ట్రాల్లో బలాన్ని కోల్పోతూ వచ్చింది. ఉత్తరాదిన ఆప్, సమాజ్‌వాదీ, ఆర్‌జేడీ, జనతాదళ్ (యూ) వంటి పార్టీలు ప్రబల రాజకీయ శక్తులుగా ఉండటం, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలిసి వస్తుండటం, దక్షిణాదిలోనూ ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఏర్పాటు ద్వారా తృతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ఖమ్మం సభ దోహదపడుతుందని భావిస్తున్నారు. మరోవైపు ఇదే సభలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన తెలంగాణ మోడల్‌ను దేశానికి పరిచయం చేసేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. సీఎం కేసీఆర్ ఈ సభలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాలు, దళితబంధు లాంటి సంక్షేమ పథకాలను వివరించనున్నారు. ఈ ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది ఆరంభంలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఖమ్మం సభ నుంచే కేసీఆర్ సమరశంఖం పూరించే అవకాశముందని అంటున్నారు.

వ్యూహాత్మకంగా ఖమ్మం ఎంపిక

బహిరంగ సభ నిర్వహణకు తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న ఖమ్మంను కేసీఆర్ వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. ఇటీవలి కాలంలో కాంగ్రెస్, బీజేపీతో పాటు టీడీపీ, వైఎస్సార్‌టీపీలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలకు చెక్ పెట్టేందుకే ఖమ్మంను ఎంపిక చేసినట్లు సమాచారం.

రాష్ట్రానికి విచ్చేసిన బీఆర్‌ఎస్ అతిథులు





కేజ్రీవాల్‌కు స్వాగతం పలుకుతున్న మహమూద్ అలీ. చిత్రంలో భగవంత్‌సింగ్ మాన్ ● విజయన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రశాంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొనడానికి బీఆర్‌ఎస్ ఆహ్వానించిన ప్రముఖులు మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. వారికి మంత్రులు ఘనస్వాగతం పలికారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్‌కు రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువాతో సత్కరించారు. కాగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్వాగతించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానించారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా..

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రవీంద్ర చారి, పర్వతాలు, స్టాలిన్ తదితరులు స్వాగతం పలికారు.

కంటి వెలుగు కోసమే వచ్చా: కేజ్రీవాల్

తాను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనడానికి మాత్రమే వచ్చానని, ఈ పర్యటనలో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇది ఒక అధికారిక కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ వచ్చిన కేజ్రీవాల్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఇందిరా శోభన్, డాక్టర్ దిడ్డి సుధాకర్, శోభన్ బాబు భూక్య, బుర్ర రాము గౌడ్, డాక్టర్ అన్సారీ కలిశారు.

చెరో పది అసెంబ్లీ సీట్లలో పోటీ!

ఆమేరకు బీఆర్‌ఎస్‌తో పొత్తుకు సీపీఐ, సీపీఎం యోచన

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో చెరో పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని సీపీఐ, సీపీఎం యోచిస్తున్నాయి. ఆ మేరకు బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదుర్చుకోవాలని ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. వీలును బట్టి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్‌కు స్పష్టం చేయాలని భావిస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తమ వల్లే బీఆర్‌ఎస్ గెలిచిందని, కాబట్టి ఆ పార్టీ మళ్లీ అధికారం రావాలంటే తమతో పొత్తు తప్ప మరో గత్యంతరం లేదని సీపీఐ, సీపీఎం చెబుతున్నాయి. అయితే 20 సీట్లు బీఆర్‌ఎస్ ఇస్తుందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అలాంటప్పుడు చివరకు చెరో ఐదు సీట్లయినా ఇవ్వాలని పట్టుబడతామని ఆ పార్టీల నేతలు అంటున్నారు. చెరో ఐదు స్థానాలైనా ఇవ్వకపోతే పొత్తుపై పునరాలోచించుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. అయితే చెరో ఐదు స్థానాలైనా బీఆర్‌ఎస్ ఇస్తుందా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

ఖమ్మం రైతులకు క్షమాపణలు చెప్పాలి: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: మిర్చి పంటకు మద్దతు ధర ఇవ్వాలని అడిగినందుకు ఖమ్మం జిల్లా రైతులపై కేసులు పెట్టించిన ఘనుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ముందు ఆ రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పిన తర్వాత ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 'మార్కెట్‌కు తీసుకువచ్చిన మిర్చి పంటకు మద్దతు ధర రాలేదని కొందరు పేద గిరిజన రైతులు 2017, ఏప్రిల్‌లో ఖమ్మం మార్కెట్‌యార్డులో ఆందోళన చేశారు. ఆ రైతులపై రాష్ట్రప్రభుత్వం హత్యాయత్నం లాంటి తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేసింది. వారిని ఖమ్మం జైలు నుంచి కోర్టుకు తీసుకెళ్లిన సందర్భంగా రైతులని చూడకుండా బేడీలు వేసింది. కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే రైతులందరికీ ఇదే పరిస్థితి అని భయపెట్టేందుకే ఆ విధంగా వ్యవహరించింది'అని మంగళవారం ఒక ప్రకటనలో ఉత్తమ్ మండిపడ్డారు.

సంగ్రామ యాత్ర స్ఫూర్తితో ప్రజల్లోకి వెళ్లండి

- ఆ యాత్రను ఇతర రాష్ట్రాలూ కొనసాగించాలి
- బీజేపీ శ్రేణులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- సమావేశాల ముగింపు సందర్భంగా బండిపై మోదీ ప్రశంసలు



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో ప్రధాని మోదీ, నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన ప్రజా సంగ్రామ యాత్ర స్ఫూర్తిని ఇతర రాష్ట్రాలూ కొనసాగించాలని ప్రధాని మోదీ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ప్రజా సంగ్రామ యాత్ర ద్వారా ప్రజలకు పార్టీని చేరువ చేసిన మాదిరే ఇతర రాష్ట్రాల్లోనూ యాత్రలు నిర్వహించి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఢిల్లీలో జరుగుతున్న పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల చివరి రోజున ప్రధాని మోదీ ముగింపు ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా బండి ప్రజా సంగ్రామ యాత్రను ప్రస్తావించారు. 'సార్వత్రిక ఎన్నికలకు కేవలం 400 రోజులే సమయముంది. ఈ ఏడాదే 9 రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల రాష్ట్రాలతో పాటు, కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలంటే పార్టీ శ్రేణులు, నేతలు మరింతగా ప్రజల్లోకి వెళ్లాలి. వారితో మమేకం కావాలి. అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణలో ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో బండి సంజయ్ ప్రజల్లోకి వెళ్లారు. ప్రభుత్వ అణిచివేతను ఎదుర్కొని నిర్వహించిన ఈ యాత్రకు మంచి స్పందన లభించింది. ఇలాంటి యాత్రల ద్వారా ప్రజలతో మమేకం అవ్వొచ్చు. వారి సమస్యలు వినే అవకాశం ఉంటుంది. తద్వారా వాటికి పరిష్కారాలు దొరుకుతాయి. ఇలాంటి యాత్రలే దేశంలో అవసరమైన అన్ని రాష్ట్రాల్లోనూ నిర్వహించండి' అని మోదీ చెప్పారు. ఇదే సమయంలో యాత్ర జరుగుతున్న తీరును ప్రతి రాష్ట్రం నుంచి ఐదుగురు సభ్యులు బృందాలుగా వెళ్లి యాత్ర అనుభవాలు గమనించాలని, ప్రజల స్పందనను వినాలని ఆయన సూచించారు.

తెలంగాణలో పార్టీ మెరుగు: అమిత్ షా

ఇక జాతీయ కార్యవర్గాల సమావేశాల భేటీ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలాన్ని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ జేపీ నడ్డా నేతృత్వంలో పార్టీ అద్భుతంగా పనిచేసిందని, ప్రజలకు సేవ చేసిందని కొనియాడారు. నడ్డా అధ్యక్షతన మహారాష్ట్ర, హరియాణాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయగా, యూపీ ఉత్తరాఖండ్, మణిపూర్, అస్సాం, గుజరాత్ రాష్ట్రాల్లో బీజేపీ భారీ విజయాన్ని సాధించిందని కొనియాడారు. ఆయన నేతృత్వంలోనే పశ్చిమబెంగాల్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో పార్టీ గణనీయంగా మెరుగుపడిందని, చెప్పుకోదగ్గ విజయాలు సాధించిందని అన్నారు.

రెండో రోజు మరో ముగ్గురు:

కాగా జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తెలంగాణకు పార్టీ నాయకత్వం చాలా ప్రాధాన్యాన్నిచ్చింది. సమావేశాల మొదటి రోజున తెలంగాణలో జరిగిన ప్రజా సంగ్రామ యాత్రపై బండి సంజయ్ ప్రజెంటేషన్‌ను ఇవ్వగా, రెండో రోజు దేశంలోని పరిస్థితులపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టగా, సామాజిక, ఆర్థిక అంశాలపై వివేక్ వెంకట్‌స్వామి, కేంద్ర పథకాలపై పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు.

అధికారమే లక్ష్యంగా కొట్లాడండి: నడ్డా

తెలంగాణలో అధికార పీఠమే లక్ష్యంగా కొట్లాడాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర నేతలకు పిలుపునిచ్చారు. నడ్డా పదవీకాలాన్ని పొడిగించిన నేపథ్యంలో కార్యవర్గ సమావేశం అనంతరం బండి సంజయ్, డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, ఇంద్రసేనారెడ్డి తదితరులు ఆయన్ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటించిన నడ్డా తెలంగాణలో పార్టీ గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. తాను కూడా తరచూ తెలంగాణలో పర్యటిస్తానని నేతలకు చెప్పారు.



క్లుప్తంగా...

సోషల్‌మీడియా ప్రభావశీల జాబితాలో కేటీఆర్

- ప్రపంచంలోని 30 మంది జాబితాలో 12వ స్థానం..

సాక్షి, హైదరాబాద్‌: సోషల్‌ మీడియాలో చురుగ్గా ఉంటూ, సమస్యలపై స్పందించే ఐటీ శాఖమంత్రి కె.తారక రామారావు ప్రపంచ స్థాయి ఘనత సాధించారు. ప్రపంచంలోనే టాప్‌-30 సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ లిస్ట్‌లో ఇండియా నుంచి స్థానం దక్కించుకున్న ఇద్దరు రాజకీయ నేతల్లో కేటీఆర్‌ ఒకరిగా నిలిచారు. కేటీఆర్‌తో పాటు పంజాబ్‌కు చెందిన ఆమ్‌ ఆద్మీ పార్టీ యువనేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్‌ చద్దాకు సోషల్‌ మీడియాను ప్రభావితం చేస్తున్న వారి జాబితాలో స్థానం దక్కింది. ప్రపంచంలో సోషల్‌ మీడియాను ప్రభావితం చేసే తొలి 30 మందిలో కేటీఆర్‌ ట్విట్టర్‌ అకౌంట్‌ 12వ స్థానాన్ని దక్కించుకోగా, రాఘవ్‌ చద్దా 23వ స్థానంలో ఉన్నారు. కాగా, ఈ జాబితాలో తెలంగాణ ఐటీ శాఖకు చెందిన అఫీషియల్‌ ట్విట్టర్‌ అకౌంట్‌ 22వ స్థానంలో ఉండటం విశేషం.

నేడు బడ్జెట్‌ భేటీలు

సాక్షి, హైదరాబాద్‌: రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ రూపకల్పన కోసం బుధవారం శాఖల వారీగా ఆర్థికశాఖ కీలక సమావేశం నిర్వహించనుంది. సచివాలయంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ భేటీలకు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్య దర్శులు, కార్యదర్శులు హాజరు కావాలని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు నోట్‌ పంపారు. ఈ భేటీల్లో ఆయా శాఖలకు సంబంధించిన 2023–24 ఆర్థిక ఏడాది ప్రతిపాదనలకు తుదిరూపు ఇవ్వనున్నారు. ఇప్పటికే అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో స్వీకరించిన సంగతి తెలిసిందే.

ఈనెల 19న దక్షిణ భారత కవుల సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్‌: ఆజాదీ కా అమృత్‌ మహోత్సవ్‌ వేడుకల్లో భాగంగా ఈనెల 19న హైదరాబాద్‌లో దక్షిణ భారత కవుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ప్రముఖ తెలుగు కవి, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. ప్రముఖ మలయాళ కవి ప్రభావర్మ, ప్రముఖ తెలుగు కవి నందిని సిధారెడ్డి కవితా పఠన సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. ఐదు దక్షిణ భారత రాష్ట్రాల నుంచి 8 భాషలకు ప్రాతినిథ్యం వహిస్తున్న మొత్తం 18 మంది కవులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారు. కవులు 'స్వేచ్ఛపై పద్యాలు', 'ప్రేమ, ప్రకృతిపై పద్యాలు', 'ఆశ, ఆకాంక్షపై కవితలు' అనే మూడు విభాగాలలో కవితలను వినిపించనున్నారు.

బీసీలు గొప్ప నాయకుడిని కోల్పోయారు

శరద్‌ యాదవ్‌ సంస్మరణ సభలో వక్తలు




మాట్లాడుతున్న కంచె ఐలయ్య. చిత్రంలో అజీజ్‌పాషా, పాశం యాదగిరి

హైదరాబాద్‌: మహిళలు రాజకీయాల్లో రాణించాలని నిరంతర పరితపించిన వ్యక్తి శరద్‌ యాదవ్‌ అని పలువురు ప్రముఖులు అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శరద్‌ యాదవ్‌ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అజీజ్‌ పాషా, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌, ప్రొఫెసర్‌ కంచ ఐలయ్య, సీనియర్‌ పాత్రికేయులు పాశం యాదగిరి, రాందాస్‌, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 45 ఏళ్ల రాజకీయాలను శాసించినా ఒక మంచి ఇల్లు కూడా సంపాదించుకోలేని మహోన్నత వ్యక్తి శరద్‌ యాదవ్‌ అని కొనియాడారు. అప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యూపీఏ కూటమికి శరద్‌ యాదవ్‌ను చైర్మన్‌ను చేస్తే బీసీలు అంతా ఐక్యమయ్యేవారని, బీజేపీ అధికారంలోకి వచ్చి ఉండేది కాదన్నారు. దేశంలోని బీసీలు ఒక గొప్ప నాయకున్ని కోల్పోయారన్నారు. నేటితరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

8,9 తేదీల్లో ఢిల్లీలో బీసీ యువ గర్జన: ఆర్‌.కృష్ణయ్య

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

కాచిగూడ (హైదరాబాద్‌): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో బీసీ యువ గర్జన, ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య తెలిపారు.



మంగళవారం కాచిగూడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆర్‌.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనాభా ప్రాతిపదికన బీసీలకు 56% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. లేదంటే బీసీ యువజనులతో కలిసి పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీలకు పారిశ్రామిక విధానంలో 50% రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

అరకొర ఫ్యాకల్టీ.. క్లాసులు పల్టీ

183 పోస్టులకు 92 మందే నియామకం

దయనీయ స్థితిలో బీబీనగర్‌ ఎయిమ్స్‌

- తరగతులు సరిగా జరగకపోవడంపై వైద్య విద్యార్థుల్లో ఆందోళన
- కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు
- వైద్య సేవలూ అంతంతమాత్రంగానే..
- దేశవ్యాప్తంగా కొత్త ఎయిమ్స్‌ల్లో ఇదే పరిస్థితి



సాక్షి, హైదరాబాద్‌: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బీబీనగర్‌ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్‌ తరగతులు ప్రస్తుతం సగం ఫ్యాకల్టీతోనే నడుస్తున్నాయి. బోధన సిబ్బంది (ఫ్యాకల్టీ)కి సంబంధించి మంజూరైన పోస్టులు 183 ఉండగా, కేవలం 92 మందినే నియమించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా నివేదిక ఈ అంశాన్ని వెల్లడిస్తుండగా.. ఏకంగా 91 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే ఎయిమ్స్‌ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా కొత్తగా ప్రారంభమైన అనేక ఎయిమ్స్‌ల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భోపాల్‌ ఎయిమ్స్‌లో 305 పోస్టులకు, 105 ఖాళీగా ఉన్నాయి. భువనేశ్వర్‌లో 305కు గాను 74, జోధ్‌పూర్‌లో 305కు గాను 77, పాట్నాలో 305కు గాను 151, రాయిపూర్‌లో 305కు 135, రిషికేష్‌లో 305కు గాను 106, మంగళగిరిలో 183కు గాను 65, నాగ్‌పూర్‌లో 183కు గాను 64, కళ్యాణిలో 183కు గాను 88, గోరఖ్‌పూర్‌లో 183కు గాను 105, భటిండాలో 183కు గాను 72, బిలాస్‌పూర్‌లో 183కు గాను 90, గౌహతిలో 183కు గాను 89, రాజ్‌కోట్‌లో 183కు గాను 143, విజయ్‌పూర్‌లో 183కు గాను 107, రాయ్‌బరేలీలో 183కు గాను 101 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫ్యాకల్టీ ఇంత తక్కువగా ఉండటం వల్ల తరగతులు సరిగా జరగక పోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు కేంద్రానికి ఫిర్యాదులు చేస్తున్నారని రాష్ట్ర వైద్య వర్గాలు చెబుతున్నాయి.

2021లో శస్త్రచికిత్సలు షురూ

బీబీనగర్‌ ఎయిమ్స్‌లో 2021లో శస్త్రచికిత్సలు ప్రారంభమయ్యాయి. ఆ సంవత్సరం ప్రధాన శస్త్రచికిత్సలు 26 జరగ్గా, 2022 జూలై నాటి వరకు 294 జరిగాయి. ఇక చిన్నపాటి శస్త్రచికిత్సలు ఇప్పటివరకు 3,600పైగా జరిగాయి. అయితే సీనియర్‌ రెసిడెంట్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయన్న చర్చ జరుగుతోంది.

అందుబాటులోకి వచ్చి మూడేళ్లు గడిచినా..

ముఖ్యమంత్రి కేసీఆర్‌ చేసిన కృషితో రాష్ట్రానికి ఎయిమ్స్‌ వచ్చింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం బీబీనగర్‌లో ఏకంగా 200 ఎకరాల భూమి ఇచ్చింది. అలాగే అక్కడ నిమ్స్‌ ఆసుపత్రి భవనాలను కూడా ఉచితంగా అప్పగించింది. అనంతరం 2019 నుంచి బీబీనగర్‌ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్‌ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎయిమ్స్‌తో అన్ని వర్గాల ప్రజలకు అత్యాధునిక సూపర్‌ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనేది ప్రధాన ఉద్దేశం. కీలకమైన 50 రకాల స్పెషలిస్టు వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉండాలి. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలతో ఎంబీబీఎస్‌, నర్సింగ్‌ విద్య అందించాలన్నది లక్ష్యం. రాష్ట్రంలోని అన్ని ప్రధాన కేంద్రాలకు అందుబాటులో ఉంటుందనే ఉద్దేశంతో ఎయిమ్స్‌ను బీబీనగర్‌లో ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు సమీపంలో, ఔటర్‌రింగ్‌ రోడ్డుకు 18 కిలోమీటర్ల దూరంలోనే ఉంది కాబట్టి అన్ని జిల్లాలకూ సులువుగా వెళ్లి వచ్చేందుకు అవకాశం ఉంది. మరోవైపు ఎయిర్‌పోర్టుకు ఇక్కడి నుంచి 20 నిమిషాల్లో చేరుకోవచ్చు. జాతీయ స్థాయిలో నిపుణులైన వైద్యులు సులభంగా వచ్చివెళ్లేందుకు అవకాశం ఉంది. ఇంత కీలకమైన ఎయిమ్స్‌పై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దమ్ముంటే నాతో రాజకీయం చెయ్‌

కేసీఆర్‌.... అసలు నువ్వు మనిషివేనా?

- పిల్లలు కొట్టుకుంటారు.. కలుస్తారు
- ముగ్గురు పిల్లల జీవితాలను నాశనం చేయాలని సీఎం కుట్ర పన్నారు
- కొడుకు వీడియోపై స్పందించిన బండి

సాక్షి, న్యూఢిల్లీ : దమ్ముంటే తనతో రాజకీయం చేయాలి కానీ పిల్లల జీవితాలతో ఎలా ఆడుకుంటారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ ప్రశ్నించారు. 'కేసీఆర్‌... నీకు దమ్ముంటే, నువ్వు మొగోడివైతే నాతో రాజకీయం చెయ్‌... నాతో చేయడం చేతగాక, తట్టుకోలేక నా కొడుకును లాగుతావా?... నీ మనువడి విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తే నేనే ఖండించిన. చిన్న పిల్లలను రాజకీయాల్లోకి లాగొద్దనే సోయి కూడా లేదా? నా కొడుకు విషయంలో ఎప్పుడో జరిగిన దానిని ఇప్పుడు తెరపైకి తీసుకొచ్చి కేసు పెట్టిస్తవా? నేను తప్పు చేశానని ఆ అబ్బాయే (దెబ్బలు తిన్న విద్యార్థి) ఒప్పుకున్నడు. అయినా పిల్లలు పిల్లలు కొట్లాడుకుంటరు. మళ్లీ కలుస్తారు. మరి నీకేం నొచ్చింది? కేసు పెట్టియ్యాల్సిన అవసరం ఏమొచ్చింది? కంప్లయింట్‌ ఎవరిచ్చారు? నీ రాజకీయాల కోసం ఎంతకైనా దిగజారుతావా? ఏదైనా చేస్తావా? నీ యాదాద్రి భాగోతాన్ని, నిజాం మనువడి అంత్యక్రియలపై ప్రజల దృష్టిని మళ్లించాలని ఇదంతా చేస్తావా?' అంటూ బండి సంజయ్‌ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆ అమ్మాయి, నా కొడుకు, ఆ అబ్బాయి జీవితాలను నాశనం చేయాలని సీఎం కుట్ర చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం రాత్రి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్‌.మనోహర్‌ రెడ్డి, కోశాధికారి శాంతికుమార్‌ తదితరులతో కలిసి బండి సంజయ్‌ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన కుమారుడిపై కేసీఆర్‌ ప్రభుత్వం కేసు నమోదు చేసిన విషయాన్ని మీడియా ప్రస్తావించగా బండి సంజయ్‌ తీవ్రంగా స్పందించారు. 'నా కొడుకు చేసిన తప్పేమిటి? పిల్లలపై కేసు పెట్టిస్తారా? కేసీఆర్‌... నువ్వు మనిషివి కాదు... నీ పాపం పండింది. నా కొడుకును పోలీస్‌ స్టేషన్‌లో నేనే సరెండర్‌ చేస్తా... థర్డ్‌ డిగ్రీ ఉపయోగిస్తవా? లాఠీలతో కొట్టిస్తవా? చూద్దాం.' అని బండి మండిపడ్డారు.



నయీం డైరీ ఆస్తుల కేసు ఎటు పోయింది?

యాదాద్రిపై కేసీఆర్‌ కుటుంబం పెట్టుబడి పెట్టినట్లు, రోజుకు రూ.కోటి లాభం వస్తుందని చెప్పడం.. ఆలయాలను, దేవుళ్లను కూడా వ్యాపారంగా మార్చడం సిగ్గుచేటని బండి విమర్శించారు. 'ధార్మిక క్షేత్రాలను వ్యాపారం కోసం అభివృద్ధి చేస్తున్నట్లు నమ్మిస్తే... ఆ దేవుడు కూడా నిన్ను క్షమించబోరు. అసలు నయీం డైరీ ఆస్తుల కేసు ఎటు పోయింది? నయీం కబ్జా చేసుకున్న ఆస్తులన్నీ నీ కుటుంబం కబ్జా చేసుకుంది.' అని ధ్వజమెత్తారు. 'ఎక్కడో టర్కీలో చనిపోయిన నిజాం మనవడికి తెలంగాణకు ఏం సంబంధం? డెడ్‌ బాడీని ఇక్కడికి రప్పించి అత్యున్నత అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలని ప్రభుత్వం ఎట్లా చెబుతుంది? తెలంగాణ ప్రజలను రాచి రంపాన పెట్టి ఎంతో మందిని చంపిన నిజాంపై నీకెందుకు ప్రేమ..? నిజాం ఆస్తులపై నీ కన్ను పడింది. అందుకే వాళ్లను పొగుడుతున్నవ్‌. రజాకార్ల పార్టీ అయిన ఎంఐఎంతో కులుకుతున్నవ్‌' అని సంజయ్‌ విమర్శించారు.

బండి కుమారుడిపై కేసు

తోటి విద్యార్థిపై దూషణలు...దాడి

దుండిగల్‌: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ కుమారుడిపై దుండిగల్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. తోటి విద్యార్థిని దుర్భాషలాడుతూ దాడిచేసిన దృశ్యాలు సోషల్‌ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కలకలం రేగింది. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం బహదూర్‌పల్లిలోని మహేంద్ర వర్సిటీలో బీటెక్‌ చదువుతున్న సంజయ్‌ కుమారుడు తోటి విద్యార్థిని అసభ్య పదజాలంతో తిట్టడమే కాకుండా, చంపేస్తానంటూ బెదిరిస్తూ తీవ్రంగా కొట్టాడు. దీంతో వర్సిటీకి చెందిన స్టూడెంట్‌ అపెక్స్‌ కోఆర్డినేటర్‌ మంగళవారం దుండిగల్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమణారెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

అందుకే కొట్టాడు: కాగా బండి కుమారుడిపై కేసు నమోదైన విషయం తెలిశాక...అతని చేతిలో దెబ్బలు తిన్న విద్యార్థి మంగళవారం రాత్రి 11 గంటలకు ఒక వీడియో విడుదల చేశాడు. బండి సంజయ్‌ కుమారుడు స్నేహితుడి చెల్లెల్ని తాను ఇబ్బంది పెట్టానని, ఆ కారణంతోనే తనపై చేయిచేసుకున్నాడని వీడియోలో పేర్కొన్నాడు. ఇప్పుడు తామంతా మంచిగానే ఉన్నామని చెప్పాడు.

100 రోజుల్లో కోటిన్నర మందికి స్క్రీనింగ్‌

నేటి నుంచి కంటి వెలుగు

- ఖమ్మంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం.. 18 ఏళ్లు పైబడిన వారందరికీ కంటి పరీక్షలు

సాక్షి, హైదరాబాద్‌: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం బుధవారం మొదలుకానుంది. ఖమ్మంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. దీనికోసం వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 19 నుంచి రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాల్లో ప్రారంభిస్తారు. ఇందులో ప్రజాప్రతినిధులందరూ పాల్గొంటారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 కేంద్రాల్లో కంటి స్క్రీనింగ్‌ పరీక్షలు చేస్తారు. 100 పనిదినాల్లో కోటిన్నర మందికి పరీక్షలు నిర్వహించనున్నారు. తద్వారా గిన్నిస్‌ బుక్‌లో నమోదయ్యేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. 18 ఏళ్లు నిండిన వారందరికీ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తారు. మొత్తం 55 లక్షల కళ్లద్దాలు సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఒక్కోచోట 300 మందికి, పట్టణ ప్రాంతాల్లో 400 మందిని పరీక్షించాలన్నది లక్ష్యం. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తారు.

15 వేల మంది సిబ్బంది : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 15 వేల మంది సిబ్బంది పాల్గొంటారు. కంటి పరీక్షలకు అవసరమైన ఏఆర్‌ యంత్రాలు, కళ్లద్దాలు సిద్ధంగా ఉంచారు. కంటి వెలుగు శిబిరాల్లో కంటి శుక్లం, మెల్ల కన్ను, టెరీజియం పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి చుక్కల మందులు, మాత్రలు ఇస్తారు. శిబిరాల్లో స్క్రీనింగ్‌ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించే హాల్‌

జి-20 వర్కింగ్‌ గ్రూప్‌ భేటీకి పటిష్ట భద్రత

- బందోబస్తు ఏర్పాట్లపై డీజీపీ అధ్యక్షతన సెక్యూరిటీ కో–ఆర్డినేషన్‌ కమిటీ సమావేశం
- పాల్గొన్న వివిధ భద్రతా సంబంధ శాఖల ఉన్నతాధికారులు
- లోపాలు లేకుండా సమన్వయం చేసుకోవాలని డీజీపీ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్‌: ఈనెల 28 నుంచి జూన్‌ 17 మధ్య హైదరాబాద్‌లో జరగనున్న జి–20 వర్కింగ్‌ గ్రూప్‌ సమావేశాలకు తెలంగాణ పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఈ సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ అంజనీకుమార్‌ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జి–20 సెక్యూరిటీ కోఆర్డినేషన్‌ కమిటీలో నిర్ణయించారు. డీజీపీ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో సీనియర్‌ పోలీస్‌ అధికారులతోపాటు, ఎయిర్‌పోర్ట్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా, రీజినల్‌ పాస్‌పోర్ట్‌ ఆఫీస్‌, ఎన్‌డీఆర్‌ఎఫ్‌, సీఐఎస్‌ఎఫ్‌, ఎన్‌ఎస్‌జీ తదితర భద్రతా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, జి–20 దేశాల అధినేతల అత్యున్నత సమావేశానికి ముందస్తుగా దేశంలోని 56 నగరాల్లో 215 వర్కింగ్‌ గ్రూ పు సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌లో 6 సమావేశాలు జరగనున్నాయని వెల్లడించారు. వీటిలో జనవరి 28న తొలి సమావేశం జరగనుండగా, మార్చ్‌ 6,7 తేదీల్లో, ఏప్రిల్‌ 26, 27, 28 తేదీల్లో, జూన్‌ 7,8,9 తేదీల్లో, జూన్‌ 15,16 తేదీల్లో జూన్‌ 17న వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో వర్కింగ్‌ గ్రూప్‌ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమన్వయం ఎంతో ముఖ్యం....

జీ–20 వర్కింగ్‌ గ్రూప్‌ సమావేశాలు సజావుగా, భద్రతాపరమైన అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు వివిధ భద్రతా విభాగాల మధ్య సమన్వయం అవసరమని డీజీపీ సూచించారు. సమావేశాలకు హాజరయ్యే ఉన్నతస్థాయి ప్రతినిధులు నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలను కూడా సందర్శించే అవకాశమున్నందున ఆయా ప్రాంతాల్లో విస్తృత భద్రతా చర్యలు చేపట్టాలని, సమర్థవంతమైన సమన్వయం కోసం అంతర్గత వాట్సాప్‌ గ్రూపులు ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని పంచుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్‌ డీజీలు అభిలాష బిస్త్‌, సంజయ్‌కుమార్‌ జైన్‌, స్వాతిలక్రా, విజయకుమార్‌, నాగిరెడ్డి, సైబరాబాద్‌ పోలీస్‌ కమీషనర్‌ స్టీఫెన్‌ రవీంద్ర, హైదరాబాద్‌ అడిషనల్‌ సీపీ విక్రమ్‌సింగ్‌ మాన్‌, డీఐజీ తఫ్సీర్‌ ఇక్బాల్‌, హైదరాబాద్‌ ట్రాఫిక్‌ అడిషనల్‌ సీపీ సుధీర్‌బాబు, హోంశాఖ ఎస్‌ఐబీ డిడి సంబల్‌ దేవ్‌, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సీఎస్‌ఓ భరత్‌ కందార్‌, డిప్యూటీ పాస్‌పోర్ట్‌ ఆఫీసర్‌ ఇందు భూషణ్‌ లెంక, ఎన్‌ఎస్‌జీ కల్నల్‌ అలోక్‌ బిస్త్‌, జీఏడీ ప్రోటోకాల్‌ అధికారి కె.నాగయ్య తదితర సీనియర్‌ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అలాక్స్‌ పెట్టుబడి రూ.750 కోట్లు

మంత్రి కేటీఆర్‌ హర్షం

- మల్టీ గిగా వాట్‌ లిథియం క్యాథోడ్‌ మెటీరియల్‌ తయారీ కేంద్రం నెలకొల్పనున్న సంస్థ
- దావోస్‌ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం..

సాక్షి, హైదరాబాద్‌: బ్యాటరీల తయారీలో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అలాక్స్‌ అడ్వాన్స్‌ మెటీరియల్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ తెలంగాణలో రూ.750 కోట్ల పెట్టుబడితో మల్టీ గిగా వాట్‌ లిథియం క్యాథోడ్‌ మెటీరియల్‌ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి కె.తారక రామారావు సమక్షంలో అలాక్స్‌ ప్రతినిధులు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భారీ పరిశ్రమలో లిథియం ఐరన్‌ ఫాస్ఫేట్‌ బ్యాటరీలు తయారవుతాయి.

తొలుత రూ.210 కోట్ల పెట్టుబడి..

రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా తొలుత రూ.210 కోట్ల పెట్టుబడితో, మూడు గిగా వాట్ల సామర్థ్యంతో లిథియం ఐరన్‌ ఫాస్ఫేట్‌ బ్యాటరీలను ఉత్పత్తి చేయనున్నట్లు అలాక్స్‌ తెలిపింది. ఈ సామర్థ్యాన్ని భవిష్యత్తులో పది గిగా వాట్లకు పెంచనున్నట్లు స్పష్టం చేసింది. 2030 సంవత్సరం నాటికి మొత్తంగా రూ.750 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు వివరించింది.

ప్రజలకు చేరువగా ఈవీలు : కేటీఆర్‌

రాష్ట్రంలో బ్యాటరీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు అలాక్స్‌ సంస్థ ముందుకు రావడంపై మంత్రి కె.తారక రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్‌ వాహనాలను (ఈవీలు) ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, రాష్ట్రంలో పర్యావరణ వ్యవస్థను మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని కేటీఆర్‌ తెలిపారు. ఎలక్ట్రిక్‌ వాహనాల తయారీ, అడ్వాన్స్‌డ్‌ కెమిస్ట్రీ బ్యాటరీల తయారీ రంగంలో తెలంగాణ కీలకంగా మారుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశంలోనే తొలిసారిగా 2020లోనే తెలంగాణ రాష్ట్రం ఎలక్ట్రిక్‌ వెహికల్‌, ఈఎస్‌ఎస్‌ ప్రత్యేక పాలసీని తీసుకొచ్చిందని చెప్పారు. అలా క్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ మౌర్య సుంకవల్లి మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడి పెట్టడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో ఉన్న అనుకూల వాతావరణమేనని అన్నారు. ఎలక్ట్రిక్‌ వాహన రంగంతో పాటు ఎనర్జీ స్టోరేజ్‌ సిస్టంలో కీలకంగా మారేందుకు తమ సంస్థ ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌ రంజన్‌, ఇన్వెస్ట్‌ తెలంగాణ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌ రెడ్డి, ఈవీ సెక్టార్‌ డైరెక్టర్‌ గోపాలకృష్ణన్‌ పాల్గొన్నారు.

ప్రతిపాదిత తయారీ కేంద్రంతో సుమారు 600 మంది నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

పెప్సీకో వ్యాపార సేవలు రెట్టింపు



రాబర్టో అజెవెదోతో మాట్లాడుతున్న కేటీఆర్‌. చిత్రంలో జయేశ్‌రంజన్‌

వరల్డ్‌ ఎకనామిక్‌ ఫోరం వేదికగా సంస్థ ప్రకటన

- 2,800 నుంచి 4 వేలకు పెరగనున్న ఉద్యోగులు.. మంత్రి కేటీఆర్‌తో పెప్సీకో వైస్‌ ప్రెసిడెంట్‌ భేటీ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో తమ గ్లోబల్‌ బిజినెస్‌ సర్వీసెస్‌ సెంటర్‌ కార్యకలాపాలను రెట్టింపు చేయనున్నట్లు అంతర్జాతీయ సంస్థ పెప్సీకో ప్రకటించింది. వరల్డ్‌ ఎకనామిక్‌ ఫోరం సదస్సులో మంత్రి కె.తారక రామారావుతో జరిగిన సమావేశంలో పెప్సీకో కార్పొరేట్‌ కార్యకలాపాల కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు రాబర్టో అజెవెడో, ఇతర ప్రతినిధులు ఈ మేరకు తమ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సంస్థ హైదరాబాద్‌ కేంద్రంగా గ్లోబల్‌ బిజినెస్‌ సర్వీసెస్‌ సెంటర్‌ను నిర్వహిస్తోంది. 2019లో కేవలం 250 మందితో ప్రారంభమైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 2,800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఈ సంఖ్యను 4 వేలకు పెంచబోతున్నట్లు పెప్సీకో ప్రతినిధులు చెప్పారు. సంవత్సర కాలంలో ఈ అదనపు ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు సంస్థ కార్యకలాపాలను భారీగా విస్తరిస్తామని, ఇందుకు సంబంధించిన పెట్టుబడి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. అంతకుముందు..దావోస్‌లోని తెలంగాణ పెవిలియన్‌లో మంత్రి కేటీఆర్‌తో అజెవెడో భేటీ అయ్యారు. సంస్థ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. హైదరాబాద్‌లో ఉన్న అత్యుత్తమ మానవ వనరుల కారణంగానే బిజినెస్‌ సర్వీస్‌ సెంటర్‌ను స్వల్ప కాలంలోనే భారీగా విస్తరించినట్లు తెలిపారు.

మరిన్ని పెట్టుబడులు పెట్టండి: కేటీఆర్‌

పెప్సీకో నిర్ణయంపై మంత్రి కేటీఆర్‌ హర్షం వ్యక్తం చేశారు. సంస్థ విస్తరణ ప్రణాళికలకు అవసరమైన సహాయ సహకారాలను తెలంగాణ ప్రభుత్వం తరఫున అందిస్తామని చెప్పారు. పెట్టుబడులకు తెలంగాణలో ఉన్న అనుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఇతర విభాగాలు, రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని కేటీఆర్‌ విజ్ఞప్తి చేశారు. ఫుడ్‌ ప్రాసెసింగ్‌ రంగానికి తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇలావుండగా తెలంగాణ ప్రభుత్వ నీరు, ప్లాస్టిక్‌ వ్యర్థాల నిర్వహణ–రీసైక్లింగ్‌ అంశాల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు పెప్సీకో ఆసక్తిని వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారు.

హైదరాబాద్‌లో అపోలో టైర్స్‌ డిజిటల్‌ ఇన్నోవేషన్‌ సెంటర్‌

- లండన్‌ తర్వాత రాష్ట్రంలో రెండవ సెంటర్‌ ఏర్పాటు.. దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో డిజిటల్‌ ఇన్నోవేషన్‌ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు అపోలో టైర్స్‌ లిమిటెడ్‌ ప్రకటించింది. లండన్‌ తరువాత ఇది తమ రెండవ డిజిటల్‌ ఇన్నోవేషన్‌ సెంటర్‌ అని తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో, మంత్రి కేటీఆర్‌ సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌ రంజన్‌, అపోలో టైర్స్‌ లిమిటెడ్‌ వైస్‌ చైర్మన్‌, ఎండీ నీరజ్‌ కన్వర్‌లు ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో ఈ డిజిటల్‌ ఇన్నోవేషన్‌ కేంద్రం ప్రధాన పాత్ర పోషిస్తుంది.

వినూత్న ఆవిష్కరణలు తెలంగాణ సొంతం

టీ హబ్‌, వీ హబ్‌, టీ వర్క్స్‌ వంటి ప్రపంచ స్థాయి ప్రమాణాలు గల సంస్థలతో వినూత్న ఆవిష్కరణలకు ఊతం ఇచ్చే అద్భుతమైన వ్యవస్థను తెలంగాణలో ఏర్పాటు చేసుకున్నట్లు మంత్రి కేటీఆర్‌ తెలిపారు. అపోలో డిజిటల్‌ ఇన్నోవేషన్‌ సెంటర్‌ కూడా ఇదే కోవలోకి వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు అపోలో వైస్‌ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'ఆగస్టుకి విజయ మెగా డెయిరీ ప్లాంట్‌'

తుక్కుగూడ: ఆగస్టులో విజయ డెయిరీ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో నిర్మిస్తున్న విజయ మెగా డెయిరీ ప్లాంట్‌ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 40 ఎకరాల్లో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. అత్యాధునిక సామర్థ్యంతో నిర్మించే ఈ ప్లాంట్‌ ద్వారా రోజుకు 8 లక్షలకు పైగా పాల ఉత్పత్తులను రైతుల నుంచి సేకరిస్తామన్నారు. ఈ డెయిరీ ద్వారా గడ్డి కత్తిరించే యంత్రాలు, పాల క్యానులు, విద్యుత్‌ సబ్సిడీ, సబ్సిడీ రుణాలు, బీమా తదితర అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల ఔట్‌లెట్‌, మొబైల్‌ ఔట్‌లైట్‌లు ప్రారంభించి వీటి ద్వారా విజయ డెయిరీ ఉత్పత్తులను విక్రయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్‌ సోమా భరత్‌ కుమార్‌, స్పెషల్‌ చీఫ్‌ సెక్రెటరీ అధర్‌ సిన్హా, ఎన్‌డీడీబీ జీఎం సునీల్‌ సిన్హా తదితరులు పాల్గొన్నారు.



తక్కువలోనే అతి ఎక్కువ సంతృప్తిని పొందే వ్యక్తి లోకంలోనే అత్యంత సంపన్నుడు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, జనవరి, 18

దేశం... ధనవంతుల భోజ్యం?

బలవంతుడిదే రాజ్యం అని లోకోక్తి. కానీ, ఇప్పుడు ధనవంతుడిదే రాజ్యం. ఈ సమకాలీన సామాజిక పరిస్థితి కళ్ళ ముందు కనిపిస్తున్నదే అయినా, తాజాగా లెక్కలతో సహా వెల్లడైంది. ప్రభుత్వేతర సంస్థ 'ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్' తన తాజా ప్రపంచ సంపద నివేదికలో ససాక్ష్యంగా కుండబద్దలు కొట్టింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు తొలి రోజు సోమవారం ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన ఈ నివేదికలోని అంశాలు ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. కరోనా కాలం నుంచి ప్రపంచమంతటా ఆర్థిక అంతరాలు బాగా పెరిగాయన్న వాదన అక్షరాలా నిజమని రుజువు చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, నిరుద్యోగం పెరిగిన వేళ ప్రపంచంలోనూ, భారత్‌లోనూ సంపద అంతా కొద్దిమంది చేతుల్లోనే పోగుపడుతుండడం ఆందోళనకరం.

2020 నుంచి కొత్తగా సమకూరిన 42 లక్షల డాలర్లలో మూడింట రెండు వంతుల సంపద ప్రపంచంలోని ఒకే ఒక్క శాతం అపర కుబేరుల గుప్పెట్లో ఉంది. మిగతా ప్రపంచ జనాభా సంపాదించిన సొమ్ముకు ఇది దాదాపు రెట్టింపు అనే నిజం విస్మయపరుస్తుంది. మన దేశానికొస్తే అగ్రశ్రేణి ఒక్క శాతం మహా సంపన్నుల చేతిలోనే 2012 నుంచి 2021 మధ్య జరిగిన సంపద సృష్టిలో 40 శాతానికి పైగా చేరింది. ఇక, దేశ జనాభాలో అడుగున ఉన్నవారిలో సగం మంది వాటా మొత్తం 3 శాతమే. కరోనా వేళ ధనికులు మరింత ధనవంతులయ్యారు. కరోనాకు ముందు భారత్‌లో 102 మంది బిలియనీర్లుంటే, ఇప్పుడు వారి సంఖ్య 166కు పెరిగింది. కరోనా నుంచి గత నవంబర్‌కు దేశంలో శత కోటీశ్వరుల సంపద 121 శాతం పెరిగింది. మరోమాటలో నిమిషానికి 2.5 కోట్ల వంతున, రోజుకు రూ. 3,068 కోట్లు వారి జేబులో చేరింది. కనివిని ఎరుగని ఈ తేడాలు కళ్ళు తిరిగేలా చేస్తున్నాయి.

అలాగే, సంపన్నుల కన్నా, పేద, మధ్యతరగతి వారిపైనే అధిక పన్ను భారం పడుతోందన్న మాట ఆగి, ఆలోచించాల్సిన విషయం. భారత్‌లో జీఎస్టీ ద్వారా వస్తున్న ఆదాయంలో 64 శాతం జనాభాలోని దిగువ సగం మంది నించి ప్రభుత్వం పిండుతున్నదే. అగ్రస్థానంలోని 10 శాతం ధనికుల ద్వారా వస్తున్నది 4 శాతమే అన్న మాట గమనార్హం. ఇవన్నీ సముద్రంలో నీటిబొట్లు. భారతదేశం శరవేగంతో కేవలం సంపన్నుల రాజ్యంగా రూపాంతరం చెందుతోందన్న అంచనా మరింత గుబులు రేపుతోంది. ధనికుల దేవిడీగా మారిన వ్యవస్థలో దళితులు, ఆదివాసీలు, ముస్లిమ్‌లు, మహిళలు, అసంఘటిత కార్మికుల లాంటి అణగారిన వర్గాల బాధలకు అంతమెక్కడ?

అర్ధాకలితో అలమటిస్తున్నవారికీ, మధ్యతరగతికీ మెతుకు విదల్చడానికి సందేహిస్తున్న పాలకులు జేబు నిండిన జనానికి మాత్రం గత బడ్జెట్‌లోనూ కార్పొరేట్ పన్నుల్లో తగ్గింపు, పన్ను మినహాయింపులు, ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వడం విడ్డూరం. ధనికులకు పన్ను రాయితీలిస్తే, వారి సంపద క్రమంగా దిగువవారికి అందుతుందనేది ఓ భావన. అది వట్టి భ్రమ అని ఆక్స్‌ఫామ్ తేల్చేసింది. కొద్దిరోజుల్లో కొత్త బడ్జెట్ రానున్న వేళ పెరుగుతున్న ఆర్థిక అంతరాన్ని చక్కదిద్దడానికి సంపద పన్ను విధించాలంటోంది. పేద, గొప్ప తేడాలు ఇప్పుడు ఎంతగా పెరిగాయంటే, భారత్‌లో అగ్రస్థానంలో నిలిచిన తొలి 10 మంది కుబేరులపై 5 శాతం పన్ను వేసినా చాలు. దాంతో దేశంలో పిల్లలందరినీ మళ్ళీ బడి బాట పట్టించవచ్చు.

దేశంలోకెల్లా మహా సంపన్నుడైన గౌతమ్ అదానీ సంపద నిరుడు 2022లో 46 శాతం మేర పెరిగింది. దేశంలోని అగ్రశ్రేణి 100 మంది అపర కుబేరుల సమష్టి సంపద ఏకంగా 66 వేల కోట్ల డాలర్లకు చేరింది. అదానీ ఒక్కరికే 2017 – 2021 మధ్య చేకూరిన లబ్ధిపై 20 శాతం పన్ను వేస్తే, రూ. 1.79 లక్షల కోట్లు వస్తుంది. దాంతో దేశంలోని ప్రాథమిక పాఠశాల టీచర్లలో 50 లక్షల పైమందికి ఏడాదంతా ఉపాధినివ్వవచ్చని ఆక్స్‌ఫామ్ ఉవాచ. ఈ అంచనాలు తార్కికంగా బాగున్నా, ఆచరణాత్మకత, గత అనుభవాలను కూడా గమనించాలి. సంపద పన్ను సంగతే తీసుకుంటే, మనదేశంలో 1957లోనే దాన్ని ప్రవేశపెట్టారు. కానీ, భారీ ఎగవేతలతో లాభం లేకపోయింది. అసమానతలూ తగ్గలేదు. చివరకు, సంపద పన్ను వసూళ్ళతో పోలిస్తే, వాటి వసూలుకు అవుతున్న ఖర్చు ఎక్కువుందంటూ 2016–17 బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దాన్ని ఎత్తేశారు. అందుకే, మళ్ళీ సంపద పన్ను విధింపు ఆలోచనపై సమగ్రంగా కసరత్తు అవసరం.

పన్నుల వ్యవస్థలో మార్పులు తేవాలి. కాకుంటే, భారత్ లాంటి దేశంలో మధ్యతరగతిని పక్కనపెడితే, మహా సంపన్నులపై ఏ పన్ను వేసినా, అడ్డదోవలో దాన్ని తప్పించుకొనే పనిలో ఉంటారనేది కాదనలేని వాస్తవం. కాబట్టి, భారీ పన్నుల ప్రతిపాదన కన్నా దేశ సామాజిక – ఆర్థిక విధానంలో వారిని భాగం చేయడం లాంటి ఆలోచనలు చేయాలి. విద్య, వైద్యం, ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పనల్లో ఈ కుబేరుల సంపదను పెట్టేలా చూడాలి.

దారిద్య్ర నిర్మూలనకు కార్పొరేట్ అనుకూలత కన్నా సామాన్య ప్రజానుకూల విధానాలే శరణ్యం. స్త్రీ, పురుష వేతన వ్యత్యాసాన్నీ నివారించాలి. కార్పొరేట్ భారతావనిలో సీఈఓలు ఓ సగటు మధ్యశ్రేణి ఉద్యోగితో పోలిస్తే 241 రెట్ల (కరోనాకు ముందు ఇది 191 రెట్లు) ఎక్కువ జీతం సంపాదిస్తున్న వేళ... సత్వరం ఇలాంటి పలు దిద్దుబాటు చర్యలు అవసరం. గత 15 ఏళ్ళలో 41 కోట్లమందిని దారిద్య్ర రేఖకు ఎగువకు తెచ్చామని లెక్కలు చెప్పి, సంబరపడితే చాలదు. ఇప్పటికీ అధికశాతం పేదసాదలైన ఈ దేశంలో ఆర్థిక అంతరాలు సామాజిక సంక్షోభానికి దారి తీయక ముందే పాలకులు విధానపరమైన మార్పులు చేయడమే మార్గం.

దూత లేని దౌత్యమా?

విశ్లేషణ



శశి థరూర్

రెండేళ్ల క్రితం జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా అధికారం స్వీకరించినప్పటి నుంచీ న్యూఢిల్లీలో అమెరికా రాయబారి లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. అమెరికా – భారత్ భాగస్వామ్యం తమ అత్యంత ముఖ్యమైన సంబంధాల్లో ఒకటని బైడెన్ అన్నారు. భారత్‌లో శాశ్వత రాయబారి లేకపోవడానికి సెనేట్ నిర్ధారణ ప్రక్రియే కారణమంటూ శ్వేత సౌధ అధికారులు భుజాలు ఎగరేస్తారు. కానీ అమెరికా బహిరంగంగా పేర్కొంటున్నట్లుగా భారత్ తనకు అంత విలువైన దేశమే అయినట్లయితే, భారత రాయబారిగా తన నామినీ ఎరిక్ గార్‌సెటీని నిర్ధారింప జేసుకోవడంలో అధ్యక్ష పాలనా యంత్రాంగం మరింత శక్తిని ఎందుకు ప్రదర్శించడం లేదనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది.

భారత్‌లో అమెరికా రాయబారిగా లాస్ ఏంజెల్స్ మాజీ మేయర్ ఎరిక్ గార్‌సెటీని తిరిగి నామినేట్ చేయడానికి జో బైడెన్ యంత్రాంగం తీసుకున్న తాజా నిర్ణయం ఇరుదేశాల ద్వైపాక్షిక బాంధవ్యపు విచిత్ర పరిస్థితిని ఎత్తి చూపింది. రెండేళ్ల క్రితం బైడెన్ అధికారం స్వీకరించినప్పటి నుంచీ న్యూఢిల్లీలో అమెరికా రాయబారి లేరు. ఇండో–పసిఫిక్‌లో చైనాకు శక్తిమంతమైన ప్రతిజోడిగా భారత్ మీద అమెరికా ప్రత్యేకమైన శ్రద్ధ పెడుతున్న సమయంలో ఇలా జరగడం గమనార్హం. క్వాడ్ సభ్యులైన ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాతో కలిసి పనిచేస్తున్న భారత్ ఈ ప్రాంతంలో అధికార సమతౌల్యాన్ని కొనసాగించడానికి కీలకంగా ఉంటోంది. ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికాతో ఉన్న ఐ2యూ2 భాగస్వామ్య కూటమి సభ్యురాలిగా కూడా భారత్ మొత్తం మధ్యప్రాచ్యంలో చైనా ప్రభావాన్ని నిలువరించడంలో కీలక పాత్రను కలిగి ఉంటోంది.

వ్యూహాత్మకంగా ఇంత ప్రాధాన్యం కలిగినది అయినప్పటికీ, శ్వేత సౌధం రెండేళ్లుగా భారత్‌లో అమెరికా రాయబారి పదవిని ఖాళీగా ఎందుకు ఉంచినట్లు? అయితే, భారత్‌కు దీంతో ఏమాత్రం సంబంధం లేదు. 2021 జూలైలో గార్‌సెటీ అమెరికా ప్రభుత్వ నూతన యంత్రాంగంలోకి నామినేట్ అయ్యారు. కానీ సెనేట్‌లో తన నియామక నిర్ధారణ సమస్యల్లో చిక్కుకుంది. మేయర్‌గా గార్‌సెటీ తన సహాయకుల్లో ఒకరిపై వచ్చిన లైంగిక వేధింపు ఫిర్యాదులను పట్టించుకోలేదన్న ఆరోపణలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గార్‌సెటీ నియామకాన్ని సమర్థిస్తూ ఓటు వేయాలని పార్టీ ఇచ్చిన పిలుపును వ్యతిరేకిస్తూ కొంతమంది డెమోక్రాట్లు తమ ప్రత్యర్థులైన రిపబ్లికన్లతో చేతులు కలిపారు. ఏప్రిల్ నెలలో అంటే నామినేషన్‌ను ప్రకటించిన తొమ్మిది నెలల తర్వాత, గార్‌సెటీని రాయబారిగా నిర్ధారించేందుకు తగిన ఓట్లు తన వద్ద ఉండకపోవచ్చని సెనేట్ మెజారిటీ లీడర్ చక్ షుమెర్ అంగీకరించారు. దీంతో భారత్‌లో అమెరికా రాయబారి పదవి అనిశ్చితిలో ఉండిపోయింది.

దీనిపట్ల ప్రారంభంలో ఎలా స్పందించాలో తెలియని భారతీయ అధికారులు తర్వాత చీకాకుపడ్డారు. గత 20 నెలల కాలంలో పలువురు అమెరికన్ దౌత్యవేత్తలు తాత్కాలిక బాధ్యతలు స్వీకరించారు. కానీ తమ విజయానికి అతి ముఖ్యమైన స్థానిక సంబంధాలను నెలకొల్పుకోవడానికి ముందే వారంతా బదిలీ అవుతూ వచ్చారు. ఇటీవల, రాయబార పదవికి కెరీర్ డిప్లొమాట్ అయిన ఎలిజిబెత్ జోన్స్ పేరు ప్రకటించారు. కానీ ఆమె నియామకం కూడా తాత్కాలికమే. పూర్తి కాలం రాయబారిని నిర్ధారించగానే ఆమె వైదొలుగుతారని భావిస్తున్నారు.

భారత్‌లో అమెరికా రాయబారి లేకపోవడమన్నది భారత్‌తో పొత్తును విస్తృతపర్చుకోవడంలో అమెరికా నిబద్ధత పైనే ప్రశ్నలు



లేవనెత్తింది. అమెరికా–భారత్ భాగస్వామ్యం తమ అత్యంత ముఖ్యమైన సంబంధాల్లో ఒకటని అమెరికా అధ్యక్షుడు అన్నారు. భారత్ తమకు ఒక విస్మరించలేని భాగస్వామి అని కూడా ఆయన కొనియాడారు. కానీ న్యూఢిల్లీలో అమెరికా రాయబారిని నియమించడంలో బైడెన్ ప్రభుత్వ అసమర్థత కొందరు భారతీయులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. లండన్, ప్యారిస్ నగరాల్లో కూడా ఇంత సుదీర్ఘ కాలంపాటు ఈ పదవిని అమెరికా ఖాళీగా ఉంచగలిగేదా అనేది వారి ఆశ్చర్యానికి కారణం.

ఇదే సమయంలో అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఇంత కీలకంగా ఇదివరకెన్నడూ లేదని చెప్పాలి. చైనాతో పెరుగుతున్న తమ శత్రుత్వం నేపథ్యంలో అమెరికా పక్షాన నిలబడాలంటూ సంవత్సరాలుగా తెస్తున్న ఒత్తిడులను భారత్ ప్రతిఘటిస్తూ వచ్చింది. కానీ హిమాలయాల్లో భారత్ భూభాగంలోకి చైనా ఇటీవలి ఆక్రమణలు చైనా విస్తరణవాదాన్ని భారత్ సవాలు చేసేలా చేశాయి. ఈ ఉమ్మడి అవసరానికి తోడుగా, భద్రత, సాంకేతికత, పర్యావరణ మార్పు అంశాల్లో అమెరికా సాయం భారత్ కోరుతోంది.

భారత్ ఒక ముఖ్యమైన ఆర్థిక భాగస్వామి కూడా. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించినంతవరకూ భారత ఉపఖండానికి అమెరికా అతిపెద్ద వనరుగా ఉంటోంది. 2021లో వీటి విలువ 45 బిలియన్ డాలర్లు. అంతర్జాతీయ సరఫరా చెయిన్లపై చైనా ఆధిపత్యాన్ని నిలువరించేలా అమెరికన్ అధికారులు తమ ఉత్పాదక స్థావరాలను నెలకొల్పేలా అమెరికన్ కంపెనీలను ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో వారు అమెరికా పాలనా యంత్రాంగానికి చెందిన 'ప్రధానమైన మిత్రుల' ఎజెండాలో భారత్‌ను కేంద్ర స్థానంలో నిలిపారు. ఉదాహరణకు ఆపిల్ కంపెనీ 2025 సంవత్సరానికల్లా తన మొత్తం ఐఫోన్‌లలో దాదాపుగా 25 శాతాన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేయనుందని భావిస్తున్నారు. అదే విధంగా, భారతీయ ఔషధ కంపెనీలు అమెరికా సాధారణ జనరిక్ మందుల ప్రధాన సరఫరాదారుగా చైనాను తోసిరాజనగలుగుతాయి.

అయితే గార్‌సెటీ నియామకాన్ని నిర్ధారించడంలో అమెరికా వైఫల్యం ఇరుదేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన బాంధవ్యాన్ని వమ్ము చేసింది. ఆ నిర్ధారణలోని ఘర్షణను అలా ఉంచినట్లయితే, భారత్‌లో రాయబారి పదవికి గార్‌సెటీ ఒక మంచి ఎంపిక అని చెప్పాలి. ఆయనది చిన్న వయసే (51 ఏళ్లు). చురుకైనవాడు. బైడెన్‌తో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధం వల్ల, అధ్యక్షుడితో నేరుగా సంప్రదించే స్థానంలో ఉన్నారు.

అధ్యక్షుడి చెవిలో నేరుగా ఊదగలిగే శక్తి ఉన్న అమెరికన్ రాయబారిని కలిగి ఉండటం అనేది ఆతిథ్య దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. న్యూఢిల్లీలోని అమెరికా రాయబారి నివాసాన్ని రూజ్‌వెల్ట్ హౌస్ అని పిలుస్తారు. చైనా, భారత యుద్ధ కాలం సహా తాను కోరుకున్నప్పుడల్లా అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ బ్యూరోక్రసీని దాటి తన సన్నిహిత మిత్రుడు, అధ్యక్షుడు అయిన జాన్ ఎఫ్. కెన్నెడీని నేరుగా కలవగలిగే స్థాయి ఉన్న జాన్ కెన్నెత్ గాల్‌బ్రెయిత్ వంటి ప్రముఖ ఆర్థికవేత్త ఈ రూజ్‌వెల్ట్ హౌస్‌లో నివసించారు. భవిష్యత్తులో అమెరికా సెనేటర్ కానున్న డేనియల్ ప్యాట్రిక్ మొయినిహాన్ కూడా ఈ పదవిని అలంకరించారు.

భారత్‌లో శాశ్వత రాయబారి లేకపోవడానికి సెనేట్ నిర్ధారణ ప్రక్రియే కారణమంటూ శ్వేత సౌధ అధికారులు భుజాలు ఎగరేస్తూ ప్రైవేటుగా నిందిస్తుంటారు. కానీ అమెరికా బహిరంగంగా పేర్కొంటున్నట్లుగా భారత్ తనకు అంత విలువైన దేశమే అయినట్లయితే, తన నామినీని నిర్ధారింప జేసుకోవడంలో అధ్యక్ష పాలనా యంత్రాంగం మరింత శక్తిని ఎందుకు ప్రదర్శించడం లేదనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది. 2000 సంవత్సరంలో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ చారిత్రాత్మక భారత్ సందర్శన నుంచి, రిపబ్లికన్, డెమోక్రాటిక్ పాలనా యంత్రాంగాలు అమెరికా భౌగోళిక వ్యూహంలో భారత్‌ను అత్యంత ప్రధాన భాగస్వామిగా ఎంచుతూ వచ్చాయి.

డిసెంబర్ నెలలో జీ20 కూటమి అధ్యక్ష బాధ్యతను స్వీకరించిన భారత్ నిజంగానే అమెరికా గ్లోబల్ విజన్‌లో గణనీయంగా ఇమిడి పోతుందనడంలో సందేహమే లేదు. పైగా, పర్యావరణ మార్పు, ఇస్లామిక్ ఉగ్రవాదం వంటి ఉమ్మడి అంశాల్లో సహకారం వల్ల ఇరుదేశాలు ఎంతో ప్రయోజనం పొందగలవు.

ఆసియాలో అమెరికా అత్యంత కీలక భాగస్వామితో వ్యవహరించడానికి తగిన వ్యక్తిగత సంబంధాలను పెంచి పోషించగల రాయబారిని నిర్ధారించే విషయంలో తన రాజకీయ మూలధనాన్ని వెచ్చించడం శ్వేతసౌధానికి తప్పనిసరి అవసరం. ఈ కోణంలో బైడెన్ యంత్రాంగం కలిసి పనిచేసి, ఏమాత్రం జాగు చేయకుండా గార్‌సెటీని న్యూఢిల్లీ విమానం ఎక్కించాలి.

వ్యాసకర్త కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ

('ప్రాజెక్ట్ సిండికేట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆకలి రాజ్యాలు



ఆహార సంక్షోభం కారణంగా పాకిస్తాన్ అంతటా తొక్కిసలాటలు జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా గోధుమ పిండి కొరత తీవ్రంగా ఉంది. 121 దేశాల 'గ్లోబల్ హంగర్ ఇండెక్స్'లో పాకిస్తాన్ 99వ ర్యాంకులో ఉంది. విశేషం ఏమి టంటే ఇండియాలో ఆ దుస్థితి లేనప్పటికీ ఇండియా పాక్ కంటే కూడా అధ్వాన్నంగా 107వ ర్యాంకులో ఉంది!

– అభిషేక్, కాలమిస్ట్

ద్వేషపూరిత వ్యాఖ్యానాలు



ప్రజల మధ్య విభజన సృష్టించే యాంకర్‌లను టీవీ చానళ్లు ప్రోత్సహించ కూడదు. తమ మనసులో ఉన్నది మాట్లాడే హక్కు తమకు లేదని యాంకర్లు గ్రహించాలి. ఈ మాటలు నేను అంటున్నవి కాదు. జస్టిస్ జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం వ్యక్తం చేసిన అభిప్రాయాలు.

– అరీబ్ ఉద్దీన్, అడ్వొకేట్

అంతకంటే ఎక్కువగా



స్వామి వివేకానందను మనం భారతదేశ ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కారకుడిగా కీర్తిస్తున్నాం మంచిదే కానీ, అంతకంటే ముఖ్యంగా ఆయన మన విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి నాంది పలికిన సంగతిని మర్చిపోతున్నాం. నికోలా టెస్లా, సత్యేంద్రనాథ్ బోస్ వంటి వారికి శాస్త్రవేత్తగా ఆయన స్ఫూర్తిని ఇచ్చారు.

– ఆనంద్ రంగనాథన్, సంపాదకుడు

తీరని వడ్డీలు



ఆర్థిక సంక్షోభం పేదల్ని, మధ్య తరగతి వారిని తమ అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేందుకు పురికొల్పుతోంది. అప్పు తీర్చలేనప్పుడు వడ్డీ వ్యాపారులు వీళ్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవడమో, వీళ్లే ఆత్మహత్య చేసుకోవడమో జరుగుతోంది. దేశంలోని ప్రతి గ్రామంలోనూ ఈ పరిస్థితి ఉంది. రెండు వైపులా పోలీసుల నిఘా తప్పనిసరి.

– మహేశ్ లంగ, జర్నలిస్ట్

మనోభావాలు ముఖ్యం

గీత వృత్తికి చెందిన గౌడ కులస్థుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో... వారి సంక్షేమార్థం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ భువనగిరి జిల్లా 'నందనం' అనే గ్రామంలో 8 కోట్ల రూపాయల వ్యయంతో నీరా శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై నెక్లెస్ రోడ్డులో ఒక నీరా హబ్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో దానికి 'వేదామృతం' అని పేరు పెట్టారు. అదే ఇప్పుడు వివాదానికి దారి తీసింది.

హైదరాబాద్‌లోని కొంతమంది బ్రాహ్మణ వర్గం నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారైన డాక్టర్ రమణాచారిని కలిసి నీరాపానీయానికి 'వేదామృతం' అనే నామకరణం ఎంత వరకు సమంజసమైనది అని ప్రశ్నిస్తూ వినతి పత్రం సమర్పించారు. దీంతో వాద ప్రతివాదాలు ఊపందుకున్నాయి.

హిందువుల పవిత్ర గ్రంథాలలో 'వేదాలు' అనేవి చాలా ప్రాధాన్యం సంతరించుకొన్నవనీ, అవి ప్రపంచానికి మార్గదర్శకాలనీ, నీరాకు వేదామృతం అనే పేరు పెట్టడం హైందవ జాతిని అవమానించేదిగా ఉందనే విషయాన్ని తెరమీదకు తీసుకువచ్చారు ఈ పేరును వ్యతిరేకించేవారు.



అయితే కల్లుగీత వృత్తిపై ఆధారపడిన గౌడ కుల సంఘాలు, నాయకులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వేదామృతం పేరును సమర్థించడంతో సమస్య జటిలమైందని చెప్పాలి. ఆయుర్వేద వైద్యపరంగా నీరా అనేది సర్వరోగ నివారిణి అనీ, ముఖ్యంగా క్యాన్సర్‌ను కూడా నివారించే ఔషధ గుణాలున్నాయనేది వారి వాదం.

వేదాల్లో సురాపానం గురించి ఉందనీ, 'సుర' అంటే అమృతం అనీ, దేవతలూ, రాక్షసులూ దానిని సేవించారని ప్రకటనలు ఇవ్వడం సరికాదు. వేదాలకు భారతీయ సంస్కృతిలో ఉన్న ప్రాముఖ్యం, పవిత్రతను దృష్టిలో పెట్టుకుని గౌడ సోదరులు వేదామృతం అనే పేరును సమర్థించే విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. సమాజంలోని అన్ని వర్గాల మనోభావాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– డా॥ మాచర్ల మొగిలి గౌడ్, రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, చేవెళ్ల

కులగణన సమంజసమేనా?

అభిప్రాయం



ఉల్లి బాలరంగయ్య

భారతదేశంలో కులాల వారీగా జనాభాను లెక్కించాలని చాలా రోజుల నుంచి కొంత మంది కుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అనూహ్యంగా ఈ కులగణనకు జెండా ఊపడంతో, కులగణన వలన జరిగే ప్రయోజనాలు, సమస్యలు అనే విషయంపై చర్చ మొదలైంది. కులగణన అనే తేనె తుట్టెను నితీష్ కుమార్ కదిలించడం వెనక రాజకీయ ప్రయోజనాలు మాత్రమే ఉన్నాయని విమర్శకుల వాదన. కులాల వారీ జనాభా లెక్కల సేకరణ డిమాండ్ వెనక సామాజిక అభివృద్ధి కోణం ఉంటే సమర్థనీయమే. అభిలషణీయమే.

ఇక స్వాతంత్ర్యానంతరం కొంత మంది మాత్రమే ఈ దేశాన్ని పాలించడంలో, దేశ వనరులను అనుభవించడంలో ముందంజలో ఉన్నారు. ఆ పనిలో తాము కూడా ముందు ఉండాలని దూరాలోచన కుల గణన సమర్థకుల మనసుల్లో ఉంటే... ఈ విషయంలో వాదాలూ, ప్రతి వాదాలూ, సమస్యలు అనేకం ఉత్పన్నం కావచ్చు. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో దేశంలోని అనేక వర్గాలు వెనుకబడి ఉన్న మాట నిజమే. స్వాతంత్ర్యానంతరం ఈ దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక దృష్టి కోణంతోనే పాలనను సాగించి, నిమ్న వర్గాల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ప్రజల సమగ్ర అభివృద్ధికి బాటలు పరిచిందనేది కాదనలేని నిజం. అయితే ఇంకా ఆయా వర్గాలు వెనకబడే ఉన్నాయనీ, అభివృద్ధి ఫలాల్లో ఎవరి వాటా వారికి అందాలంటే కులగణనే మార్గమనీ కొందరంటున్నారు.



ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దేశ భద్రతకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రజా సంక్షేమానికి ఇవ్వడం లేదనేది కొంతమంది విజ్ఞుల అభిప్రాయం. ఏ కులం వారు ఎంతమంది ఈ దేశంలో ఉన్నారు అనే విషయం తెలిస్తే, ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయపరమైన పదవులు ఏయే కులాల వారికి ఎన్ని దక్కాలి అనే విషయంపై లెక్కలు తేలుతాయని కుల గణనను సమర్థించే నాయకులు చెప్పే మాటలు వాస్తవ విషయంలో నిజం కాక పోవచ్చు. దేశంలో ఇప్పటికే కొన్ని బీసీ కులాల వాళ్ళు తమ కులాలను ఎస్సీల్లో చేర్చండి అనీ, ఎస్టీల్లో చేర్చండి అనే డిమాండ్లను మొదలుపెట్టారు. కొన్ని ఆధిపత్య కులాలవారు తమను బీసీ వర్గాల్లో చేర్చండి అనే డిమాండు లేవదీస్తున్నారు. ఈ కులగణన చేపడితే ఇటువంటి అనేక డిమాండ్లూ, సమస్యలూ చుట్టు ముట్టవచ్చు.

భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం 1871లో కులాల వారీగా భారతదేశాన్ని విభజించి చూసే ప్రణాళిక అల్లింది. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. భారతీయుల్లో జాతీయాభిమానం పెరిగి, భారతదేశంలో తమ పెత్తనం చేజారిపోతుందని ఊహించిన బ్రిటిష్ పాలకులు భారతీయ సమాజాన్ని కులాల వారీగా, మతాల వారీగా విభజించడానికే ఈ కులాల వారీ గణనను ప్రారంభించారనేది వాస్తవం.

ఈ దేశ సమగ్రత, సమైక్యత, శక్తిమంతమైన భారత్ నిర్మాణం ఇత్యాది విషయాల్లో దేశంలోని మిగతా పార్టీల కంటే భారతీయ జనతా పార్టీది భిన్నమైన దృక్పథం. కులాల వారీగా భారతీయ సమాజాన్ని విభజిస్తే– భారతీయ సంస్కృతికి తాను వారసుణ్ణి అనే భావన లుప్తమై, ప్రజల్లో అసంఘటిత భావాలు ప్రబలి, జాతి వ్యతిరేక శక్తులు బలపడతాయని ఆ పార్టీ భావించే... ఇంతవరకు కులగణనను వ్యతిరేకిస్తూ వచ్చింది.

నిజంగా కులగణన అవసరమేనా? ఓట్లను అమ్ముకోకుండా ప్రజలు నీతి, నిజాయతీ, దేశ అభివృద్ధి పట్ల నిబద్ధత కలిగిన నాయకులను ఎన్నుకుంటే సరిపోదా? కులాల లెక్కల వల్ల దేశంలో సౌభ్రాతృత్వ వాతావరణం నెలకొంటుందా? కుల గణనను సమర్థించే వారందరూ ఈ విషయాలను గమనంలో ఉంచుకుంటే కొంత ప్రయోజనం ఉంటుంది.

వ్యాసకర్త రాజకీయ సామాజిక విశ్లేషకులు

మరపురాని కవి సమ్మేళనం

జనవరి 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సర్వభాషా కవిసమ్మేళనానికి హాజరు కావటం జీవితంలో మరచిపోలేని జ్ఞాపకం. ఏటా ఆలిండియా రేడియో – భారత ప్రభుత్వం గుర్తింపు పొందిన 22 భాషల నుంచి 23 మందిని (ఒక్క హిందీ భాష నుంచి మాత్రం ఇద్దరు) సెలెక్ట్ చేసి, ఏదో ఒక నగరంలో ఈ సమ్మేళనం ఏర్పాటు చేస్తుంది. ఈ సంవత్సరం ఢిల్లీలో నిర్వహించిన సర్వభాషా కవిసమ్మేళనానికి తెలుగు భాష నుంచి నా కవిత 'అమృతోపనిషత్' ఎన్నికైంది.

మొదటిరోజు (9వ తేదీ) ఢిల్లీ ఆకాశవాణి సమావేశ మందిరంలో రిహార్సల్స్ చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రసారభారతి ఉన్నతాధికారులు హాజరై ప్రతి కవినీ జ్ఞాపిక, శాలువాలతో సగౌరవంగా సత్కరించారు. రెండోరోజు (10వ తేదీ) తొలుత మూలభాషలో కవిత చదివించి, వెంటనే హిందీ అనువాదం వినిపించారు. ప్రతి కవినీ ఆహ్వానించే ముందు ఆ కవి గురించి హిందీలో పరిచయం చేశారు. నేను సాహిత్యంలో చేసిన కృషి, ప్రచురించిన పుస్తకాలు, చేస్తున్న ఉద్యోగంతో పాటు... మా నాన్న స్మృత్యర్థం స్థాపించిన 'మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' తరపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి కూడా యాంకర్ స్వచ్ఛమైన హిందీలో చెప్పినప్పుడు నా భావోద్వేగం తారస్థాయికి చేరుకుంది.

ఆ పెద్ద హాలులో తెలుగు తెలిసిన ఒక్కరూ లేకపోయినా, నా మట్టుకు నేను సీరియస్‌గా కవితను (ఆలిండియా రేడియో రికార్డింగ్ కోసం) చదివాను. ఆ తర్వాత డాక్టర్ పుష్పాసింగ్ నా కవితకు హిందీ అనువాదం చదివినప్పుడు, మంచి స్పందన వచ్చింది. అయిదారు సార్లు 'వహ్వా వహ్వాలు' సభలో సందడి చేశాయి. ఆమె మంచి ఫ్రెండ్ అయ్యారు. ఈ అరుదైన సందర్భంలో అన్ని రాష్ట్రాల కవులతో పాటు ప్రత్యేకించి గోవా, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులను కలవటం ప్రత్యేక అనుభూతి. వారి అనుభవాల్ని గ్రహించటం సాహిత్యంలో సరికొత్త పాఠాలు నేర్చుకోవటమే. పంజాబీ కవి గురుతేజ్‌తో ఎక్కువ సమయం వెచ్చించే అవకాశం దొరికింది. ఇండో–పాక్ బోర్డర్‌లో ఓ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సింగ్ అనేక విషయాలు నాతో పంచుకున్నారు. కశ్మీరీ కవి డాక్టర్ గులామ్ నబీ హలీమ్ చలాకీగా తిరుగుతూ అందరినీ అల్లుకుపోయాడు. ఈ ఇద్దరూ నా ఇతర కవితల ఆంగ్లానువాదాలు తమకు పంపమని, వాటిని తమ భాషల్లోకి తర్జుమా చేస్తామని అడిగారు. నేను వేదిక దిగగానే ఢిల్లీకి చెందిన మరో ముగ్గురు మహిళలు కూడా ఇదే అభ్యర్థన చేశారు. ఇవి నాకు సరికొత్త ద్వారాలు.



జ్ఞాపిక తీసుకుంటున్న వ్యాసకర్త

నా రూమ్మేట్ అయిన మరాఠీ కవి అనిల్ సబాలే, పక్క గదిలో దిగిన సంథాలీ కవి గౌరు ముర్ము, పోలీస్ డిపార్ట్‌మెంటులో పనిచేసే మణిపురి కవి క్షేత్రి రాజన్ తదితరులతో ఎక్కువగా చర్చించే అవకాశం దొరికింది. నా సాహిత్యపు డైరీలో కొత్త మిత్రులు చేరారు. నా కవిత 21 భాషల్లోకి తర్జుమా అవుతుందన్న సంతోషం మరింత కిక్కిచ్చే అంశం. ఈ సర్వ భాషా కవిసమ్మేళనం జనవరి 25వ తేదీ రాత్రి 10 గంటలకు అన్ని రేడియో స్టేషన్ల నుంచి ప్రసారమవుతుంది.

– ఎమ్వీ రామిరెడ్డి, రచయిత, మొబైల్: 98667 77870

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.ఏకాదశి ఉ.11.35 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: అనూరాధ ప.1.40 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.6.56 నుండి 8.31 వరకు, దుర్ముహూర్తం: ప.11.48 నుండి 12.32 వరకు, అమృతఘడియలు: తె.4.09 నుండి 5.41 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.43

ఆగని మాస్టర్ ప్లాన్ మంటలు

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్న ఎమ్మెల్యే సంజయ్



పంచాయతీ కార్యాలయంపై మహిళల నిరసన

జగిత్యాల: జిల్లాలో మాస్టర్ ప్లాన్ మంటలు మంగళవారం మరింత ఉధృత రూపం దాల్చాయి. పట్టణ సమీపంలోని మోతె, తిమ్మాపూర్, అంబారిపేట, నర్సింగాపూర్, ధరూర్, లింగంపేట, హస్నాబాద్ గ్రామాల్లో రైతులు, నాయకులు, ప్రజలు బల్దియా తీరుపై నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లోంచి ర్యాలీగా బయలు దేరి జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. తమ గ్రామాలను మాస్టర్ ప్లాన్ పరిధి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంబారిపేట గ్రామపంచాయతీ కార్యాలయ భవనం ఎక్కిన మహిళలు.. నిరసన తెలిపారు. కాగా, ప్రతిపక్షాలు మాస్టర్‌ప్లాన్‌పై చేస్తున్న అసత్య, అర్ధసత్య ప్రచారాలు నమ్మొద్దని, రైతులు, ప్రజలకు తాను వెన్నంటి ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భరోసానిచ్చారు. అయితే, మాస్టర్ ప్లాన్‌ను కేవలం జగిత్యాల పట్టణం వరకే పరిమితం చేస్తే ఎవరికీ ఎలాంటి నష్టం జరగదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

మరో రైతు ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ వివాదం


చికిత్స పొందుతున్న బాలక్రిష్ణ

సాక్షి, కామారెడ్డి: తన భూమిని రిక్రియేషన్ జోన్‌లో కలిపారన్న ఆవేదనతో మంగళవారం ఓ రైతు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కామారెడ్డి కొత్త మాస్టర్‌ప్లాన్‌లో పంట భూములను ఇండస్ట్రియల్, గ్రీన్, రిక్రియేషన్ జోన్ల కింద పేర్కొనడంపై రైతాంగం నెలన్నర రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం రామేశ్వర్‌పల్లికి చెందిన రైతు మర్రిపల్లి బాలక్రిష్ణ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించగా, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నాడు. తనకున్న ఎకరం భూమి రిక్రియేషన్ జోన్‌లోపోతే పిల్లలను ఎలా పెంచాలి, పెళ్లిళ్లు ఎలా చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మరోవైపు, మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలంటూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో 8గ్రామాలకు చెందిన రైతులు కలెక్టరేట్ ముట్టడి, కుటుంబ సభ్యులతో ర్యాలీ వంటి నిరసన వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆయా గ్రామాలకు చెందిన 9 మంది కౌన్సిలర్లు ఈనెల 19లోపు రాజీనామా చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ డెడ్‌లైన్ విధించింది. దీంతో బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు రాజీనామా లేఖలను రైతు జేఏసీకి అందించారు.

ఆ మూడు మాస్టర్‌ప్లాన్లు ముసాయిదానే..

- 60 రోజుల్లో ప్రజలు అభ్యంతరాలు చెప్పొచ్చు: డీటీసీపీ విద్యాధర్
- తుది ప్రణాళికలో మార్పులు చేర్పులుంటాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే పురపాలక సంస్థల మాస్టర్‌ప్లాన్ ఉంటుందని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) విద్యాధర్ తెలిపారు. కామారెడ్డి, జగిత్యాల, నిర్మల్ మునిసిపాలిటీల మాస్టర్‌ప్లాన్ విషయంలో కొద్దిరోజులుగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని పట్టణాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగానే మునిసిపాలిటీలకు మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. మాస్టర్‌ప్లాన్ రూపొందించిన తరువాత ముసాయిదాను పబ్లిష్ చేసి, 60 రోజుల్లో ప్రజల సూచనలను, అభ్యంతరాలను కోరతామన్నారు. ముసాయిదాపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను మునిసిపాలిటీ కౌన్సిల్‌లో చర్చించి, సవరణల కోసం ప్రభుత్వానికి పంపిస్తారని తెలిపారు. వీటి ఆధారంగా తుది మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తారని వివరించారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ ముసాయిదాకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు కోరుతూ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ఈనెల 11తో ముగిసిందని తెలిపారు. ప్రజల అభ్యంతరాలపై కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉందన్నారు. జగిత్యాల మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై అభ్యంతరాలకు గడువు ఫిబ్రవరి 6 వరకు ఉందని, అలాగే నిర్మల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై మార్చి 2 వరకు అభ్యంతరాలు చెప్పొచ్చని విద్యాధర్ తెలిపారు.

కామాంధుల అకృత్యానికి బాలిక బలి

తీవ్ర రక్తస్రావంతో మృతి... నల్లగొండ జిల్లాలో దారుణం

పెద్దఅడిశర్లపల్లి: కామాంధుల అకృత్యానికి ఓ బాలిక బలైన దారుణ ఘటన నల్లగొండ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పదో తరగతి చదువుతున్న హైదరాబాద్‌కు చెందిన బాలిక సంక్రాంతి పండుగకు ఈ నెల 13న పీఏపల్లి మండలంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వచ్చింది. తిరిగి మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు బయల్దేరింది. పెద్ద అడిశర్లపల్లి మండలం వడ్డెరిగూడేనికి చెందిన యువకులు నరేశ్, శివ, దిలీప్‌లో కారులో అంగడిపేట క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్తుండగా పరిచయస్తులే కావడంతో అక్కడి వరకు వస్తానని బాలిక వారి కారు ఎక్కింది. క్రాస్‌రోడ్డు వద్ద కారు దిగిన బాలిక హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా బస్టాప్ ఎదురుగానే నరేశ్‌కు వస్త్ర దుకాణం ఉంది. ఎండలో బస్సు కోసం చూస్తున్న బాలికను అతను తన వస్త్ర దుకాణంలోకి పిలిచాడు. అప్పటికే మిగిలిన ఇద్దరు యువకులూ అదే దుకాణంలోనే ఉన్నారు. కొంత సమయం తర్వాత బాలిక స్పృహ తప్పిపోయిందని ముగ్గురు యువకులూ స్థానిక డాక్టరుకు చూపించగా దేవరకొండకు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే వారు అక్కడికి తరలించగా బాలిక అప్పటికే మృతిచెందిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో నరేశ్, శివ, దిలీప్‌లు పరారయ్యేందుకు యత్నించగా స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించగా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ముగ్గురు యువకులూ బాలికపై అత్యాచారం చేయడంతోనే తీవ్ర రక్తస్రావంతో మృతిచెందిందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. కాగా, తన కూతురును అఘాయిత్యం చేసి హత్య చేశారంటూ బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సిద్దిపేట మార్కెట్'కు ఫుడ్ సేఫ్టీ గుర్తింపు

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట సమీకృత మార్కెట్‌కు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు లభించింది. ఈ మేరకు ఆ సంస్థ అధికారులు సిద్దిపేట సమీకృత మార్కెట్‌కు ధ్రువీకరణ పత్రం అందజేశారు. అమెరికా తరహాలో కూరగాయలు, మాంసం, పండ్లు ఇలా అన్నీ ఒకే ప్రాంగణంలో లభించే రీతిలో ఏడెకరాల విస్తీర్ణంలో నిర్మించారు. స్వచ్ఛమైన వాతావరణంలో పరిశుభ్రమైన పరిసరాల నడుమ కూరగాయలు, మాంసం, చేపలు విక్రయించడాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన విశాల్‌మిశ్రా బృందం ఇటీవల పరిశీలించింది. ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేసి ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువీకరణ పత్రం మంగళవారం జారీ చేశారు. పాలకవర్గం, సిబ్బందిని మంత్రి హరీశ్‌రావు అభినందించారు.

25న పోలవరం బ్యాక్‌వాటర్‌పై సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై ఈ నెల 25న కేంద్ర జలశక్తి శాఖ ఏపీ, తెలంగాణ, ఒడిషా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో సమావేశం నిర్వహించనుంది. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై తెలంగాణ, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కేంద్రానికి లేఖ రాయగా, సీడబ్ల్యూసీ బదులిచ్చింది. ఈ సమాధానాలపై అభ్యంతరాలుంటే ఈనెల 20లోగా పంపించాలని ఆయా రాష్ట్రాలను (కేంద్ర జలసంఘం)సీడబ్ల్యూసీ కోరింది. ఫిబ్రవరి 15న పోలవరం ముంపుపై సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో 25న నిర్వహించనున్న సమావేశానికి ప్రాధాన్యత ఉందని సీడబ్ల్యూసీ తెలిపింది. పోలవరం ముంపు ప్రభావిత ప్రాంతాలకు రక్షణతో పాటు బాధిత రైతులకు పరిహారం, పునరావాసం కల్పించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది.

'కన్ఫర్డ్' కిరికిరి!



హడావుడిగా కన్ఫర్డ్ ఐఏఎస్ నాన్ ఎస్‌సీఎస్ కోటా భర్తీ ప్రక్రియ షెడ్యూల్!

- మొత్తం ఐదు పోస్టుల భర్తీకి సర్కారు నిర్ణయం
- గతానికి భిన్నంగా దరఖాస్తుకు వారం మాత్రమే గడువు ఇచ్చారనే విమర్శలు
- పలు శాఖల్లోని అధికారులకు సమాచారం చేరేలోపే ముగిసిన సమయం
- అర్హతలున్నా సిద్ధంగా లేక దరఖాస్తు చేసుకోలేక పోయిన సీనియర్ అధికారులు
- కనీసం నెలరోజుల సమయం ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి
- ముందస్తు లీకులు, పైస్థాయిలో పైరవీలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు
- 1:5 నిష్పత్తిలో 25 మందితో ప్రాథమిక జాబితాను యూపీఎస్సీకి పంపిన ప్రభుత్వం
- ఈనెల 24, 27 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్న యూపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: నాన్ స్టేట్ సివిల్ సర్వీస్ కేటగిరీలో కన్ఫర్డ్ ఐఏఎస్‌ల భర్తీ కోసం కొనసాగించిన దరఖాస్తు ప్రక్రియ, ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక జాబితాలోని అధికారుల సీనియార్టీపై అధికారవర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు ఈ మేరకు తమకు సమాచారమే అందలేదని అంటుండడం చర్చనీయాంశమవుతోంది. అవకాశం కోల్పోయిన సీనియర్ అధికారుల్లో దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారిగా..

ఐఏఎస్... అఖిల భారత సర్వీసులో అత్యున్నతమైన పోస్టు. ఈ కొలువుకు సివిల్ సర్వీసెస్ ద్వారా ఎంపిక కావడం ఒక పద్ధతైతే.. రాష్ట్ర స్థాయిలో అర్హత కలిగిన కొందరు సీనియర్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపిస్తే.. అక్కడ జరిగే ఇంటర్వ్యూలో ఉత్తీర్ణతతో కన్ఫర్డ్ ఐఏఎస్‌గా ఎంపిక కావడం మరో విధానం. పలువురు సీనియర్ రెవెన్యూ అధికారులు ఎస్‌సీఎస్ (స్టేట్ సివిల్ సర్వీస్) కోటాలో పదోన్నతులతో ఐఏఎస్‌లుగా ఎంపికవుతుండగా.. ఇతర విభాగాలకు చెందినవారు నాన్ ఎస్‌సీఎస్ పద్ధతిలో సెలక్షన్ విధానంతో అతి తక్కువ సంఖ్యలో కన్ఫర్డ్ ఐఏఎస్‌లు అవుతుంటారు. ఈ క్రమంలోనే 2021 సంవత్సరానికి సంబంధించి నాన్ ఎస్‌సీఎస్ కేటగిరీలో ఐఏఎస్ (తెలంగాణ కేడర్) పోస్టుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గతేడాది నవంబర్ 25వ తేదీన సచివాలయంలోని అన్ని ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు లేఖ రాశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొలిసారిగా నాన్ ఎస్‌సీఎస్ కేటగిరీలో కన్ఫర్డ్ ఐఏఎస్ ప్రక్రియ మొదలు పెట్టారు. ఇందులో భాగంగా అర్హతలున్న అధికారులు 2022 డిసెంబర్ 3వ తేదీ నాటికి పూర్తిస్థాయి వివరాలతో కూడిన దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఆ మేరకు దరఖాస్తులు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఐదు పోస్టులకు 1:5 నిష్పత్తిలో 25 మందితో ప్రాథమిక జాబితాను రూపొందించి యూపీఎస్సీకి పంపింది. ఈనెల 24, 27వ తేదీల్లో యూపీఎస్సీ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలోనే ఇందుకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ, ఈ క్రమంలో చోటు చేసుకున్న పరిణామాలు అధికారవర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

అర్హులైనా గడువులోపు ఏసీఆర్‌లు అందక...

నాన్ ఎస్‌సీఎస్ కేటగిరీలో కన్ఫర్డ్ ఐఏఎస్ కోసం శాఖల వారీగా అర్హులైన అభ్యర్థుల నుంచి పూర్తిస్థాయి బయోడేటాతో కూడిన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం వారం రోజుల గడువును మాత్రమే ఇస్తున్నట్లు లేఖలో స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన లేఖ సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు చేరడం.. అక్కడ్నుంచి సంబంధిత శాఖ ఉన్నతాధికారి (కమిషనర్/డైరెక్టర్)కు వెళ్లడం, ఆ తర్వాత కిందిస్థాయిలో ఉద్యోగులకు చేరడం, ఈ మేరకు ఫైళ్లు రూపొందించడం.. ఈ యావత్ ప్రక్రియకు బాగా సమయం పడుతుంది. అయితే ప్రభుత్వం వారం రోజులు మాత్రమే గడువు ఇవ్వగా.. పలు శాఖల్లోని అధికారులకు ఈ మేరకు సమాచారమే అందలేదని తెలుస్తోంది. కొన్ని శాఖల అధికారులకు గడువు తేదీ ముగిసిన తర్వాత తెలియడంతో నిరాశకు గురికాగా.. మరికొందరికి చివరి నిమిషంలో తెలిసినప్పటికీ ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్)లు అందక దరఖాస్తు చేసే అవకాశం లేకపోవడంతో లబోదిబోమన్నారు. ప్రభుత్వం ఇదివరకు కనిష్టంగా నెలరోజుల గడువు ఇచ్చేదని, ఆ తర్వాత కూడా అధికారుల వినతుల మేరకు మరో వారం నుంచి పక్షం రోజుల వరకు గడువు పొడిగించేదని పలువురు అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా కేవలం వారం రోజుల గడువే ఇవ్వడంతో అన్నిరకాల అర్హతలున్న వారు కూడా కనీసం దరఖాస్తు కూడా చేయలేక పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లీకులు... పైరవీలు

నాన్ ఎస్‌ఈసీ కన్ఫర్డ్ ఐఏఎస్‌ల ప్రక్రియకు సంబంధించిన సమాచారం కొందరికి ముందస్తుగానే లీకైనట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక మంత్రుల వద్ద ప్రత్యేక విధుల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు, ప్రభుత్వ స్థాయిలో పరపతి కలిగిన అధికారులు ముందు జాగ్రత్తగా దరఖాస్తుకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా ముందస్తుగా సమాచారం తెలిసి సిద్ధమైన వారే దరఖాస్తులు సమర్పించగలిగారని అంటున్నారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న సీనియర్లు సైతం అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయారని చెబుతున్నారు. కొన్నిచోట్ల ఒకరిద్దరు సీనియర్లు అన్నిరకాల సమాచారాన్ని సమర్పించినప్పటికీ ప్రాథమిక జాబితాలో వారి పేర్ల స్థానంలో జూనియర్ల పేర్లు ఎంపికయ్యాయని కొందరు అధికారులు ఆరోపిస్తున్నారు. ఇదివరకు ఏసీబీ వలలో చిక్కి విధుల నుంచి సస్పెండ్ అయ్యి, జైలుకు సైతం వెళ్లిన ఓ అధికారి పేరు జాబితాలో ఉండటం అధికార వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరో నలుగురు అధికారులు పరిపాలన విభాగంలో గత కొంత కాలంగా విధులు నిర్వహించనప్పటికీ వారు కూడా జాబితాలో చోటు దక్కించుకోవడం గమనార్హం. మొత్తంగా పైస్థాయిలో పైరవీలతో జాబితా రూపొందించారనే ప్రచారం జరుగుతుండగా, ప్రభుత్వం దీనిపై స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

నాన్ ఎస్‌సీఎస్ కేటగిరీలో కన్ఫర్డ్ ఐఏఎస్‌కు అర్హతలు

అత్యుత్తమ ప్రతిభా సామర్థ్యాలు కలిగిన డిప్యూటీ కలెక్టర్ హోదా పే స్కేల్ కలిగిన అధికారి ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు.	2022 జనవరి ఒకటో తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వంలో 8 సంవత్సరాల నిరంతర సర్వీసులో ఉండాలి.	ఎంపిక ప్రక్రియ మొదలైన ఏడాది నాటికి 56 ఏళ్ల కంటే తక్కువ వయసుండాలి.	ఇదివరకు సెలక్షన్ లిస్టులో పేరు ఉన్నట్లైతే వారికి అవకాశం ఉండదు.	దరఖాస్తు చేసుకునే అధికారి శాఖాపరంగా ఎలాంటి క్రమశిక్షణ చర్యలకు గురై ఉండకూడదు. విచారణలు పెండింగ్‌లో సైతం ఉండొద్దు.

భూమి కోల్పోయాననే ఆవేదనతో..

మాజీ నక్సలైట్ ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న కొడెం సమ్మయ్య

ఇల్లెందురూరల్: ప్రభుత్వ శాఖల సమన్వయలోపం వల్లే తనకు భూ సమస్య ఏర్పడిందని ఓ మాజీ నక్సలైట్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే అక్కడున్న ప్రజలు అతడిపై నీళ్లు చల్లి అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఇల్లెందుకు చెందిన కొడెం సమ్మయ్య పీపుల్స్‌వార్‌లో సుదీర్ఘ కాలం పనిచేసి, 2008లో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆ సమయంలో పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు పునరావాసం కింద 1.20 ఎకరాల భూమినికి అతడికి కేటాయించారు. ఆ భూమిని వైటీసీ నిర్మాణానికి మళ్లీ అధికారులు స్వాధీనం చేసుకుని, సుభాష్‌నగర్ గురుకులం వెనుక ఇచ్చారు. అయితే ఆ భూమిని ఓ పార్టీకి చెందిన నేత ఆక్రమించుకోవడంతో న్యాయంకోసం సమ్మయ్య కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరాడు. స్థానిక రెవెన్యూ అధికారుల సూచనతో అతడికి కేటాయించిన భూమిలో గుడిసె వేసుకుంటే, సదరు నేత ఫిర్యాదుతో పోలీసులు సమ్మయ్యను అడ్డుకుంటున్నారు. అధికారికపత్రం లేకుండా సమ్మయ్యను భూమి జోలికి వెళ్లొద్దని పోలీసులు చెబుతుండగా..మరోవైపు భూమిహక్కుకు సంబంధించి రెవెన్యూ అధికారులు స్పష్టమైన పత్రాలు ఇవ్వకపోవడంతో వారిపై న్యాయపోరాటం చేసేందుకు అతడికి అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా అక్కడే ఉన్న కార్యాలయ సిబ్బంది, ప్రజలు అతడిపై నీళ్లు చల్లి అడ్డుకున్నారు. కాగా, ఈ ఘటనపై తహసీల్దార్ కృష్ణవేణి స్పందిస్తూ రెండు రోజుల్లో సమ్మయ్యకు భూమి అప్పగింతపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీమా డబ్బుల కోసం డ్రామా

కారు దహనం కేసులో అనూహ్య మలుపు

- డ్రైవర్‌ను చంపి.. కారులో సజీవ దహనం చేసి.. తాను ప్రమాదంలో చనిపోయినట్లు ధర్మా స్కెచ్
- భార్య ఫోన్‌కు పంపిన మెసేజ్ ఆధారంగా విచారణ
- మహారాష్ట్రలోని పుణెలో ధర్మా అరెస్టు


సీసీ కెమెరాలో రికార్డయిన కారు. (ఇన్‌సెట్‌లో) ధర్మా

మెదక్‌జోన్: కారుతోసహా వ్యక్తి సజీవదహనమైన కేసులో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. చనిపోయాడనుకున్న వ్యక్తి బతికే ఉన్నట్లు తేలింది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం నాటకం ఆడి అడ్డంగా పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన వివరాలు.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బీమ్లా తండాకు చెందిన ధర్మానాయక్ సెక్రెటేరియేట్‌లోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 5న స్వగ్రామానికి వచ్చాడు. 6న మిత్రులతో కలిసి బాసరకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. 7న రాత్రి ఇంటికొస్తున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. 8వ తేదీ రాత్రి వెంకటాపూర్ గ్రామ శివారులో ధర్మా కారుతో సహా కాలిపోయాడనే సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు పక్కనే ఖాళీ పెట్రోల్ బాటిల్ గుర్తించారు. దీంతో ధర్మా ప్రమాదంలో చనిపోయాడా? ఎవరైనా హత్య చేశారా.. అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

మెస్సేజ్ ఆధారంగా గుర్తింపు..

విచారణ ప్రారంభించిన పోలీసులు ధర్మా భార్య నీల ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ధర్మా పుణెకు వెళ్లి తన భార్య ఫోన్‌కు తన డెత్ సర్టిఫికెట్ తీసి ఇన్సూరెన్స్ డబ్బులకు దరఖాస్తు చేయాలని మెస్సేజ్ పంపాడు. దీని ఆధారంగా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. పోలీసులు పుణెలో ధర్మాను అరెస్ట్‌చేశారు. భార్యభర్తలిద్దరూ కలిసే ఈ స్కెచ్ వేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ నెల 4న ధర్మా హైదరాబాద్‌లోని అడ్డాపై ఉన్న బిహార్‌కు చెందిన ఓ వ్యక్తిని కారు డ్రైవర్‌గా పనిలో పెట్టుకున్నట్టు తెలుస్తోంది. తెలిసిన వ్యక్తిని కారు డ్రైవర్‌గా పెట్టుకుంటే చంపడం కుదరదనుకుని ఇలా ప్లాన్ చేశాడు. ధర్మా 8వ తేదీన డ్రైవర్‌కు ఫుల్‌గా మద్యం తాగించిన తర్వాత గొడ్డలితో నరికిచంపి, ఆపై కారులో మృతదేహాన్ని ఉంచి పెట్రోల్ పోసి తగులబెట్టినట్టు అనుమానిస్తున్నారు. దీనిపై ధర్మాను పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నట్టు తెలిసింది.

బెట్టింగ్‌లు ఆడి...

ధర్మా కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌తోపాటు బెట్టింగ్‌లు ఆడి సుమారు రూ.2 కోట్ల వరకు పోగొట్టుకున్నట్లు తెలిసింది. దీంతో తెచ్చిన అప్పులను తీర్చే మార్గం కానరాక భారీ స్కెచ్ వేశాడు. తన పేరుపై ఉన్న 4 ఎల్ఐసీ పాలసీల క్లెయిమ్ విలువ రూ.7 కోట్లు ఉంటుందని సమాచారం. ప్రమాదంలో చనిపోయింది ధర్మానే అనేవిధంగా నమ్మించి బీమా డబ్బులు పొందాలని చూశాడు. కాగా, ధర్మా నాయక్ తమ అదుపులోనే ఉన్నాడని మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని చెప్పారు. కారు దహన ఘటనపై విచారిస్తున్నామని, బుధవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



ముకరంజాకు సీఎం కేసీఆర్ నివాళి

శంషాబాద్/చార్మినార్: టర్కీలోని ఇస్తాంబుల్‌లో ఈ నెల 14న తుదిశ్వాస విడిచిన ఎనిమిదో నిజాం ముకరంజా బహదూర్ పార్థివదేహం మంగళవారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఇస్తాంబుల్ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన పార్థివ దేహాన్ని హైదరాబాద్‌కు తెచ్చారు. భారీ బందోబస్తు నడుమ చౌమహల్లా ప్యాలెస్‌కు తీసుకెళ్లారు. రాత్రి 7 గంటలకు ముకరంజా భౌతికకాయాన్ని సందర్శించి సీఎం కేసీఆర్ నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మంత్రులు మహ్మద్ మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డితోపాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు ముకరంజా భౌతికకాయానికి నివాళులర్పించారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్యాలెస్‌లో ముకరంజా భౌతిక కాయాన్ని సందర్శించేందుకు ప్రజలను అనుమతించనున్నారు. మధ్యాహ్నం ప్యాలెస్ నుంచి మక్కా మసీదు వరకు నిజాం అంతిమ యాత్ర నిర్వహించనున్నారు. మక్కా మసీదులో తన పూర్వీకులైన నిజాం సమాధుల పక్కన ముకరంజా పార్థివదేహాన్ని ఖననం చేయనున్నారు. అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

యుద్ధాలతో గుణపాఠాలు నేర్చుకున్నాం

పాక్ ప్రధాని షహబాజ్ వ్యాఖ్యలు
భారత్‌తో చర్చలకు సిద్ధమని ప్రకటన



ఇస్లామాబాద్: భారత్‌తో మూడు యుద్ధాల అనంతరం గుణపాఠాలు నేర్చుకున్నామని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. ''భారత్‌తో మూడు యుద్ధాలు చేశాం. సాధించిందేమీ లేదు. పైగా పేదరికం, వేదన, నిరుద్యోగం వచ్చి మీదపడ్డాయి. యుద్ధాలతో గుణపాఠాలు నేర్చుకున్నాం. ఇకమీదటైనా శాంతిమయ జీవనం కొనసాగిస్తాం. తరాలుగా కొనసాగుతున్న సమస్యలకు చెక్ పెడదాం. బాంబులు, మందుగుండు సామగ్రి కోసం అమూల్యమైన సహజ వనరులను దుర్వినియోగం చేయడం ఆపేద్దాం. దశాబ్దాలుగా ఘర్షణలకు, యుద్ధాలకు కారణమైన కశ్మీర్ వంటి కీలకాంశాలపై భారత్‌తో నిజాయతీతో చర్చలకు సిద్ధం'' అని అల్ అరేబియా ఛానెల్ ఇంటర్వ్యూలో అన్నారు. యూఏఈ మధ్యవర్తిత్వంలో చర్చలు జరిపితే బాగుంటుందన్నారు. 'ప్రధాని మోదీజీకి నా సందేశం ఒక్కటే. పాకిస్తాన్, ఇండియా పొరుగుదేశాలుగా జీవించాల్సిందే. సంఘర్షణల మధ్య సమయాన్ని, సహజ వనరులను వృథా చేయడం దండగ. శాంతి సామరస్యాలతో పురోగమిద్దాం' అన్నారు.

చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించే... కృత్రిమ క్లోమం

తొలి పరీక్ష ఇప్పటికే విజయవంతం • త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం



లండన్: టైప్–2 మధుమేహులకు ఇది నిజంగా శుభవార్తే! ప్రపంచవ్యాప్తంగా మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. భారత్‌లోనైతే 2019 నాటికి ఏకంగా 7.7 కోట్ల మంది దీని బారిన పడ్డారు. 2045 కల్లా వీరి సంఖ్య 13.4 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ఒంట్లో చక్కెర మోతాదులను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచేందుకు దోహదపడే కృత్రిమ క్లోమాన్ని కేంబ్రిడ్జి వర్సిటీలోని వెల్‌కమ్–ఎంఆర్‌సీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటబాలిక్ సైన్స్ పరిశోధకులు తాజాగా అభివృద్ధి చేశారు. దీన్నిప్పటికే విజయవంతంగా పరీక్షించి చూశారు కూడా! టైప్–2 డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి ఇది వరప్రసాదమేనని వారు చెబుతున్నారు. కామ్‌ఏపీఎస్ హెచ్‌ఎక్స్‌గా పిలిచే దీంట్లో గ్లూకోజ్ మానిటర్, ఇన్సులిన్ పంపు ఉంటాయి. ఇది యాప్ సాయంతో పని చేస్తుంది. చక్కెర స్థాయి సరైన విధంగా కొనసాగాలంటే ఎప్పుడు ఎంత ఇన్సులిన్ అవసరమో అంచనా వేసి చెబుతుంది. ''ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇన్సులిన్ ఇంజక్షన్లు తదితరాలతో బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను సరిగా మెయింటెయిన్ చేయడం టైప్ 2 డయాబెటిస్ రోగుల్లో చాలామందికి సమస్యగా మారింది. అలాంటి వారికి ఈ కృత్రిమ క్లోమం సురక్షితమైన, మెరుగైన ప్రత్యామ్నాయం. దీని టెక్నాలజీ చాలా సులువైనది. కనుక ఇంట్లో సురక్షితంగా వాడుకోవచ్చు'' అని అధ్యయనానికి సారథ్యం వహించిన చార్లొటీ బౌటన్ తెలిపారు. దీని వివరాలు జర్నల్ నేచర్ మెడిసిన్‌లో పబ్లిషయ్యాయి.

ఇలా చేశారు...

కామ్‌ఏపీఎస్ హెచ్‌ఎక్స్‌ను తొలుత 26 మంది టైప్–2 డయాబెటిస్ రోగులపై ప్రయోగాత్మకంగా వాడి చూశారు. వీరిని రెండు గ్రూపులుగా చేశారు. తొలి గ్రూపు 8 వారాల పాటు కృత్రిమ క్లోమాన్ని వాడి తర్వాత రోజువారీ ఇన్సులిన్ ఇంజక్షన్ల వంటి పద్ధతులకు మారింది. రెండో గ్రూప్ ఇందుకు సరిగ్గా వ్యతిరేకంగా తొలుత రోజువారీ ఇన్సులిన్ ఇంజక్షన్ల వంటివి వాడి అనంతరం 8 వారాల పాటు కృత్రిమ క్లోమాన్ని ఉపయోగించింది. రెండు గ్రూపుల్లోనూ కృత్రిమ క్లోమాన్ని వాడినప్పుడు రోగుల్లో సగటు చక్కెర స్థాయిలు 3 ఎంఎంఓఎల్/ఎల్ మేరకు పడిపోయినట్టు గుర్తించారు. అంతేగాక రక్తంలో హిమోగ్లోబిన్ చక్కెరతో కలిసినప్పుడు వృద్ధి చెందే గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్ (హెచ్‌బీఏ1సీ) అణువుల మోతాదు కూడా తగ్గినట్టు తేలింది. ఇన్సులిన్ ఇంజక్షన్లతో నానా రకాల సైడ్ ఎఫెక్టులున్న నేపథ్యంలో కృత్రిమ క్లోమం చాలా మెరుగైన ప్రత్యామ్నాయం కాగలదని కేంబ్రిడ్జి వర్సిటీకి చెందిన డాక్టర్ ఐదీన్ డాలీ అభిప్రాయపడ్డారు. ''ఇన్సులిన్ థెరపీ వల్ల బ్లడ్ షుగర్ స్థాయిలు ప్రమాదకరంగా పడిపోయే రిస్కు తరచూ తలెత్తుతుంది. కనుక వాటిని విస్తృతంగా వాడే పరిస్థితి లేదు. కానీ మా ప్రయోగాల్లో కృత్రిమ క్లోమం వాడిన ఒక్క రోగిలోనూ బ్లడ్ షుగర్ లెవెల్స్ ఉండాల్సినంత కంటే మరీ తక్కువకు పడిపోలేదు. ఇది చాలా గొప్ప విషయం'' అని ఆయన వివరించారు. వాణిజ్యపరంగా రోగులకు దీన్ని మార్కెట్లో అందుబాటులోకి తెచ్చే ముందు మరింత విస్తృతంగా ప్రయోగాలు జరిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మోదీ శంఖారావం

ఎన్నికలకు మరో 400 రోజులే
- టాప్ గేర్లోకి వెళ్లాల్సిన టైమొచ్చింది
- బీజేపీ నేతలకు, శ్రేణులకు పిలుపు
- కార్యకర్తలుగా సరిహద్దు యువత
- గత ప్రభుత్వాల అవినీతి గురించి యువతకు అర్థమయేలా చెప్పండి
- 9 రాష్ట్రాల ఎన్నికల్లో నెగ్గి తీరాలి
- బీజేపీ జాతీయ కార్యవర్గ భేటీలో ప్రధాని దిశానిర్దేశం
- అతి విశ్వాసం వద్దని హెచ్చరిక



న్యూఢిల్లీ: ఏడాదిన్నర ముందే ప్రధాని మోదీ ఎన్నికల శంఖం పూరించారు. ''లోక్‌సభ ఎన్నికలు కేవలం 400 రోజుల దూరంలోనే ఉన్నాయి. ఇక టాప్ గేర్లో దూసుకెళ్లాల్సిన సమయం వచ్చేసింది. చరిత్ర సృష్టిద్దాం పదండి'' అంటూ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశ రాజధానిలో జరుగుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో చివరి రోజైన మంగళవారం కీలకాంశాలపై లోతైన చర్చ జరిగింది. ఈ ఏడాది 9 రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అన్ని రాష్ట్రాల నుంచి హాజరైన 350 మంది బీజేపీ అగ్ర నేతలు, కేంద్ర మంత్రులు, సీఎంలు కూలంకషంగా చర్చించారు. చివరగా మోదీ కీలకోపన్యాసం చేశారు. భావి కార్యాచరణపై నేతలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అతి విశ్వాసానికి ఎక్కడా చోటివ్వొద్దని హెచ్చరించారు. ''బోహ్రాలు, పాస్మాండాలు, సిక్కులు... ఇలా సమాజంలోని ప్రతి వర్గానికీ చేరువ కండి. ఎన్నికల లబ్ధి గురించి ఆలోచించకుండా వారి సంక్షేమం కోసం పాటుపడండి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల వద్దకు తీసుకెళ్లండి. అన్నిచోట్లా, ముఖ్యంగా సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా ప్రత్యేక కార్యక్రమాలు, మోర్చాలు నిర్వహించండి. అక్కడి ప్రజలకు మరింత చేరువ కండి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూడా అక్కడికీ చేరవేయండి. సరిహద్దు గ్రామాల యువతను బీజేపీ కార్యకర్తలుగా తీర్చిదిద్దండి. తద్వారా అక్కడా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయండి. 18–25 ఏళ్ల యువతకు దేశ రాజకీయ చరిత్ర తెలియదు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి, తప్పిదాలు తెలియవు. వీటన్నింటిపైనా వారికి అవగాహన కల్పించండి. అంతటి దుష్పరిపాలనను బీజేపీ ఎలా సుపరిపాలనగా మార్చి చూపించిందో యువతలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి'' అని సూచించారు. ''రానున్నది మన దేశానికి అత్యుత్తమ సమయం. వచ్చే పాతికేళ్ల అమృత కాలాన్ని కర్తవ్య కాలంగా మార్చుకుని కష్టపడితేనే దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలం. ప్రజలకు సేవ చేసేందుకు అన్ని విధాలుగా కష్టపడదాం'' అన్నారు. ''అతి విశ్వాసానికి పోతే ప్రతికూల ఫలితాలు తప్పవు. 1998లో మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్‌సింగ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉన్నా బీజేపీ కేవలం అతి విశ్వాసం వల్లే ఓడింది. కాబట్టి జాగ్రత్తగా ఉందాం'' అంటూ నేతలను హెచ్చరించారు. మోదీ ప్రసంగం స్ఫూర్తిదాయకంగా మాత్రమే గాక సరికొత్త దిశానిర్దేశం చేసేదిగా సాగిందని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. ప్రసంగ విశేషాలను ఆయన మీడియాకు వెల్లడించారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' సాకారానికి కృషి చేయాల్సిందిగా బీజేపీ కార్యకర్తలకు మోదీ పిలుపునిచ్చారు. పార్టీ కంటే దేశానికి ప్రాధాన్యమిస్తూ రాజకీయ నాయకునిగా గాక రాజనీతిజ్ఞుడిగా ఆయన ప్రసంగం సాగింది'' అని ఫడ్నవీస్ చెప్పారు.

ధర్తీ బచావో...

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దామని బీజేపీ శ్రేణులకు మోదీ పిలుపునిచ్చారు. ''బేటీ పఢావో మాదిరిగా ధర్తీ బచావో (భూమిని కాపాడండి) ఉద్యమానికి శ్రీకారం చుడదాం. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించుకుందాం. కాశీ–తమిళ సంగమం తరహాలో భిన్న సంస్కృతులను, ప్రాంతాలను కలిపే వారధిగా పార్టీని తీర్చిదిద్దుకుందాం'' అని సూచించారు.

సినిమాలపై అనవసర వ్యాఖ్యలొద్దు: మోదీ

సినిమాలు తదితర అంశాలపై అనవసర ప్రకటనలకు, వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని బీజేపీ నేతలను, శ్రేణులను మోదీ ఆదేశించారు. ''ఏదో సినిమా గురించి మనవాళ్లలో ఎవరో ఏదో అంటారు. టీవీల్లో, మీడియాలో రోజంతా అదే వస్తుంది. అభివృద్ధి అజెండా తదితర అసలు విషయాలన్నీ పక్కకు పోతాయి. అందుకే అనవసర వ్యాఖ్యలేవీ చేయకండి'' అని కరాఖండిగా చెప్పినట్టు సమాచారం. షారుఖ్‌ఖాన్ నటించిన పఠాన్ సినిమాలో కాషాయాన్ని కించపరిచారంటూ దాని బహిష్కరణకు నరోత్తం మిశ్రా, రామ్ కదమ్ తదితర బీజేపీ నేతలు, మంత్రులు బహిరంగంగా పిలుపునివ్వడం, దానిపై విమర్శలు చెలరేగడం తెలిసిందే.

నడ్డాకు పొడిగింపు

- 2024 జూన్ దాకా ఆయనే బీజేపీ చీఫ్
- లోక్‌సభ ఎన్నికల్లో బంపర్ మెజారిటీ: అమిత్ షా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల పోరు సమీపిస్తుండటంతో అస్త్రశస్త్రాలకు అధికార బీజేపీ పదును పెట్టుకుంటోంది. అందులో భాగంగా జగత్‌ప్రకాశ్ నడ్డా సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్లాలని నిశ్చయించింది. పార్టీ అధ్యక్షునిగా ఆయన పదవీకాలాన్ని 2024 జూన్ దాకా కొనసాగిస్తూ బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మీడియాకు ఈ విషయం వెల్లడించారు. ''రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నేను నడ్డా పేరును ప్రతిపాదించాం. పార్టీ కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది'' అని వివరించారు. పార్టీ అభ్యున్నతికి నడ్డా చిత్తశుద్ధితో పాటుపడ్డారంటూ ప్రశంసించారు. ''నడ్డా నేతృత్వంలో చాలా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాం. 120 ఉప ఎన్నికలు జరిగితే 73 చోట్ల నెగ్గాం. ఇవే కాదు, కరోనా వేళ పేదలకు ఆహారం, నిత్యావసరాలు, ఆస్పత్రుల్లో చికిత్స, మందులు తదితరాలు అందజేశాం. అదే బాటలో సాగుతూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, నడ్డా సారథ్యంలో 2019 కంటే కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తాం. మూడింట రెండొంతులకు పైగా మెజారిటీ సాధించి తీరతాం'' అంటూ షా ధీమా వెలిబుచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు కూడా అప్పటి అధ్యక్షుడు అమిత్ షా పదవీ కాలాన్ని ఇలాగే పొడిగించడం తెలిసిందే. నడ్డా పదవీకాలం పొడిగింపుకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపింది. తనపై నమ్మకముంచినందుకు ప్రధాని మోదీకి, జాతీయ కార్యవర్గ సభ్యులందరికీ నడ్డా కృతజ్ఞతలు తెలిపారు. మోదీ నాయకత్వంలో మూడింట రెండొంతులకు పైగా మెజారిటీ సాధించుకుందామంటూ ట్వీట్ చేశారు. కరోనా కారణంగా బీజేపీ సంస్థాగత ఎన్నికలు సకాలంలో జరగలేదు. కనీసం 55 శాతం రాష్ట్రాల్లో అవి జరిగిన తర్వాతే మూడేళ్ల పదవీ కాలానికి పూర్తిస్థాయి బాధ్యతలతో అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందని అమిత్ షా గుర్తు చేశారు. ఈ ప్రక్రియ బహుశా వచ్చే లోక్‌సభ ఎన్నికల అనంతరం మొదలయ్యే అవకాశముంది. బీజేపీ నియామవళి ప్రకారం పార్టీ అధ్యక్షునిగా ఎవరైనా వరుసగా రెండుసార్లకు మించి కొనసాగడానికి వీల్లేదు.

మోదీని ప్రస్తుతిస్తూ తీర్మానం

ప్రధానిగా మోదీ సారథ్యంలో భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందంటూ బీజేపీ జాతీయ కార్యవర్గం ప్రశంసించింది. ఈ మేరకు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. ప్రజల అవసరాలన్నింటినీ తీరుస్తూ సంతృప్త స్థాయి పాలనతో దూసుకెళ్తున్నామన్నారు. ''అయోధ్యలో రామమందిరం ఎప్పుడు నిర్మిస్తారో చెప్పండంటూ విపక్షాలు బీజేపీని ఎద్దేవా చేసేవి. మోదీ సారథ్యంలో నిర్మాణం మొదలు పెట్టడమే గాక ఇప్పుడు మందిర ప్రారంభ తేదీనే ప్రకటించేశాం. ఇందుకు మోదీకి కార్యవర్గ భేటీ కృతజ్ఞతలు తెలిపింది'' అన్నారు. ఎనిమిదిన్నరేళ్ల పాలనలో బీజేపీ సాధించిన విజయాలను వివరించారు.

మృదుభాషికి పెను సవాలు

62 ఏళ్ల జేపీ నడ్డా స్వరాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్ అయినా తండ్రి పట్నా వర్సిటీలో ప్రొఫెసర్ కావడంతో ఆయన పుట్టిందీ పెరిగిందీ బిహార్లోనే. మృదుభాషి అయిన నడ్డా లో ప్రొఫైల్లో ఉంటూ మోదీ, అమిత్ షా నీడన పని చేసుకోవడానికి ఇష్టపడతారు. ఆరెస్సెస్ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1991లో బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడయ్యారు. ఆ సమయంలో అమిత్ షా కూడా బీజేవైఎం నేతగా ఉండేవారు! 1993లో హిమాచల్‌లో విపక్ష నేతగా ఎన్నికయ్యారు. 1998లో రాష్ట్ర మంత్రి అయ్యారు. 2010లో నితిన్ గడ్కరీ అధ్యక్షునిగా ఉండగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందారు. చివరికి 2020 జనవరి 20న బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఆరెస్సెస్‌తో పాటు మోదీతోనూ సత్సంబంధాలుండటం ఆయనకు కలిసొచ్చింది. 2023లో కర్నాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌తో పాటు కీలకమైన పశ్చిమబెంగాల్, తెలంగాణల్లో పార్టీని గెలుపు బాటన నడపడం నడ్డా ముందున్న పెద్ద సవాలు!

క్లుప్తంగా...

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బుద్గాంలోని కోర్టు భవన సముదాయం సమీపంలో మంగళవారం ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. గతవారం మగమ్ ఏరియాలో కార్డన్ సెర్చ్‌లో వీరిద్దరూ తప్పించుకున్నారని పోలీసులు చెప్పారు. వారి నుంచి ఏకే రైఫిల్, పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు.

దావూద్‌కు మళ్లీ పెళ్లి

ముంబై: అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు రెండో పెళ్లి చేసుకున్నాడట! ఒక కేసు విచారణ సందర్భంగా ఎన్‌ఐఏ అధికారులకు అతని మేనల్లుడు అలీ షా పార్కర్ ఈ మేరకు వెల్లడించారు. ''దావూద్‌కు నలుగురు సోదరులు, నలుగురు అక్కాచెల్లెళ్లు. మొదటి భార్య పేరు మెజబిన్. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లయింది. కుటుంబసభ్యులతో కలిసి దావూద్ కరాచీలో ఉంటున్నాడు. ఇటీవలే డిఫెన్స్ ఏరియాలోని రహీం ఫాకీకి మారాడు. మొదటి భార్యను ఆరు నెలల క్రితం దుబాయ్‌లో కలిశాం. ఆమె నా భార్యకు తరచూ వాట్సాప్ కాల్స్ చేస్తుంది. ఆమెకు విడాకులిచ్చానని అబద్ధం చెప్పి ఓ పాకిస్తానీ పఠాన్ మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు'' అని చెప్పాడు.

'ఢిల్లీ' నిందితునికి బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో అంజలి(20)అనే యువతిని కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్లు లాక్కెళ్లిన కేసు నిందితుల్లో ఒకరైన అశుతోష్ భరద్వాజ్‌కు మంగళవారం కోర్టు బెయిలిచ్చింది. ఈ కేసులో ఆరుగురు నిందితులపై తాజాగా హత్యాభియోగం మోపినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. నేరం రుజువైతే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు, జరిమానా విధించే అవకాశముంది.

కారును ఢీకొట్టి.. వృద్ధుడిని ఈడ్చుకెళ్లి..!

శివాజీనగర: నిలిపి ఉన్న కారును స్కూటర్‌తో ఢీకొట్టిన ఓ వ్యక్తి, ఆపేందుకు యత్నించిన వృద్ధ డ్రైవర్‌ను కిలోమీటర్ దూరం ఈడ్చుకెళ్లాడు. బెంగళూరులోని మగడి రోడ్డులో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే సాహిల్(22) స్కూటర్‌పై రాంగ్‌రూట్లో వెళ్తూ మాగడి రోడ్డు టోల్ గేట్ వద్ద నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొన్నాడు. బొలెరో వాహనదారు ముత్తప్ప, ఆ యువకుడ్ని ప్రశ్నించగా పరారయ్యేందుకు యత్నించాడు. ముత్తప్ప స్కూటర్‌ను పట్టుకోగా అలాగే కిలోమీటర్ దూరం ఈడ్చుకెళ్లాడు. ఆటో డ్రైవర్లు, ఇతరులు వేరే వాహనంలో వెంటాడి స్కూటరిస్టును అడ్డుకుని చితకబాదారు. నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు.

అంతర్జాతీయ ఉగ్రవాదిగా మక్కీ

- ప్రకటించిన ఐరాస భద్రతా మండలి
- ఫలించిన భారత దౌత్యం



ఐక్యరాజ్య సమితి: పాకిస్తాన్ కేంద్రంగా భారత్‌పైకి ఉగ్రమూకలను ఉసిగొల్పుతున్న లష్కరే తోయిబా ఉగ్రసంస్థకు మరో ఎదురుదెబ్బ తగిలింది. దాని డెప్యూటీ చీఫ్ అబ్దుల్ రెహ్మాన్ మక్కీ(68)ని గ్లోబల్ టెర్రరిస్టుగా ప్రకటించాలంటూ భారత్, అమెరికా చేసిన ప్రతిపాదనకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి పచ్చజెండా ఊపింది. ఆయనను బ్లాక్‌లిస్ట్‌లో చేరుస్తున్నట్లు మండలి సోమవారం ప్రకటించింది. దీంతో పాక్‌తో అంటకాగుతున్న మరో ఉగ్రమూక కీలక నేతను అంతర్జాతీయంగా ఆర్థిక కార్యకలాపాలు జరపకుండా నిరోధించడంలో ఐరాసలో భారత్ నెరిపిన దౌత్యం ఫలించింది. గ్లోబల్ టెర్రరిస్టుగా ముద్రపడిన వ్యక్తుల ఆస్తుల స్వాధీనం, బ్యాంకింగ్, ఆర్థిక, ఆయుధాల కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుంది. ప్రస్తుతం లష్కరే తోయిబా రాజకీయ వ్యవహారాల విభాగం చీఫ్‌గా ఉన్న మక్కీ.. ఆ ఉగ్రసంస్థ చీఫ్ హాఫీజ్ ముహమ్మద్ సయీద్‌కు అత్యంత సమీప బంధువు. మక్కీ గతంలో లష్కరే తోయిబాలో వివిధ విభాగాల్లో పనిచేశాడు. ఆ సంస్థకు అంతర్జాతీయంగా నిధులు సమకూర్చే పనిలో బిజీగా ఉండేవాడు. ఉగ్రవాదం కోసం నిధుల సేకరణ, యువతను ఉగ్రవాదంవైపునకు ఆకర్షించడం, భారత్‌పై దాడి, ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌లో హింస, ఉగ్రదాడులకు తెగబడటం వంటివి పాల్పడినందుకు గ్లోబల్ టెర్రరిస్టుగా ప్రకటించినట్లు ఐరాస పేర్కొంది. ఇన్నాళ్లూ ఇతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడానికి ఒప్పుకోని చైనా చివర్లో అందుకు సమ్మతించడం గమనార్హం. ఐరాస చర్యను భారత్ స్వాగతించింది. ఇంకా పొంచి ఉన్న ఉగ్రముప్పును ఎదుర్కోవడంలో, పరిస్థితి సద్దుమణిగేలా చేయడంలో ఇలాంటి చర్యలు అక్కరకొస్తాయని వ్యాఖ్యానించింది. ఉగ్రవాదంపై పోరును భారత్ ఇకమీదటా కొనసాగిస్తుందని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చీ స్పష్టంచేశారు. జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటింపజేయడంలో 2019లో భారత్ సఫలీకృతమైంది.

గొంతు కోసినా ఆరెస్సెస్ ఆఫీసులో అడుగు పెట్టను: రాహుల్

వరుణ్ భావజాలాన్ని అంగీకరించలేను

హోషియార్‌పూర్: ''బీజేపీ, ఆరెస్సెస్ దేశంలో అన్ని వ్యవస్థలనూ చెరబట్టాయి. వాటిని పూర్తిగా నియంత్రిస్తున్నాయి'' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు. ఇప్పుడు న్యాయ వ్యవస్థను, కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా తీవ్ర ఒత్తిడికి లోను చేస్తున్నాయని ఆరోపించారు. పంజాబ్‌లో జోడో యాత్రలో ఉన్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. తన గొంతు కోసినా సరే, జీవితంలో ఎన్నడూ ఆరెస్సెస్ కార్యాలయంలోకి అడుగు కూడా పెట్టబోనన్నారు. రాహుల్ సోదరుడు, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరతారన్న వార్తల నేపథ్యంలో, ఆయన్ను అక్కున చేర్చుకుంటారా అని ప్రశ్నించగా, ''వరుణ్‌ను కలుస్తా. కౌగిలించుకుంటా. కానీ ఆయన భావజాలాన్ని ఆమోదించలేను'' అని బదులిచ్చారు.

రాహుల్‌కేసి దూసుకొచ్చిన యువకుడు

జోడో యాత్రలో ఓ యువకుడు రాహుల్‌ను కౌగిలించుకునేందుకు ఆయనకేసి వేగంగా దూసుకొచ్చాడు. కాంగ్రెస్ నేతలు అతన్ని అడ్డుకున్నారు. ఇది అత్యుత్సాహమే తప్ప భద్రతా వైఫల్యమేమీ కాదని రాహుల్ అన్నారు.



బ్రిటిష్ బాబులకు భారతీయ విందు

అరటాకుల్లో భోంచేస్తున్న వీరంతా బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కార్యాలయ సిబ్బంది. సంక్రాంతి సందర్భంగా తన అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌లో వారికిలా భారతీయ సంప్రదాయ పద్ధతిలో విందు ఇచ్చారాయన.

మద్యానికి బానిసైన కిమ్

ఆరోగ్యంపై బెంగతో ఏడుస్తున్న ఉత్తర కొరియా అధినేత!

సియోల్: రోజంతా మద్యం తాగడం వంటి అనారోగ్యకర ఆహార అలవాట్ల కారణంగా ఉత్తరకొరియా అధినేత కిమ్ జొంగ్ ఉన్ ఆరోగ్యం దెబ్బతిన్నదని వార్తలు వస్తున్నాయి. ఇటీవలే 39వ బర్త్‌డే జరుపుకున్న కిమ్‌కు.. వయస్సు మీదపడుతుందనే బెంగ ఎక్కువైనట్లుగా ఉందని దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో ఉంటున్న ఉత్తర కొరియా విద్యావేత్త డాక్టర్ చొయ్ జిన్‌వూక్ అంటున్నారు. ఒంటరితనంతో బాధపడుతున్న కిమ్ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అతిగా తాగి ఏడుస్తూ కాలం గడుపుతున్నారని చెబుతున్నారు. అనారోగ్య వివరాలు ఎక్కడ బయటకు పొక్కుతాయో అనే భయంతో కిమ్ పర్యటనల సమయంలో సొంత టాయిలెట్‌ను కూడా తీసుకెళ్తున్నారని చెబుతున్నారు. తాగుడు తగ్గించి, రోజూ సమయం వ్యాయామం చేయాలని భార్య, వైద్యులు సలహాలిచ్చినా పట్టించుకోవడం లేదని మిర్రర్ పత్రిక కథనం పేర్కొంది.

చైనాలో జనాభా తగ్గింది!

1961 తర్వాత ఇదే తొలిసారి

బీజింగ్: జన చైనాలో జనాభా కాస్త తగ్గింది. అక్కడ జనాభా సంఖ్య తగ్గుముఖం పట్టడం 1961 ఏడాది తర్వాత ఇదే తొలిసారి! 2021 ఏడాది జనాభా లెక్కలతో పోలిస్తే 2022ఏడాదిలో జనాభా 8,50,000 తగ్గిందని నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ తాజాగా వెల్లడించింది. 2022 ఏడాదిలో చైనా జనాభా 141.18 కోట్లు అని నేషనల్ బ్యూరో లెక్క తేల్చింది. జననాల వృద్ధిరేటు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే అంచనావేసిన దానికంటే ముందుగానే చైనాను దాటేసి భారత్ ప్రపంచంలోనే అత్యంత అధిక జనాభాగల దేశంగా అవతరించనుంది. చైనా ఆర్థిక వృద్ధి రేటు దాదాపు 3 శాతంగా నమోదైన ఈ తరుణంలో జనసంఖ్య సైతం వెనకడుగు వేస్తోంది. గత ఐదు దశాబ్దాల్లో చైనాలో ఇంతటి అత్యల్ప వృద్ధిరేటు నమోదవడం ఇది రెండోసారి. ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక, జనాభా విభాగం 2022 అంచనాల ప్రకారం ఈ ఏడాదిలోనే చైనాను భారత్ జనసంఖ్యలో అధిగమించనుంది. 2050కల్లా భారత్ 166.8 కోట్ల మందితో కిటకిటలాడనుంది. 131.7 కోట్లతో చైనా రెండోస్థానానికి పడిపోనుంది.



- 2022లో చైనాలో 95.6 లక్షల మంది జన్మించారు. 2021లో 1.062 కోట్ల మంది జన్మించారు. 2021లో 7.52 శాతమున్న జననాల రేటు 2022లో 6.77 శాతానికి పడిపోయింది.
- చైనాలో 72.20 కోట్ల మంది పురుషులు, 68.96 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. మున్న 16– 59 ఏళ్ల వయసు వారు 87.56 కోట్ల మంది ఉన్నారు.
- దేశ జనాభాలో సీనియర్ సిటిజన్లు 62 శాతం.
- 60 ఏళ్లు పైబడిన వృద్ధుల జనాభా 28 కోట్లు దాటింది. జనాభాలో వీరు 19.8 శాతం.
- ఒకప్పుడు వ్యవసాయ ఆధారిత దేశమైన చైనా ఇప్పుడు ప్రపంచ ఉత్పత్తుల కేంద్రంగా ఎదిగింది. దీంతో పరిశ్రమల్లో పనిచేసేందుకు జనం పట్టణాల బాటపట్టారు. దీంతో పట్టణాల్లో నివసిస్తున్న వారి సంఖ్య 92.07 కోట్లకు ఎగబాకింది.

మెరుపులనే దారి మళ్లించారు!

- పిడుగుల రక్షణ వ్యవస్థలో మేలిమలుపు!
- భారీ నిర్మాణాలకు ఇక పూర్తిస్థాయి రక్షణ



పారిస్: మెరుపంటేనే వేగానికి పెట్టింది పేరు. వేగానికి అత్యుత్తమ ఉపమానం కూడా. మెరుపు వేగం గంటకు ఏకంగా 4.3 లక్షల కిలోమీటర్ల దాకా ఉంటుంది. మెరుపుల ఫలితంగా విను వీధిలో మన కంటికి కనిపించే కాంతులైతే నిజంగా కాంతి వేగంతోనే (సెకను 3 లక్షల కిలోమీటర్లు) దూసుకెళ్తాయి. అలాంటి మెరుపులను దారి మళ్లించగలిగితే? ఫ్రెంచి పరిశోధకులు తాజాగా అలాంటి ఘనతే సాధించారు!! అతి శక్తిమంతమైన లేజర్ కిరణాల ద్వారా వాటి దారిని విజయవంతంగా మార్చగలిగారు. పిడుగుపాటు బారినుంచి రక్షించే వ్యవస్థల్లో ఇది విప్లవాత్మక మార్పులు తేగలదని భావిస్తున్నారు. మెరుపును అనుసరిస్తూ వచ్చి పడే పిడుగుల వల్ల భవనాలు, సమాచార వ్యవస్థ, విద్యుత్ ఉపకరణాలు, సరఫరా లైన్లు దెబ్బ తిని ఏటా వందలాది కోట్ల డాలర్ల మేరకు నష్టం వాటిల్లడమే గాక వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండటం తెలిసిందే. ఈ టెక్నాలజీని మరింతగా అభివృద్ధి చేయగలిగితే దీని సాయంతో విమానాశ్రయాలు, భారీ విద్యుత్కేంద్రాలు, ఉపగ్రహాల లాంచింగ్ ప్యాడ్ల వంటి భారీ నిర్మాణాలకు పిడుగుపాట్ల నుంచి పూర్తిస్థాయి రక్షణ కల్పించవచ్చని చెబుతున్నారు. ఫ్రాన్స్‌లోని ఎకోల్ పాలిటెక్నిక్స్ లేబొరేటరీ ఆఫ్ అప్లైడ్ ఆప్టిక్స్‌కు చెందిన పరిశోధకులు అత్యంత శక్తిమంతమైన లేజర్ పరికరాల సాయంతో ఈ ప్రయోగానికి పూనుకున్నారు. ఇందుకోసం ఏకంగా మూడు టన్నుల బరువు, కారు పరిమాణమున్న లేజర్ పరికరాన్ని ఈశాన్య స్విట్జర్లాండ్‌లోని శాంటిస్ పర్వత శిఖరంపై 2,500 మీటర్ల ఎత్తున ఏర్పాటు చేశారు. దానిద్వారా సెకనుకు ఏకంగా 1,000కి పైగా అతి శక్తిమంతమైన కిరణాలను ఆకాశంలో మెరుపులకేసి పంపించారు. తొలి ప్రయత్నంలోనే వాటి దారిని 160 అడుగుల దాకా మళ్లించగలిగారు. రెండు హైస్పీడ్ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ద్వారా దీన్ని గుర్తించారు. ''అతి శక్తిమంతమైన లేజర్ కిరణాలను ఆకాశంలోకి పంపినప్పుడు శక్తిమంతమైన కాంతితో కూడిన ఫిలమెంట్లు ఏర్పడతాయి. అవి గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్ అణువులను అయానీకరిస్తాయి. ఈ చర్య ఫలితంగా స్వేచ్ఛగా కదలాగే ఎలక్ట్రాన్లు విడుదలవుతాయి. ప్లాస్మాగా పిలిచే ఈ అయానీకరణ చెందిన గాలి ఎలక్ట్రాన్ల వాహకంగా పని చేస్తుంది'' అంటూ ఈ టెక్నాలజీ పని చేసే తీరును డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ జీన్ పియరీ వూల్ఫ్ వివరించారు. నిజానికి ఈ కాన్సెప్టును తొలుత 1970ల్లోనే ప్రతిపాదించినా ఇప్పటిదాకా ల్యాబుల్లోనే ప్రయోగించి చూశారు. బయటి వాతావరణంలో ప్రయోగం జరపడం ఇదే తొలిసారి. ఈ పరిశోధన ఫలితాలు జర్నల్ నేచర్ ఫోటానిక్స్‌లో పబ్లిషయ్యాయి. వీటి సాయంతో పిడుగుపాటు నుంచి కాపాడే వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు తేగల హై పవర్ లేజర్ టెక్నాలజీని అభివృద్ధి చేసే పనిలో సైంటిస్టులు బిజీగా ఉన్నారు!

సాక్షి హైదరాబాద్

బుధవారం । 18 । జనవరి । 2023

నేడు అదనంగా మెట్రో సర్వీసులు

ఉప్పల్ స్టేడియంలో నేటి క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో అదనంగా మెట్రో సర్వీసులు నడపనున్నారు. ఈ మేరకు ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ ఎల్ ఎండీ కేవీబీ రెడ్డితో కలిసి హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అదనపు మెట్రో రైలు సేవల అవసరాలను మంగళవారం రాత్రి సమీక్షించారు. నాగోల్-రాయదుర్గం (కారిడార్ 3)లో ఉ. 11 నుంచి సా. 4 గంటల వరకు 7 నిమిషాలకు బదులుగా 5 నిమిషాల ఫ్రీక్వెన్సీతో నడుపుతారు. సా. 4 నుంచి రాత్రి 10 గంటల వరకు 4 నిమిషాల ఫ్రీక్వెన్సీతో రైళ్లు నడుస్తాయి. నాగోల్ వద్ద రెండు రైళ్లు అదనంగా సిద్ధంగా ఉంటాయి. రాత్రి 9 గంటల తర్వాత రద్దీ ఉంటే అదనపు రైళ్లు నడుపుతారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్టేడియం స్టేషన్‌లో 10 కౌంటర్లు అందుబాటులో ఉంచుతారు.

బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్న 15 మంది అరెస్టు

ఉప్పల్: భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య నేడు జరగనున్న క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి టికెట్లను స్టేడియం వద్ద బ్లాక్‌లో విక్రయిస్తున్న 15 మందిని మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు 54 టికెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఉప్పల్ పోలీసులు తెలిపారు.



భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ



పిచ్‌ను పరిశీలిస్తున్న రోహిత్, అజహర్

న్యూస్‌రీల్

పాతబస్తీ కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

- ముకరం జా అంతిమ సంస్కారాల నేపథ్యంలో

సాక్షి, సిటీబ్యూరో: టర్కీలోని ఇస్తాంబుల్‌లో కన్నుమూసిన ఎనిమిదో నిజాం ముకరం జా అంతిమ సంస్కారాలు బుధవారం మక్కా మసీదు ప్రాంగణంలో జరగనున్నాయి. వీటి నేపథ్యంలో పాతబస్తీలోని అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు విధిస్తూ అదనపు సీపీ జి.సుధీర్ బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 నుంచి అంతిమ సంస్కారాల తంతు పూర్తయ్యే వరకు ఓల్గా జంక్షన్, ముర్గీ చౌక్, చెలాపుర మహిళ ఠాణా, మిట్టీకా షేర్, మూసాబౌలి జంక్షన్, హిమ్మత్‌పుర జంక్షన్ కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. వాహనచోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

మరోపక్క బుధవారం ఉప్పల్‌లో జరిగే భారత్–న్యూజిల్యాండ్ జట్ల మధ్య వన్డే మ్యాచ్ జరుగనుంది. నగరంలోని వివిధ హోటళ్లలో బస చేసిన క్రికెటర్లు రోడ్డు మార్గంలో ఉప్పల్ వెళ్తున్నారు. వీరి రాకపోకల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల మధ్య సోమాజిగూడ, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట, రసూల్‌పురా, సీటీఓ, ఎస్బీఐ జంక్షన్, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ జంక్షన్, ఆలుగడ్డ బావి, మెట్టుగూడ జంక్షన్, తార్నాక, హబ్సిగూడ, ఎన్జీఆర్ఐ, ఉప్పల్ మార్గంలో కొన్ని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

ప్రయాణికులతో మెట్రో రైళ్లు కిటకిట

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లిన నగరవాసులు తిరుగు పయనమయ్యారు. మంగళవారం నగరంలోని పలు మెట్రో స్టేషన్లు కిటకిటలాడాయి. మూడు మార్గాల్లో ప్రయాణికుల సంఖ్య సుమారు 4.5 లక్షల మార్కును చేరినట్లు మెట్రో వర్గాలు తెలిపాయి. టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు కిక్కిరిశాయి. రద్దీకి అనుగుణంగా ప్రతి మూడు నిమిషాలకో రైలును నడిపామన్నాయి. ఎగ్జిబిషన్ నేపథ్యంలో ఎల్బీనగర్–మియాపూర్ మార్గంలో రాత్రి 12 గంటలకు మెట్రో సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం విదితమే.

అంధత్వ రహిత తెలంగాణే కేసీఆర్ లక్ష్యం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సనత్‌నగర్: అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు–2 సేవలపై మంగళవారం వెస్ట్‌మారేడుపల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాటు కొనసాగే కంటి వెలుగు కార్యక్రమం కోసం నగరంలో 115 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.250 కోట్ల ఖర్చుతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ బస్తీలు, కాలనీల్లో నివసించే ప్రజలు కంటి వెలుగు శిబిరాలకు వెళ్లి పరీక్షలు చేయించుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బిగ్ ఫైట్

భారత్‌- న్యూజిలాండ్ మధ్య నేడు వన్డే మ్యాచ్

ఇప్పటి వరకూ ఓటమి లేని జ్ఞాపకాలు

భాగ్యనగరంలో న్యూజిలాండ్‌పై భారత్‌దే పైచేయి

అనగనగా భారత్, కివీస్...క్రికెట్‌లో ఈ రెండు జట్లు తలపడితే ఆ మజానే వేరు. అదీ భాగ్యనగరంలో అయితే మరింత కిక్కే కిక్కు....వీటి మధ్య ఐదు టెస్టులు , రెండు వన్డేలు జరిగాయి. అన్నింటా భారత్‌దే పైచేయిగా నిలిచింది. ఈ రెండు జట్ల నడుమ జరిగిన పోటీల్లో ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో చిరస్మరణీయమైన గుర్తులకు హైదరాబాద్ వేదిక అయింది. పాలిఉమ్రిగర్ నుంచి మొదలుకుంటే విజయ్ మంజ్రేకర్, ఎరాపల్లి ప్రసన్న, బిషన్ సింగ్ బేడీ, ఆబిద్ అలీ, అజహరుద్దీన్, కపిల్ దేవ్, శ్రీకాంత్, అర్షద్ అయూబ్ , నరేంద్ర హిర్వాణీ, సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, అనిల్ కుంబ్లే, వీవీఎస్ లక్ష్మణ్, ధోనీ,కోహ్లి , పుజారా, అశ్విన్... రిచర్డ్ హ్యాడ్లీ, మార్క్ గ్రేట్ బ్యాచ్, జాన్‌రైట్, బ్రెండన్ మెకల్లమ్, మార్టిన్ గప్టిల్, కేన్ విలియమ్‌సన్...ఇలా ఎందరో టాప్‌మోస్ట్ ఆటగాళ్లు తమ ఆటతో హైదరాబాద్ ప్రేక్షకులను హుషారెత్తించారు. ఇక నేడు జరగబోయే మ్యాచ్ సైతం భాగ్యనగర ప్రేక్షకులను అలరించనుంది.

స్టార్ ప్లేయర్లతో ఇండియా, కివీస్ జట్లు బరిలో దిగనున్నాయి. హైదరాబాదీస్..... లెట్స్ ఎంజాయ్



స్టేడియంలో భారత ఆటగాళ్లు



కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్



న్యూజిలాండ్ ఆటగాళ్ల ప్రాక్టీస్

సాక్షి క్రీడా విభాగం: న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు భాగ్యనగరంతో ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. హైదరాబాద్ గడ్డపై భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య 1955లో తొలిపోరు జరిగింది. చివరిసారి ఈ రెండు జట్లు 2012లో ఇక్కడ తలపడ్డాయి. 1955 నుంచి 2012 మధ్య కాలంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య హైదరాబాద్‌లో (ఎల్బీ స్టేడియం, ఉప్పల్ స్టేడియం) ఐదు టెస్టులు, రెండు వన్డేలు జరిగాయి. ఐదు టెస్టుల్లో భారత్ రెండు టెస్టుల్లో గెలిచి, మిగతా మూడు టెస్టులను 'డ్రా'గా ముగించింది. ఇక రెండు వన్డేల్లో భారత్‌నే విజయం వరించింది. తద్వారా హైదరాబాద్ గడ్డపై న్యూజిలాండ్ చేతిలో భారత్ ఇప్పటి వరకు ఓటమి రుచి చూడలేదు. మరోవైపు న్యూజిలాండ్ జట్టు భాగ్యనగరంలో ఇంకా గెలుపు బోణీ కొట్టలేదు. 2012 తర్వాత మళ్లీ హైదరాబాద్‌లో అంతర్జాతీయ మ్యాచ్ కోసం అడుగుపెట్టిన న్యూజిలాండ్ నేడు ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో భారత్‌తో తొలి వన్డే ఆడనుంది. గతంలో ఎల్బీ స్టేడియంలో రెండు వన్డేలు ఆడిన న్యూజిలాండ్ ఉప్పల్ స్టేడియంలో తొలిసారి వన్డే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్, ఆల్‌రౌండర్ టిమ్ సౌతీ లేకుండానే భారత్‌తో వన్డే సిరీస్‌లో పోటీ పడుతున్న న్యూజిలాండ్ తాత్కాలిక కెప్టెన్ టామ్ లాథమ్ సారథ్యంలో ఈసారైనా తమ రికార్డును మెరుగుపర్చుకుంటుందా లేక భారత్‌కు దాసోహమంటుందా అనే విషయం నేడు తేలిపోతుంది.

ఇప్పటి వరకు హైదరాబాద్‌లో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు ఇలా..

ఎప్పుడు: 1955, నవంబర్ 19– 24
ఎక్కడ: ఎల్బీ స్టేడియం
ఫార్మాట్: టెస్టు
తుది ఫలితం: 'డ్రా'
సంక్షిప్త స్కోర్లు: భారత్ తొలి ఇన్నింగ్స్: 498/4 డిక్లేర్డ్ (పాలీ ఉమ్రిగర్ 223, విజయ్ మంజ్రేకర్ 118, కృపాల్ సింగ్ 100 నాటౌట్); న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 326 ఆలౌట్ (జాన్ గయ్ 102, సుభాష్ గుప్తే 7/128); న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్): 212/2 (బెట్ సట్‌క్లిఫ్ 137 నాటౌట్).

ఎప్పుడు: 1969, అక్టోబర్ 15–20
ఎక్కడ: ఎల్బీ స్టేడియం
ఫార్మాట్: టెస్టు
తుది ఫలితం: 'డ్రా'
సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 181 ఆలౌట్ (బ్రూస్ ముర్రే 81, ఎరాపల్లి ప్రసన్న 5/51), భారత్ తొలి ఇన్నింగ్స్: 89 ఆలౌట్ (వెంకట్రాఘవన్ 25 నాటౌట్, బిషన్ సింగ్ బేడీ 20, డేల్ హ్యాడ్లీ 4/30, బాబ్ కునిస్ 3/12), న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 175/8 డిక్లేర్డ్ (డౌలింగ్ 60, సయ్యద్ ఆబిద్ అలీ 3/47, ప్రసన్న 3/58), భారత్ రెండో ఇన్నింగ్స్: 76/7 (భారత విజయ లక్ష్యం 268).

ఎప్పుడు: 1988, డిసెంబర్ 2–6
ఎక్కడ: ఎల్బీ స్టేడియం
ఫార్మాట్: టెస్టు
తుది ఫలితం: భారత్ 10 వికెట్లతో విజయం
సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 254 ఆలౌట్ (మార్క్‌గ్రేట్‌బ్యాచ్ 90 నాటౌట్, ఇయాన్ స్మిత్ 79, అర్షద్ అయూబ్ 4/55, సంజీవ్ శర్మ 3/37), భారత్ తొలి ఇన్నింగ్స్: 358 ఆలౌట్ (కృష్ణమాచారి శ్రీకాంత్ 69, అజహరుద్దీన్ 81, కపిల్ దేవ్ 40, మార్టిన్ స్నెడెన్ 4/69), న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 124 ఆలౌట్ (జాన్ రైట్ 62, రిచర్డ్ హ్యాడ్లీ 31, కపిల్ దేవ్ 3/21, అర్షద్ అయూబ్ 3/36, నరేంద్ర హిర్వాణీ 3/43), భారత్ రెండో ఇన్నింగ్స్: 22/0 (భారత విజయ లక్ష్యం 21).

ఎప్పుడు: 2010, నవంబర్ 12–16
ఎక్కడ: ఉప్పల్ స్టేడియం
ఫార్మాట్: టెస్టు
తుది ఫలితం: 'డ్రా'
సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 350 ఆలౌట్ (టిమ్ మెకింటోష్ 102, మార్టిన్ గప్టిల్ 85, జెస్సీ రైడర్ 70, జహీర్ ఖాన్ 4/69, హర్భజన్ సింగ్ 4/76), భారత్ తొలి ఇన్నింగ్స్: 472 ఆలౌట్ (వీరేంద్ర సెహ్వాగ్ 96, గౌతమ్ గంభీర్ 54, వీవీఎస్ లక్ష్మణ్ 74, హర్భజన్ సింగ్ 111 నాటౌట్, డానియల్ వెటోరి 5/135), న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 448/8 డిక్లేర్డ్ (బ్రెండన్ మెకల్లమ్ 225, కేన్ విలియమ్సన్ 69, శ్రీశాంత్ 3/121, సురేశ్ రైనా 2/38), భారత్ రెండో ఇన్నింగ్స్: 68/0 (భారత విజయ లక్ష్యం 327).

ఎప్పుడు: 2012, ఆగస్టు 23–26
ఎక్కడ: ఉప్పల్ స్టేడియం
ఫార్మాట్: టెస్టు
తుది ఫలితం: భారత్ ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో విజయం

సంక్షిప్త స్కోర్లు: భారత్ తొలి ఇన్నింగ్స్: 438 ఆలౌట్ (చతేశ్వర్ పుజారా 159, విరాట్ కోహ్లి 58, ఎమ్మెస్ ధోని 73, జీతన్ పటేల్ 4/100), న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 159 ఆలౌట్ (జేమ్స్ ఫ్రాంక్లిన్ 43 నాటౌట్, రవిచంద్రన్ అశ్విన్ 6/31, ప్రజ్ఞాన్ ఓజా 3/44), న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్): 164 ఆలౌట్ (కేన్ విలియమ్సన్ 52, రవిచంద్రన్ అశ్విన్ 6/54, ప్రజ్ఞాన్ ఓజా 3/48).

మరుపురాని వన్డే మ్యాచ్

ఎప్పుడు: 1999, నవంబర్ 8
ఎక్కడ: ఎల్బీ స్టేడియం
ఫార్మాట్: వన్డే
తుది ఫలితం: భారత్ 174 పరుగులతో విజయం
సంక్షిప్త స్కోర్లు: భారత్: 376/2 (50 ఓవర్లలో) (సచిన్ టెండూల్కర్ 186 నాటౌట్, రాహుల్ ద్రవిడ్ 153), న్యూజిలాండ్: 202 ఆలౌట్ (33.1 ఓవర్లలో) (స్కాట్ స్టయిరిస్ 43, వెంకటేశ్ ప్రసాద్ 2/38, అనిల్ కుంబ్లే 2/39).

ఉప్పల్‌లో భారత్ ఇలా..

- 2005 నుంచి 2022 వరకు ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు వివిధ జట్లతో అన్ని ఫార్మాట్‌లలో కలిపి 13 మ్యాచ్‌లు (6 వన్డేలు, 5 టెస్టులు, 3 టి20) ఆడింది. 9 మ్యాచ్‌ల్లో (4 టెస్టులు, 3 వన్డేలు, 2 టి20) గెలుపొందింది, 3 మ్యాచ్‌ల్లో (వన్డేలు) ఓడిపోయింది. మరో మ్యాచ్ 'డ్రా' (టెస్టు) అయింది.

సచిన్, సెహ్వాగ్‌ల వీర విహారం

ఎప్పుడు: 2003, నవంబర్ 15
ఎక్కడ: ఎల్బీ స్టేడియం
ఫార్మాట్: వన్డే
తుది ఫలితం: భారత్ 145 పరుగులతో విజయం
సంక్షిప్త స్కోర్లు: భారత్: 353/5 (50 ఓవర్లలో) (వీరేంద్ర సెహ్వాగ్ 130, సచిన్ టెండూల్కర్ 102, రాహుల్ ద్రవిడ్ 50 నాటౌట్), న్యూజిలాండ్: 208 ఆలౌట్ (47 ఓవర్లలో) (స్కాట్ స్టయిరిస్ 54, జహీర్ ఖాన్ 3/30, అజిత్ అగార్కర్ 2/28, అనిల్ కుంబ్లే 2/36, మురళీ కార్తీక్ 2/38).

నిఘా నీడలో..

- 2,500 మందికిపైగా పోలీసులతో భారీ బందోబస్తు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు రాచకొండ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. మంగళవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మల్కాజిగిరి డీసీపీ రక్షితా కె.మూర్తి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ గుప్తా, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

- 2,500 మంది పోలీసులు, 250 మందితో సెక్యూరిటీ వింగ్ , 403 మంది ట్రాఫిక్ సిబ్బంది, 1091 మంది లా అండ్ ఆర్డర్, నాలుగు ప్లాటూన్ల టీఎస్ఎస్పీ బృందాలు, ఆరు ప్లటూన్ల ఆర్మ్‌డ్ సిబ్బంది, రెండు ఆక్టోపస్ టీంలు, మౌంటెడ్ పోలీస్, వజ్రా తదితర సిబ్బందితో భారీ బందోబస్తు.
- అలాగే ఎస్బీ, సీసీఎస్, ఎస్ఓటీ, రెండు ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయి. స్టేడియం పరిసర ప్రాంతాలు, స్టేడియంలో, ప్రేక్షకులు కూర్చునే చోటు, వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో కలిసి మొత్తం 300 సీసీ కెమెరాలు ఉంటాయి.

సీసీ టీవీలతో గస్తీ..

- సీసీ టీవీల దృశ్యాలను ఎప్పటికప్పుడు వీక్షించేలా కమాండ్ కంట్రోల్ రూం. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో నిరంతర గస్తీ.
- పేలుడు పదార్థాలను గుర్తించేలా ప్రత్యేక టీంల ఏర్పాటు. బ్లాక్ టికెట్లను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నవారిపై ఇప్పటికే 4 కేసులు బుక్ చేశాం.

సూచించిన స్థలాల్లోనే పార్కింగ్..

- హబ్సిగూడ చౌరస్తా నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు, రామంతాపూర్ విశాల్ మార్ట్ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు రోడ్డుకిరువైపులా ఎలాంటి వాహనాలను పార్క్ చేయొద్దు.
- కేటాయించిన స్థలాల్లోనే పార్కు చేయాల్సి ఉంటుంది. క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వచ్చినవారు టీఎస్ఐఐసీ స్థలంలోనే వాహనాలను పార్కు చేయాలి. ఏ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో సూచించే బోర్డులను ఏర్పాటు చేశాం.

ఎక్కడ మహిళలుంటే అక్కడ షీ టీం

- ఉప్పల్ క్రికెట్ స్టేడియంలోకి వచ్చే మహిళల భద్రతకు ప్రాధాన్యం. ఎక్కడ మహిళలు ఉంటే అక్కడ షీటీంలు అందుబాటులో ఉంటాయి.

వీఐపీలకే గేట్ నంబర్ వన్..

ఈసారి గేట్ నంబర్ వన్‌ను వీఐపీలకే అనుమతి ఉంటుంది. 12 నంబర్ గేట్‌ను గేట్ 1ఏగా గుర్తించి.. దాని ద్వారా జనరల్ పబ్లిక్‌ను అనుమతి ఇవ్వనున్నాం.

భారీ వాహనాల దారి మళ్లింపు

- బుధవారం ఉదయం నుంచే ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు, సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ వైపు, ఎల్బీనగర్ నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ వైపు వెళ్లే అన్ని భారీ వాహనాలను దారి మళ్లిస్తాం.
- వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను చెంగిచెర్ల, మల్లాపూర్‌ల మీదుగా దారి మళ్లిస్తాం.

సెల్‌ఫోన్లకు మాత్రమే అనుమతి

ప్రేక్షకులు కేవలం సెల్‌ఫోన్లు తప్ప మరే ఇతర వస్తువులను స్టేడియంలోకి అనుమతి ఉండదు.

తాగునీరు, తినుబండారాల విక్రయం

- తిను బండారాలు, తాగునీరు.. అన్ని రకాల ఆహార పదార్థాలను హెచ్‌సీఏ ద్వారా స్టేడియంలో విక్రయిస్తారు.
- సూచించిన రేట్లకే స్టాల్స్ నిర్వాహకులు వీటిని విక్రయించాలి. లేనిపక్షంలో పోలీసులు చర్యలు తీసుకుంటారు.



ఉప్పల్ స్టేడియం వద్ద పోలీసుల బందోబస్తు

కవన కుతూహలం

- 27 నుంచి 29 వరకు హైదరాబాద్ సాహిత్యోత్సవం
- తరలిరానున్న కవులు, కళాకారులు, మేధావులు

సాక్షి, సిటీబ్యూరో: వైవిధ్యభరితమైన హైదరాబాద్ సాహితీ ఉత్సవం (హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్) 13వ ఎడిషన్‌కు నగరం సన్నద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు విద్యారణ్య స్కూల్ వేదికగా వేడుకలు జరగనున్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు నిలిచిపోయిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు హెచ్ఎల్ఎఫ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విభిన్న కళలు, సాహిత్యం, సంస్కృతులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ప్రతి సంవత్సరం హైదరాబాద్ సాహిత్యోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2010 నుంచి నిరాటంకంగా (కోవిడ్ కాలం మినహా) జరుగుతున్న లిటరరీ ఫెస్టివల్ అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యాన్ని గడించింది. ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు, భిన్న భావజాలాలు, విభిన్న జీవన సమూహాలను ప్రతిబింబించే కళారూపాలకు, సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియలకు ఇది వేదికగా నిలిచింది. మూడు రోజుల పాటు సాహితీ ప్రియులను అక్కున చేర్చుకొని సమకాలీన సాహిత్య, సామాజిక అంశాలపై లోతైన చర్చలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అతిథి దేశంగా జర్మనీ..

హెచ్ఎల్ఎఫ్ 13వ ఎడిషన్‌కు జర్మనీ అతిథి దేశంగా హాజరు కానుంది. ఆ దేశానికి చెందిన పలువురు రచయితలు, మేధావులు భాగస్వాములు కానున్నారు. ప్రముఖ జర్మనీ యువ నవలా రచయిత్రి ఎవేన్‌కో బుక్కోసీ ఈ వేడుకల్లో పాల్గొంటారు. జర్మనీ కళారూపాలను ప్రదర్శించనున్నారు.

కొంకణి సాహిత్యం ఎంపిక..

ఈ ఏడాది కొంకణి భాషా సాహిత్యాన్ని భారతీయ భాషగా ఎంపిక చేశారు. గతేడాది జ్ఞానపీఠ అవార్డు పొందిన కొంకణికి చెందిన ప్రముఖ రచయిత దామోదర్ మౌజో ఈ వేడుకల్లో కీలకోపన్యాసం చేయనున్నారు. కొంకణి భాషా చిత్రాల దర్శకుడు బార్డ్‌రాయ్‌బరెక్టో పాల్గొంటారు. కొంకణి నృత్యాలు, జానపద కళలను ప్రదర్శించనున్నారు.

ప్రముఖుల ప్రసంగాలు

ప్రఖ్యాత దర్శకుడు దీప్తీ నవల్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత పాలగుమ్మి సాయినాథ్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మానస ఎండ్లూరి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నుంచి గీతా రామస్వామి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. జర్మనీతో పాటు అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన రచయితలు, కళాకారులు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొంటారు. వేడుకల్లో భాగంగా హైదరాబాద్ చారిత్ర వైభవాన్ని, వాస్తు నైపుణ్యాన్ని ప్రతిబింబించే పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉషా ఆకెళ్ల రూపొందించిన 'హమ్ ఐసీ బాత్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు.

ఇది అందరి వేడుక: ప్రొఫెసర్ విజయ్‌కుమార్



హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. ఈసారి మెట్రో రైల్ ప్రత్యేక ప్రచారం నిర్వహించనుంది. ఖైరతాబాద్ నుంచి విద్యారణ్య స్కూల్ వరకు మూడు రోజుల పాటు ప్రతి 15 నిమిషాలకో ఉచిత ట్రిప్పును ఏర్పాటు చేయనుంది.

'సుంకిశాల'.. చకచకా

- రూ.1450 కోట్ల వ్యయంతో పనులు
- ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తి
- ఈ ఏడాది చివరికి అందుబాటులోకి



సాక్షి, సిటీబ్యూరో: మహానగర దాహార్తిని తీరుస్తున్న కృష్ణా మూడు దశల ప్రాజెక్టులకు ఈ ఏడాది చివరి నాటికి పుష్కలంగా తాగునీరు అందుబాటులోకి రానుంది. జలాలను తరలించేందుకు ఉద్దేశించిన సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. నాగార్జున సాగర్ బ్యాక్‌వాటర్ సుంకిశాల వద్ద రూ.1470 కోట్ల అంచనా వ్యయంతో జలమండలి ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు సుమారు 50 శాతం.. అంటే రూ.760 కోట్ల మేర పనులు పూర్తయినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఈ ఏడాది నవంబర్– డిసెంబర్ లోగా పనులు పూర్తి చేస్తామని పేర్కొంది.

దాహార్తి దూరం..

- ప్రస్తుతం కృష్ణా మూడు దశల ప్రాజెక్టుల ద్వారా నగరానికి నిత్యం 270 మిలియన్ గ్యాలన్ల (16.5 టీఎంసీలు) తాగునీటిని ఎలిమినేటి మాధవరెడ్డి కెనాల్ (ఏఎంఆర్‌పీ) నుంచి తరలిస్తున్నారు. ఏటా నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టాలు 510 అడుగుల కంటే దిగువనకు పడిపోయినపుడు డ్రెడ్జింగ్ ప్రక్రియ ద్వారా డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని తరలించాల్సి వస్తోంది.
- ఈ నేపథ్యంలోనే ఈ ఇన్‌టేక్‌వెల్‌ను అత్యంత లోతున నిర్మిస్తున్నారు. సుమారు 170 మీటర్ల లోతు, 40 మీటర్ల వెడల్పున ఇన్‌టేక్ వెల్‌ను నిర్మిస్తున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాల కారణంగా భవిష్యత్‌లో మొత్తంగా 20 టీఎంసీల కృష్ణా జలాలను నగరానికి తరలించేందుకు ఈ వెల్‌ను నిర్మిస్తుండడం విశేషం. మండువేసవిలోనూ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎండీడీఎల్(మినిమం డ్రాయల్ డౌన్ లెవెల్) కంటే దిగువ నుంచి కూడా నీటిని తరలించేందుకు సుంకిశాల ప్రాజెక్టు ఉపయోగపడనుందని జలమండలి వర్గాలు తెలిపాయి.

ప్రాజెక్టు పురోగతి ఇలా..

- అండర్ గ్రౌండ్ షాఫ్ట్ (వెట్ వెల్ డ్రై వెల్): అండర్ గ్రౌండ్ షాఫ్ట్ నిర్మాణం కోసం కీలకమైన రాతి తొలగింపు పనులు పూర్తయ్యాయి.
- 8 మీటర్ల డయా వ్యాసార్థంతో యాక్సెస్ టన్నెళ్లు, లింక్ టన్నెళ్ల తవ్వకం పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి. మొత్తం 1100 రన్నింగ్ మీటర్లు (ఆర్ఎంటీ)లో 900 ఆర్ఎంటీ మేర పనులు పూర్తయ్యాయి. ఇన్ టేక్ టన్నెళ్ల తవ్వకం పనులు జరుగుతున్నాయి.
- ఎలక్ట్రో మెకానికల్ ఈక్విప్ మెంట్: ట్రాన్ కో నుంచి ప్రత్యేకంగా హెచ్ టీ ఫీడర్ మెయిన్ తీసుకున్నారు. పంపులు, మోటార్లు, ట్రాన్స్ఫార్మర్, సబ్ స్టేషన్, ఇతర సామగ్రి కొనుగోలు ప్రక్రియ జరుగుతోంది.

పంపింగ్ మెయిన్లు: 2375 ఎంఎం డయా ఎంఎస్ పైపులైన్‌కు ప్లేట్లు, పైపుల కొనుగోలు, తయారీ జరుగుతోంది. మొత్తం 5 కిలోమీటర్ల పైపులైన్లు తయారు కాగా, 3 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు పూర్తయ్యింది. మొత్తం ప్రాజెక్టును 2023 నవంబరు– డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నారు.

నగరంలో నేడు

- 'కొత్త కథలు-5' ఆవిష్కరణ (66 మంది రచయితల కథా సంకలనం). వంశీ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు రవీంద్రభారతిలో కార్యక్రమం జరుగుతుంది.
- మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 27వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్, రసూల్‌పుర విగ్రహం, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌ల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి.
- భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ సమావేశం మధ్యాహ్నం 12.30 గంటలకు హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది.
- 4. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ 4వ కన్వొకేషన్‌పై ఉదయం 11 గంటలకు మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయు క్యాంపస్‌లో సమావేశం జరుగుతుంది.

వరద విపత్తులు ఎదుర్కొనేలా సరికొత్త ప్రణాళిక

- ప్రపంచ బ్యాంకు సహకారంతో రూపొందించేందుకు ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎదురయ్యే ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్లైమేట్ రెసీలియెంట్ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. దీన్ని అమలు చేసేందుకు జీహెచ్ఎంసీతోపాటు వాటర్ బోర్డు, భూగర్భ జలవనరుల శాఖ, ఈపీటీఆర్ఐలు సంయుక్తంగా పనిచేయనున్నాయి. వరల్డ్‌బ్యాంక్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని భావిస్తున్నారు. నగరంలో ఎంపిక చేసిన దాదాపు పది ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేసేందుకు దాదాపు రూ.250 కోట్లు వ్యయం కానుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం ఆర్థిక సహకారం కోసం ప్రపంచబ్యాంకుకు పంపనుంది. ముఖ్యంగా వరదల సమయంలో ముంపు సమస్యలు ఏర్పడకుండా ఉండటంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వరద నీటిని భూగర్భంలో ఇంకేలా చేయడం.. ముంపు ముప్పు లేకుండా చేయడంతోపాటు ఇతరత్రా అంశాలపై దృష్టి సారించినట్లు తెలిసింది.

ఆశల పల్లకిలో టీచర్లు!

- అర్హుల జాబితా సిద్ధం
- అధికారుల కసరత్తు పూర్తి
- 394 మందికి అవకాశం

ప్రభుత్వం ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న పదోన్నతులు, బదిలీలకు మోక్షం లభించనుంది. సుమారు ఏడున్నర సంవత్సరాల తర్వాత అర్హులైన టీచర్లకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేందుకు నిర్ణయించిన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాల్లో సుమారు 394 మందికి అవకాశం దక్కనుంది. వాస్తవంగా వివిధ కేటగిరీల్లో మొత్తం 516 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో 70 శాతం కింద పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తుండగా, మిగతా 30 శాతం (122) పోస్టులను టీచర్స్ రిక్రూట్‌మెంట్(టీఆర్టీ) ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. గెజిటెడ్ హెచ్ఎం గ్రేడ్-2, డిప్యూటీ ఐఓఎస్ పోస్టులను పూర్తిగా పదోన్నతులతో నింపనున్నారు. ఇదిలా ఉండగా, పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ఇప్పటికే జిల్లా అధికారులు ఇప్పటికే తయారు చేశారు. ప్రభుత్వం ప్రమోషన్ నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే అందజేసేందుకు సిద్ధమయ్యారు.

– సాక్షి, సిటీబ్యూరో

జిల్లా విద్యా శాఖలో పర్యవేక్షక అధికారుల పోస్టుల సైతం ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడంతో ఖాళీల జాతరా కొనసాగుతోంది. సీనియర్ హెచ్ఎం లకు అదనపు బాధ్యతలు అప్పగించి కొనసాగిస్తున్నారు. మొత్తం మీద జిల్లా విద్యాశాఖలో అన్ని విభాగాల్లో ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది

పదోన్నతులు.. బదిలీల వ్యవహారం



12 డిప్యూటీ ఈఓ పోస్టుల్లో అన్ని ఖాళీగానే ఉన్నాయి. సీనియర్ గెజిటెడ్ హెడ్మాస్టర్లతోనే ఆయా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 24 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్) పోస్టుల్లో 23 ఖాళీ గా ఉండగా ఒకరు మాత్రమే రెగ్యులర్ అధికారిగా విధులు నిర్వరిస్తున్నారు అలాగే 10 గెజిటెడ్ హెడ్మాస్టర్ పోస్టుల్లో పది ఖాళీ ఉండగా, 171 ప్రధానోపాధ్యాయుల్లో 86 ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రక్రియ ఇలా..

- ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)గా, ఎస్ఏలు ప్రధానోపాధ్యాయులు(హెచ్ఎం)గా పదోన్నతులు పొందనున్నారు.
- ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్నవారికి బదిలీల వర్తించనున్నాయి. పోస్టులు కేటాయించే క్రమంలో సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారు.
- ప్రధానోపాధ్యాయులకు మాత్రం ఐదేళ్లు ఒకే దగ్గర విధులు నిర్వర్తించినవారికి బదిలీ వర్తిస్తుంది.

ఖాళీలు ఇలా..

హైదరాబాద్ జిల్లాలోని సర్కారు బడుల్లో గజిటెడ్ హెచ్ఎం గ్రేడ్-11 డిప్యూటీ ఐఓఎస్, ఎస్ఏ మాథ్స్,ఫిజిక్స్, బయోసైన్స్, సోషల్, ఇంగ్లీష్, తెలుగు,ఉర్దూ, హిందీ, పీఈడీ సబ్జెక్టుల్లో సుమారు 514 వివిధ పోస్టులు ఖాళీగా ఉండగా అందులో 70 శాతం కింద సుమారు 392 పోస్టులు పదోన్నతులు, బదిలీల ద్వారా భర్తీ కానున్నాయి. ఉర్దూ మీడియంలో 234 ఖాళీలకు గాను 173, తెలుగుమీడియంలో 206 ఖాళీలకు గాను 157, ఇంగ్లిష్ మీడియంలో 51 ఖాళీలకు గాను 38 భర్తీ కానున్నాయి.

వెంటాడుతున్న కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుంగా ఉపాధ్యాయుల భర్తీ లేకుండా పోయాయి. పలు పాఠశాలల్లో నాలుగైదేళ్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు,వ్యాయామ ఉపాధ్యాయులు పదవీ విర మణ పొందుతున్నప్పటికీ, వారి స్థానాలను భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల బోధన ప్రశ్నార్థకంగాతయారైంది. మరోవైపు పదోన్నతులు కూడా లేకుండా పోయాయి. 2016 తర్వాత నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టక పోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపైనే బోధన భారం పడుతోంది.

- హైదరాబాద్ జిల్లాలోని 508 ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలలు ఉండగా, 182 హైస్కూళ్లు ఉండగాఅందులో సుమారు 6,200 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రజా పంపిణీ తీరుపై ఆరా!

- నేటి నుంచి 21 వరకు కేంద్ర డిప్యూటీ సెక్రటరీ పర్యటన
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో రేషన్ దుకాణాల సందర్శన



సాక్షి,సిటీబ్యూరో: ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా జరిగే పంపిణీ ప్రక్రియపై కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే క్షేత్ర స్థాయి పరిశీలనతో పంపిణీ తీరును ఆరా తీస్తోంది. తాజాగా కేంద్ర డిప్యూటీ సెక్రటరీ లాలన్ ప్రసాద్ శర్మ నాలుగు రోజుల పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు చౌకధరల దుకాణాలను సందర్శించి పరిశీలించనున్నారు. ఇందు కోసం వారికి లైజన్ ఆఫీసర్లుగా ఖైరతాబాద్, ముషీరాబాద్ అసిస్టెంట్ సివిల్ సప్లయ్స్ అధికారులను నియమి స్తూ హైదారాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. గత నెలలో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ ఆర్థిక సలహాదారు మమతా శంకర్ తన బృందంతో కలిసి రెండు రోజుల పాటు ప్రభుత్వ చౌకధరల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, ఇతర ఆహార ఉత్పత్తు క్వాలిటీతో పాటు రికార్డులు సైతం పరిశీలించారు. పేదలకు ఆహార పంపిణీలో భాగంగా నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

చేతివాటంపై దృష్టి

తాజాగా మరో బృందం రేషన్ షాపుల పరిశీలనకు రానుండడం ప్రత్యేకత సంతరించుకుంది. కేంద్రం కేటాయించే కోటా సక్రమంగా పంపిణీ అవుతుందా? లేక డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారా? అనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ ఎలా ఉందన్నదానిపై కూడా ఆరా తీయనున్నట్లు తెలుస్తోంది.

సబ్సిడీపైనే సరుకులు

కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున బియ్యంతో పాటు గోధుమలు, కిరోసిన్, కంది పప్పు సబ్సిడీపై కేటాయిస్తూ వస్తోంది. కరోనా నేపథ్యంలో సబ్సిడీ బియ్యం ఉచితంగా కేటాయిస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులకు మాత్రమే కోటా కేటాయిస్తుండగా, ఎఫ్ఎస్ఏ కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎఫ్ఎస్ఏతో సమానంగా పంపిణీ చేస్తూ వస్తోంది. కరోనా నేపథ్యంలో కేంద్రం కోటాకు అదనంగా రాష్ట్ర కోటా చేర్చి పంపిణీ చేస్తూ వచ్చింది. తాజాగా ఉచిత బియ్యం పంపిణీ మాత్రం కేంద్రం కోటాకు పరిమితం చేసి అందిస్తోంది.

దిండుతో అదిమి చంపేశాడు!

- చిన్నారి తలపై గాయాలు కూడా ఉన్నట్లు గుర్తింపు
- భార్య సింధూరకు విషం ఇచ్చినట్లు అనుమానాలు
- ఫోరెన్సిక్ నివేదిక తర్వాతే పూర్తి స్పష్టతకు అవకాశం
- 'కాపాడాల్సిన వాడే కడతేర్చిన' కేసులో దర్యాప్తు

లాలాపేట/గాంధీ ఆస్పత్రి: 'కాపాడాల్సిన వాడే కడతేర్చిన' కేసులో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. తార్నాకలోని రూపాలీ అపార్ట్‌మెంట్‌లో భార్య, కుమార్తె, తల్లిని చంపి ఆత్మహత్య చేసుకున్న ప్రతాప్ కేసును ఉస్మానియా యూనివర్శిటీ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం పరీక్షలు పూర్తి కావడంతో మంగళవారం నలుగురి మృతదేహాలకు లాలాపేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరి మృతదేహాల నుంచి సేకరించిన నమూనాలపై ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే పూర్తి స్పష్టత వస్తుందని పోలీసులు చెబుతున్నారు. చెన్నైకి వలస వెళ్లడం విషయంలో భార్యాభర్తలైన ప్రతాప్-సింధూర మధ్య తలెత్తిన వివాదం మూడు హత్యలు, ఓ ఆత్మహత్యకు కారణమైంది. సోమవారం తెల్లవారుజామున భార్య సింధూర, కుమార్తె ఆద్య, తల్లి జయతి ఒకరి తర్వాత ఒకరుగా ప్రతాప్ చేతిలో హతమయ్యారు. దిండుతో ముఖంపై అదిమిపెట్టి ఊపిరి ఆడకుండా చేయడం ద్వారా వీరిని చంపినట్లు, ఆపై అతడూ ఉరేసుకున్నట్లు ఫోరెన్సిక్ వైద్యులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ప్రాథమిక నివేదిక అందించారు. ఆద్య తలపై మాత్రం కొన్ని గాయాలు ఉన్నట్లు తేలిందని, వీటికి కారణాలు తేలాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. సింధూర కడుపులో కొన్ని అనుమానాస్పద ద్రవాలను ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారని ఓ అధికారి తెలిపారు. అది విషమా? లేక మరేదైనానా? అన్నది తేల్చడానికి నమూనాలను (విస్రా) ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకి పంపినట్లు పేర్కొన్నారు. ఆమెతో పాటు మిగిలిన ముగ్గురి నమూనాలు పంపామని, ఆ నివేదికలు వచ్చాకే పూర్తి స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. ప్రతాప్, సింధూర, ఆద్య, జయతి మృతదేహాలను పోస్టుమార్టం పరీక్షల అనంతరం పోలీసులు వారి బంధువులకు అప్పగించారు. మంగళవారం ఈ మృతదేహాలకు లాలాపేటలోని హిందూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.



బీఆర్ఎస్‌ను స్వాగతిస్తున్నాం: గద్దర్

అల్వాల్: దేశ రాజకీయాలలో నూతనంగా ఆవిర్భవించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని స్వాగతిస్తున్నామని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. మంగళవారం వెంకటాపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహనీయుల ఆలోచన విధానాలను ఆచరిస్తూ గుణాత్మక, పరిణామాత్మక మార్పు కోసం కొత్త పార్టీ పాటుపడాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఉండి తీరాల్సిందేని, చట్ట సభల్లో ప్రశ్నించే వారుండాలని అన్నారు. కాగా దేశ రాజధానిలో నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టాల్సిందేనని గద్దర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ దశలో చర్చలు జరగాల్సి ఉందని ఆయన సూచించారు. పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టేందుకు మద్దతుగా, తెలంగాణ సెక్రటేరియట్ నూతన భవనానికి అంబేడ్కర్ పేరు పెడుతూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన తీర్మానాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. దేశంలో భూమి సమస్య తీవ్రమవుతోందని, ఆరు లక్షల ఇరవై రెండు వేల గ్రామాలు ఉండగా..నూటికి 85 శాతం భూమిని దున్నుకొని బతుకుతున్నారని గద్దర్ వెల్లడించారు. దేశంలో సారవంతమయిన భూములు, జీవనదులు, చెమటోడ్చే శ్రమజీవులు ఉన్నప్పటికీ ఇంకా పేదరికం పోలేదన్నారు.

కేబీఆర్ పార్కు స్థలం 8వ నిజాందే...

ముకరం జా బహదూర్‌కు బంజారాహిల్స్‌తో అనుబంధం


ముకరంజా నిర్మించుకున్న చిరాన్ మసీదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక కె.బి.ఆర్ పార్క్ ఒకప్పుడు ఎనిమిదో నిజాం ముకరం జా బహదూర్‌కు చెందినదిగా తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ఇస్తాంబుల్ లో ఆయన కన్నుమూయగా మంగళవారం ఆయన భౌతిక కాయాన్ని హైదరాబాద్ తీసుకొచ్చిన నేపథ్యంలో బంజారాహిల్స్‌తో ఆయనకున్న జ్ఞాపకాలను స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. బంజారాహిల్స్‌లో 400 ఎకరాల విస్తీర్ణంలో ముకరంజా 1940లో చిరాన్ ప్యాలెస్‌ను నిర్మించుకొని దానిని తన అధికారిక నివాసంగా మార్చుకున్నారు. ఇందులో రెండు సెల్లార్లు కూడా ఉన్నాయి. ప్రిన్స్ ఆడుకునేందుకు అతిపెద్ద కాన్ఫరెన్స్ హాల్ తో కూడిన బిలియర్డ్స్ గదులను నిర్మించారు. ఆయుధాలను భద్రపరిచే హాలు కూడా నిర్మించారు. మొదటి అంతస్తులు ఏడు బెడ్ రూములు ఉండగా భార్య పిల్లలతో ఇక్కడే ఉండేవారు. చిరాన్ ప్యాలెస్‌ను ఆనుకొని మోర్ బంగ్లా, గోల్ బంగ్లా, గుర్రాలు ఏనుగుల కోసం షెడ్లు, వాహనాలు భద్రపరిచేందుకు మోటార్ ఖానా ఉండేవి. అలాగే రాజు వాహనాల కోసం ప్రత్యేకంగా పెట్రోల్ బంకులు కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. మంచినీటి సదుపాయం కోసం ప్రత్యేకంగా బావులు, చెరువులను తవ్వించారు. అయితే ముకరంజా ఎక్కువగా ఆస్ట్రేలియా, టర్కీ, లండన్ దేశాలలో ఉంటుండడంతో చిరాన్ ప్యాలెస్ అధ్వానంగా మారింది.

ఈ నేపథ్యంలోనే 1998లోనే ఈ 400 ఎకరాల స్థలంలో నుంచి 360 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నేషనల్ పార్కుగా నోటిఫై చేసి దీనికి మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి పేరు పెట్టింది. ఇది ఇలా ఉండగా ముకరంజాకు చెందిన చిరాన్ ప్యాలెస్ నిర్మిత 11 ఎకరాలు మాత్రం ఆయనకు కేటాయించారు. ప్రస్తుతం ఈ 11 ఎకరాల్లో ఉన్న చిరాన్ ప్యాలెస్ ఆయన ఆధీనంలోనే ఉన్నది. ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డ్స్ ఏర్పాటు చేసి దీనిని సంరక్షిస్తున్నారు. కొద్ది దూరంలోనే రాజు ప్రార్థనలు చేసుకునేందుకు చిరాన్ మసీద్‌ను కూడా నిర్మించారు. 20 సంవత్సరాల క్రితం ఈ మసీదును ప్రార్థనల కోసం అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. మరోవైపు ముకరంజా కోరుకున్నట్టుగానే పార్కు లో నెమలుల సంఖ్య భారీగా పెరిగింది. చిరాన్ ప్యాలెస్ చుట్టూ నెమళ్లు నిత్యం సందడి చేస్తుంటాయి. పార్కులో చిరాన్ ప్యాలెస్ ఒక అద్భుతమైన కట్టడంగా మిగిలి ఉంది. ముకరంజా మరణంతో చిరాన్ ప్యాలెస్ నిర్వహణ మరింత క్లిష్టంగా మారనుంది. 2004లో చివరిసారిగా ముకరంజా హైదరాబాద్ పర్యటనలో భాగంగా చిరాన్ ప్యాలెస్ సందర్శించి మసీదులో ప్రార్థన నిర్వహించిన స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ప్యాలెస్‌లో ఇప్పటికీ విలువైన, అరుదైన వజ్రాభరణాలు, ఖరీదైన కళాఖండాలు ఉన్నట్లు సమాచారం.

సంతాపం

సాక్షి, సిటీబ్యూరో: నిజాం నవాబు ముకరంజా మృతి పట్ల నోమల్ జాగిర్దార్ గ్యారా ప్రతాప్ పటేల్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. విద్య, వైద్యంలో ఆయన చేసిన కషి ప్రశంసనీయమని, సమాజానికి ఆయన చేసిన సేవలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ముకరంజా బహదూర్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికార లాంఛనాలతో నవాబ్ అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించడం పట్ల సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏరోసిటీలో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్

సాక్షి, సిటీబ్యూరో: ఈ విద్యాసంవత్సరం నుంచి జీఎమ్మార్ ఏరోసిటీలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభం కానుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా ఉన్న ఈ పాఠశాల ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించడంలో సహాయపడటానికి వ్యక్తిగత విద్యార్థి అవసరాలపై దృష్టి సారించే సమగ్రమైన పాఠ్యాంశాలను అందిస్తోంది. దీనిపై ఎయిర్‌పోర్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్ కపూర్ మాట్లాడుతూ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఏరోసిటీ క్యాంపస్‌కు రావడం ఆనందంగా ఉందన్నారు. ఏరోసిటీ హైదరాబాద్ విద్య, వైద్యం తదితర రంగాల్లో అద్భుతమైన పర్యావరణ, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందిస్తుందని చెప్పారు.

శరవేగంగా విలీన ప్రక్రియ!

కంటోన్మెంట్‌పై ఆర్మీ అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ భేటీ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఈ మేరకు ఏర్పాటైనకమిటీ గతవారమే భేటీ అయ్యి విధి, విధానాలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికారుల మధ్య సంప్రదింపుల ప్రక్రియ సాగుతోంది. కమిటీ సభ్య కార్యదర్శి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్‌తో భేటీ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ మంగళవారం తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) హెడ్ క్వార్టర్స్‌లో కంటోన్మెంట్ అధ్యక్షుడు, బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్ ఇతర అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీలో విలీనం కాబోయే స్థలాలు, విస్తీర్ణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది.

ఆ నాలుగింటిపైనే పేచీ?

ముందస్తుగా నిర్ణయించిన మేరకు ఆర్మీ తమ స్థలాలు మినహా మిగతా ప్రాంతాలన్నింటినీ కంటోన్మెంట్ నుంచి వేరు చేయాలని కోరింది. అందుకు తగ్గట్టుగానే ఏ-1, ఏ-2 స్థలాలను మాత్రమే తమ అధీనంలో ఉంచుకుని బీ-2, బీ-3, బీ-4, సీ, సివిల్ ఏరియా (16 బజార్‌లు) అన్నింటినీ అప్పగించేందుకు దాదాపు సమ్మతించింది. అయితే తాజాగా బీ-3 కేటగిరీకి చెందిన ఓల్డ్ గ్రాంట్ బంగ్లాల విషయంలో మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. భద్రతా కారణాల రీత్యా ఆర్మీ స్థావరాలకు అత్యంత సమీపంలో ఉండే పలు బంగ్లాలను తమ అధీనంలోనే ఉంచుకునేలా ప్రతిపాదించినట్లు సమాచారం. ఇక వీటితో పాటు పరేడ్ గ్రౌండ్ సమీపంలోని బైసన్ పోలో, జింఖానా మైదానాలను సైతం అప్పగించేందుకు ఆర్మీ విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఏ-1 కేటగిరీలో ఉన్న ఈ స్థలాలను కొన్నేళ్ల క్రితమే కంటోన్మెంట్‌కు బదలాయించారు. హస్మత్‌పేట, తుర్కపల్లిలోని ట్రెంచింగ్ గ్రౌండ్ స్థలాలు కూడా రక్షణ శాఖ ఆధీనంలోనే ఉండే అవకాశముంది. మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం, పికెట్, బొల్లారం పబ్లిక్ పార్కు సహా అన్ని కాలనీల్లోని 40 శాతం కంటోన్మెంట్ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనున్నారు.

క్లుప్తంగా

విష్ణు సహస్రనామ పారాయణ పోటీలు

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం లోని హిందూ ధర్మప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1వ తేదీన ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్ టీటీడీ బాలాజీ భవన్‌లో శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణంపై 10–15 సంవత్సరాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ కె.చంద్రమౌళీశ్వర శర్మ, జి.హరినాథ్ వెల్లడించారు. అలాగే పదేళ్ల లోపు విద్యార్థులకు శ్రీ అచ్యుతాష్టకం, తొమ్మిది శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామని, ఈ గ్రూప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తామన్నారు. ఇందుకు సంబంధించిన మరింత సమాచారం కోసం 9030850336 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

మూగబోయిన 'ధర్మగంట'లు



జీవీకే వన్ వద్ద నిరుపయోగంగా ఉన్న ధర్మగంట

బంజారాహిల్స్: ఆపద సమయంలో పిలిస్తే పోలీసులు పరిగెత్తుకొచ్చి ఆదుకుంటారనే ఉద్దేశంతో వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ధర్మ గంటలు మూగబోయాయి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎవరికైనా ఆపద అనిపిస్తే మీటనొక్కి పోలీసులను అప్రమత్తం చేసేందుకు అక్కడక్కడ వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నం.1 లోని జీవీకే వన్ మాల్ వద్ద, కేబీఆర్ పార్కు వద్ద, పీపుల్స్ ప్లాజా వద్ద వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ధర్మ గంటలు ఇప్పటికీ పని చేయడం లేదు. ఇవి పని చేస్తున్నాయేమోనని చాలా మంది మీట నొక్కుతుండగా అవతలి వైపు నుంచి స్పందన రావడం లేదు. కనీసం ఇవి పని చేయడం లేదన్న విషయాన్ని కూడా పోలీసులు చెప్పలేని పరిస్థితి తలెత్తింది. ఈ ధర్మగంటలను అందుబాటులోకి తెస్తే ఆపదలో ఉన్న వారికి ఎంతో మేలు జరిగేందుకు అవకాశం ఉంటుంది.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజక వర్గ టీడీపీ నేతలు మంగళవారం టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ గోస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎం. నర్సింహులు, యాదగిరి, ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సనాతన సంక్రాంతి సంగమం వేడుకలు



జ్ఞాపిక అందుకుంటున్న రాజేష్ యాదవ్

బంజారాహిల్స్: బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో సనాతన సంక్రాంతి సంగమం వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆస్ట్రేలియా సిడ్నీలోని స్ట్రాత్‌ఫీల్డ్ సిటీ కౌన్సిలర్ సాండీ రెడ్డి, స్ట్రాత్ ఫీల్డ్ ఇండిపెండెంట్స్ పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఆగ్రో కెమికల్స్ డైరెక్టర్ సంతోష్‌రావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా సిడ్నీలో ఆరేళ్ల పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఖైరతాబాద్ రాజ్‌భవన్ క్వార్టర్స్ నివాసి రాజేష్ బి యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో భాగంగా సాండీరెడ్డిని కూడా ఘనంగా సత్కరించారు.

నేడు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో 5 సం.ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నేడు (18న) కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. బుధవారం ఎల్ఎల్‌బీ కోర్సుకు ఉదయం 10.30 లకు, ఎల్ఎల్ఎం కోర్సుకు సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలని అధికారులు తెలిపారు.

'కంటి వెలుగు'కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి రెండో విడత కార్యక్రమం షురూ
- ఖైరతాబాద్‌లో తొమ్మిది శిబిరాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 9 నుంచి ప్రారంభం



గౌరీశంకర్ కాలనీ కంటి వెలుగు శిబిరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ, వైద్యాధికారులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆశ కార్యకర్త

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 19న ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు ప్రజలకు మంగళవారం అవగాహన కలిగించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. శిబిరానికి హాజరయ్యే వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డుతో రావాలని వైద్యాధికారులు సూచించారు.

- ఈ నెల 18న కంటి వెలుగు శిబిరాలను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు.
- 19వ తేదీ నుంచి ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో గుర్తించిన కమ్యూనిటీ హాళ్లలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.
- వైద్య ఆరోగ్యశాఖాధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు ఈ శిబిరాలను విజయవంతం చేసే దిశలో గత పది రోజుల నుంచి పనుల్లో నిమగ్నమయ్యారు.
- శిబిరాలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన కమ్యూనిటీ హాళ్లను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.
- 18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహించాలని తలపెట్టారు. ఇప్పటికే ఆహ్వాన పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాలను చేపట్టారు.

ఐదు అంచెల్లో...

- మొత్తం ఐదు అంచెల్లో శిబిరాల నిర్వహణ కొనసాగుతుంది. తొలుత శిబిరానికి హాజరయ్యే వారి ఆధార్, ఇతర వివరాలతో రిజిస్ట్రేషన్ చేస్తారు. అందరికీ ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు.
- ఆ తర్వాత అవసరం అనుకుంటే వైద్యాధికారి, ఏఎన్ఎం ఆధ్వర్యంలో మరో పరీక్ష చేస్తారు. ఈ వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి మందులు ఇస్తారు.
- కళ్లజోళ్లు అనివార్యమైన వారికి ఈ అంచెలో ఏఆర్ కోడ్ సహాయంతో ఐదు రకాల పరీక్షలు జరిపి ఫలితాలు, లబ్ధిదారుల ఫొటోతో సహా ట్యాబ్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తారు. అవసరమైన వారికి రీడింగ్ గ్లాస్‌లు ఇస్తారు.
- తుది అంచెలో దృష్టి లోపం గుర్తిస్తే కళ్లజోళ్ల తయారీకి మరోసారి ఫొటోలు సేకరిస్తారు. ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఆర్డర్ పెడతారు.
- 15 రోజుల్లో పీహెచ్‌సీలకు కళ్లద్దాలు చేరుతాయి.

తొమ్మిది మంది వైద్య సిబ్బంది



కంటి వెలుగు శిబిరాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా వైద్యాధికారిని నియమించాం. ఆయనకు సహాయంగా ఆప్తాలజిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశ వర్కర్లు, ఒక సూపర్‌వైజర్, ఒక అటెండెంట్ ఉంటారు. శిబిరాలకు వచ్చేవారు ఆధార్,రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వెంట తీసుకురావాలి. కంటి వెలుగు కోసం అంతా సిద్ధం చేశాం. ఒక్కో కేంద్రంలో 40 వేల మందికి పరీక్షలు జరుపుతారు. సంఖ్య పెంచితే రెండో కేంద్రం ఏర్పాటు చేస్తాం. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తాం.

– డాక్టర్ కార్తీక్, బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్

ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నాం



కంటి వెలుగు శిబిరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు జీహెచ్ఎంసీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నారు. 18 ఏళ్లు పైబడ్డ వారందరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి. ఐదు అంచెల్లో ఈ పరీక్షలు చేపడతారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏ కంటి సమస్య ఉన్నా ఈ శిబిరాల్లో పరిష్కరించుకోవచ్చు. పైసా ఖర్చు లేకుండా కంటి పరీక్షలు చేయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

– రజినీకాంత్‌రెడ్డి, డీఎంసీ, సర్కిల్–18 జూబ్లీహిల్స్

నియోజకవర్గంలో కంటి వెలుగు శిబిరాలివే...

- బంజారాహిల్స్‌రోడ్ నం. 10లోని ఇబ్రహీం నగర్ కమ్యూనిటీ హాల్
- బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని గౌరీశంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్
- బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్బీ నగర్ కమ్యూనిటీ హాల్
- ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్
- బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్
- ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్
- ఖైరతాబాద్ శ్రీనివాసనగర్ కమ్యూనిటీ హాల్
- సోమాజిగూడ ఎంఎస్ మక్తా కమ్యూనిటీ హాల్
- హిమాయత్‌నగర్ డివిజన్‌లోని నారాయణగూడ కేశవ మెమోరియల్ స్కూల్

'బీఆర్ఎస్ సభను విజయవంతం చేయండి'

లిబర్టీ: ఖమ్మంలో ఈనెల 18న జరుగనున్న భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న సదానందం పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వేలాది మంది ప్రదర్శనగా తరలివెళ్లి సభలో పాల్గొంటామన్నారు. కేరళ, ఢిల్లీ, పంజాబ్, బీహార్, ముఖ్యమంత్రులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి తదితరులు పాల్గొనే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని సదానందం కోరారు.

అగ్నిప్రమాదం.. గిఫ్ట్ షాప్ దగ్ధం



కాలి బూడిదైన గిఫ్ట్ షాప్

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దాదాపు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు... దోమలగూడలో నివాసం ఉండే లక్ష్మణ్‌లాల్ గత పదేళ్లుగా హిమాయత్‌నగర్ వైజంక్షన్ సమీపంలోని టీవీఎస్ షోరూం వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గిఫ్ట్ షాప్ నెలకొల్పి సీజనల్ పండుగలకు సంబంధించిన పలు రకాల వస్తువులను విక్రయిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటక దట్టమైన పొగలు వ్యాపించి మంటలు మొదలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లోపల ఉన్న సుమారు రూ.2 లక్షల విలువ చేసే వస్తువులు కాలి బూడిదైనట్టు ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

'గ్రీన్ ఛానెల్'లో గుండె, కిడ్నీ తరలింపు



గ్రీన్ ఛానెల్ ద్వారా అంబులెన్స్‌లో గుండె, కిడ్నీలను తరలిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: అపోలో ఆస్పత్రి నుంచి నిమ్స్ ఆస్పత్రికి మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ఓ వ్యక్తికి గుండె, కిడ్నీలను అమర్చాల్సి ఉండగా ఇందు కోసం అపోలో నుంచి నిమ్స్ వరకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ టి. నరసింహారాజు నేతృత్వంలో గ్రీన్ ఛానెల్‌లో ఆరు నిమిషాల 10 సెకన్లలో నిమ్స్ ఆస్పత్రికి అవయవాలను తీసుకెళ్లారు. నగర పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ అదనపు కమిషనర్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ ఈ సందర్భంగా గ్రీన్‌ఛానెల్ ఏర్పాటు చేసి రోగికి అమర్చాల్సిన గుండె, కిడ్నీలను సకాలంలో చేర్చినందుకు సీఐ నరసింహారాజును ప్రత్యేకంగా అభినందించారు.

22 నుంచి విశ్వసాయి గుడిలో మాఘమాస మహోత్సవాలు



విశ్వసాయి మందిరంలోని సాయిబాబా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12 భవానీనగర్‌లోని విశ్వసాయి మందిరంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు మాఘ మాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయిబాబాకు విశేష పూజలు జరుగుతాయి. ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతిరోజూ బాబా వారి ఉత్సవ మూర్తికి ఏకవారాభిషేకం, సహస్రనామ పుష్పార్చన, నక్షత్ర హారతి, ధుని పూజ నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. ప్రతి గురువారం ఉదయం 5.15 గంటలకు ధూప సేవ, కాగడ హారతి, అర్చన, నక్షత్ర హారతి, మధ్యాహ్నం హారతి, సాయంత్రం ధూప సేవ, సంధ్యాహారతి, రాత్రి 9.30 గంటలకు షేజ్ హారతి, ఊంజల్ సేవా ఉంటాయన్నారు. ప్రతిరోజూ బాబాకు వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు, సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు విశేష అభిషేక సహస్రనామ పుష్పార్చనలు ఉంటాయన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో విశ్వక్‌సేన్ తదితరులు

కేలండర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్: ప్రముఖ సెలబ్రిటీ మేనేజ్‌మెంట్ సంస్థ మీడియా 9 ఆధ్వర్యంలో 'మై సౌత్ దివా' పేరుతో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో కనుల పండువగా నిర్వహించారు. టాలీవుడ్ హీరో విశ్వక్‌సేన్ చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ నిర్వహించారు. దక్షిణాది హీరోయిన్లు అవికాగౌర్, మాళవికా, సిమ్రాన్ శర్మ, ఉల్కా గుప్తా, హర్షితా గౌర్ సహా 12 మంది అందాల భామలు తమ అందచందాలను కేలండర్‌లో గుమ్మరించారని మీడియా 9 నిర్వాహకుడు మనోజ్ కుమార్ కటోకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీ సిమెంట్స్ డీఎం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు.. కేబుల్ వైర్లు దగ్ధం



కేబుల్ వైర్లు అంటుకోవడంతో భారీగా ఎగిసిపడుతున్న మంటలు

పంజగుట్ట: ఎర్రమంజిల్, రామకృష్ణానగర్‌లో మంగళవారం రాత్రి విద్యుత్ స్తంభంపై ఉన్న కేబుల్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వచ్చి కాలిపోయాయి. కేబుల్ వైర్లు పెద్ద ఎత్తున స్తంభంపై ఉంచడంతో విద్యుత్ వైర్లు ఒకదానికి మరొకటి తాకి షార్ట్ సర్క్యూట్ ఏర్పడిందని స్థానికులు తెలిపారు. కేబుల్ వైర్లు కాలిపోతున్న సమయంలో భారీగా మంటలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. ప్రమాదం కారణంగా స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కేబుల్ వైర్లు తొలగించాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని కాలనీవాసులు ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన బీసీ దళ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న క్రమంలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి బీజేపీ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని బీసీల పట్ల ఉన్న ప్రేమను నిరూపించుకోవాలన్నారు.

కమ్యూనిటీ హాల్లో వసతుల కల్పనకు కృషి



సూర్యకళ

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సహకారంతో షాహీద్ తుర్రెబాజ్ కమ్యూనిటీ హాల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని నూతన అధ్యక్షురాలు ఆర్.సూర్యకళ తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఆమె మాట్లాడుతూ, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో వివాహాది శుభకార్యాలు చేసుకోలేని పేదలకు తుర్రెబాజ్ కమ్యూనిటీ హాల్‌ను అన్ని సౌకర్యాలతో అందుబాటులో ఉంచుతామన్నారు. కమ్యూనిటీ హాల్లో మరిన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే గోపీనాథ్‌ను కమిటీ సభ్యులంతా కలిసి విన్నవించామన్నారు. హాల్లో అదనపు ఫర్నిచర్, ఇతర సామగ్రి ఏర్పాటు కోసం త్వరలోనే డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని సూర్యకళ చెప్పారు.

సందడిగా 'బంధు మిలన్'

కంటోన్మెంట్: సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన ఒడియా వాసుల 'బంధు మిలన్ సందడిగా సాగింది. తిరుమలగిరిలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 1ఈఎంఈ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ సురేశ్ అతిథిగా హాజరయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఒడియా పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఓపీడబ్ల్యూఏ) వ్యవస్థాపక అధ్యక్షులు రష్మి రంజన్ మహాపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నగరవ్యాప్తంగా ఉన్న ఒడియా వాసులు సుమారు 500 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఓపీడబ్ల్యూఏ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ బ్రిగేడియర్ అభిమాన్యు రౌత్, ఐబీ లెంకా, బాదల్ నాయక్, శరత్ సావెన్, విభూతి ప్రధాన్, రోషన్, సురేశ్ మహామాత్ర, సామల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే ధ్యేయం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీఎంసీ రమేశ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ సర్కిల్– 9 డీఎంసీ రమేశ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. యూసుఫ్‌గూడలోని వార్డు కార్యాలయంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమంపై డీఎంసీ, కార్పొరేటర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంసీ రమేశ్ మాట్లాడుతూ, తెలంగాణ సంపూర్ణ అంధత్వ రహిత రాష్ట్రంగా మారాలన్న ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు 2వ విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రహమత్‌నగర్ డివిజన్ కార్మిక నగర్ కమ్యూనిటీ హాల్లో కంటి వైద్య శిబిరాన్ని అధికారికంగా ప్రారంభిస్తామని డీఎంసీ అన్నారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ, కంటి వెలుగు కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలను బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇంజినీరింగ్ ఈఈ రాజ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలను ప్రతిఘటించాలి

సీపీఐ నేత ఈటీ నరసింహ పిలుపు



అలైద గువేరా, ఏస్టిఫీనాల కటౌట్‌లను ఆవిష్కరిస్తున్న ఈటీ నరసింహ తదితరులు

హిమాయత్‌నగర్: క్యూబాపై అమెరికా ఆంక్షలు, చట్టవిరుద్ధ, అమానవీయ ఆంక్షలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ పిలుపునిచ్చారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే క్యూబా సంఘీభావ సభకు ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్న విప్లవ యోధుడు చేగువేరా కూతురు డాక్టర్ అలైద గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఏస్టిఫీనా గువేరాల స్వాగత కటౌట్లను హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటీ నరసింహ మాట్లాడుతూ.. అమెరికా క్యూబాకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం, అంతర్గత విధ్వంసం సృష్టించడం దారుణమన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ భవిష్యత్ తరాలకు సోషలిస్ట్ వారసత్వాన్ని అందించేందుకు కృషి చేస్తున్న క్యూబాను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీఎస్ బోస్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్. ఛాయాదేవి, బి.స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లే కంటి శ్రీకాంత్, నేతలు బొడ్డుపల్లి కిషన్, కంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

లిబర్టీ: దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. దోపిడీ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తేనే రోహిత్ వేములకు నిజమైన నివాళులర్పించిన వారమవుతామన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధన విద్యార్థి అంబేడ్కర్ పోరాట వారసుడు రోహిత్ వేముల 8వ వర్ధంతి సందర్భంగా మంగళవారం లిబర్టీ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కృష్ణస్వరూప్ మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆలోచన విధానం స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాతంత్ర హక్కుల కోసం ఉద్యమిస్తున్న రోహిత్ వేముల ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ శక్తులు మూకుమ్మడిగా చేసిన దాడిలో మృతి చెందాడన్నారు. కార్యక్రమంలో ఇటిక్యాల గణేశ్, సి.సుబ్బారావు, జై భాస్కర్ రావు, సీహెచ్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి


సనత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ పాండే పాత బోయిన్‌పల్లిలోని మల్లికార్జునకాలనీలో ఉంటున్నాడు. ఐదు రోజుల క్రితం అతని భార్య మగబిడ్డకు జన్మనివ్వడంతో 15వ తేదీన అతని స్నేహితుడు రాజా బిడ్డను చూడటానికి వచ్చాడు. అదే రోజు రాత్రి రాజా తిరిగి వెళ్తేందుకు బయలుదేరగా రాజ్‌కుమార్ పాండే సోదరుడు మనోజ్‌కుమార్ పాండే (29) అతడిని ద్విచక్ర వాహనంపై దించేందుకు వెళ్లాడు. బాలంరాయి సమీపంలోని స్కోడా షోరూం వద్ద వీరి బైక్ బారికేడ్లను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. మనోజ్‌కుమార్ పాండే తీవ్రంగా గాయపడగా గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

బొగ్గు కొరతతోనే

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ బంద్

పీజీసీఎల్ లైన్లను వేరే విద్యుత్ కొనుగోళ్లకు వాడుకుంటున్నాం


- బకాయిలు, ధరల వివాదంతో విద్యుత్ ఆగలేదు
- 'సాక్షి' కథనంపై ట్రాన్స్‌కో యాజమాన్యం వివరణ
- బకాయిలు, వివాదాలతోనే ఆగినట్టు ఈఆర్సీకి డిస్కంల వివరణ
- పరస్పర విరుద్ధ కారణాలు తెలిపిన తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కంలు
- బకాయిలు చెల్లిస్తేనే సరఫరా పునరుద్ధరిస్తామన్న ఛత్తీస్‌గఢ్



సాక్షి, హైదరాబాద్: బొగ్గు లభ్యత లేకనే ఛత్తీస్‌గఢ్ తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయడం లేదని తెలంగాణ ట్రాన్స్‌కో స్పష్టం చేసింది. బిల్లుల బకాయిలు చెల్లించక పోవడంతో సరఫరాను నిలుపుదల చేయడంలో వాస్తవం లేదని పేర్కొంది. మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు కొరత నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించింది. 'రాష్ట్రానికి ఛత్తీస్‌గఢ్ కరెంట్ బంద్' శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ట్రాన్స్‌కో యాజమాన్యం వివరణ ఇచ్చింది. 'సొంత అవసరాల బొగ్గు గని (క్యాప్టివ్ మైన్) నుంచి విద్యుత్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో అడ్డంకుల నేపథ్యంలో రోడ్డుతోపాటు రైలు మార్గాన్ని ఛత్తీస్‌గఢ్ వినియోగిస్తోంది. ఇతర వనరుల నుంచి కూడా బొగ్గు కొరతను ఎదుర్కొంటోంది. ఆలస్యంగానైనా మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రానికి కాప్టివ్ గని కేటాయింపులు జరగడంతో బొగ్గు లభ్యత చేకూరడంతోపాటు విద్యుత్ వేరియబుల్ ధర తగ్గింపునకు దోహదపడింది. దీంతో అధిక ధరలతో విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను నివారించినట్టు అయింది. తెలంగాణ ఈఆర్సీ ఉత్తర్వులకు లోబడి ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించాల్సిన బకాయిలను అంగీకరించడం జరిగింది. లేట్ పేమెంట్ సర్‌చార్జీ రూల్స్–2022 కింద ఆర్‌ఈసీ/పీఎఫ్‌సీల ద్వారా పాత బకాయిల చెల్లింపునకు ఇప్పటికే ఏర్పాట్లు చేశాం. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ స్థిర ధర (ఫిక్స్‌డ్ కాస్ట్) మినహా టారిఫ్ విషయంలో ఇతర తీవ్రమైన వివాదాలేమీ లేవు. ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఆమోదించిన స్థిర ధరను ఢిల్లీలోని అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో సవాల్ చేశాం. ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఆమోదించిన స్థిర చార్జీలను పరిగణనలోకి తీసుకున్నా, షార్ట్ టర్మ్ మార్కెట్, ఎక్స్ఛేంజీల విద్యుత్ ధరలతో పోటీపడేలానే ఉంది. విద్యుత్ ధరలను ఛత్తీస్‌గఢ్ అసాధరణంగా పెంచేసిందనడం సరికాదు. ఎందుకంటే, ఈఆర్సీ ఖరారు చేసిన టారిఫ్‌ను మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది'అని ట్రాన్స్‌కో తెలిపింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా లేకున్నా, అందుకోసం బుక్ చేసుకున్న ట్రాన్స్‌మిషన్ లైన్లకు చార్జీలు చెల్లిస్తున్న అంశంపై సైతం ట్రాన్స్‌కో వివరణ ఇచ్చింది. పవర్ ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్లతోపాటు పవర్ బ్యాంకింగ్ అవసరాలకు ఈ లైన్లను వాడుకుంటున్నట్టు తెలిపింది.

ట్రాన్స్‌కో, డిస్కంల భిన్న వాదనలు

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై తెలంగాణ ఈఆర్సీకి రాష్ట్ర డిస్కంలు ఇచ్చిన వివరాలు, 'సాక్షి' కథనంపై తెలంగాణ ట్రాన్స్‌కో ఇచ్చిన వివరణ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. బొగ్గు కొరత వల్లే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా ఆగినట్టు ఈఆర్సీకి ఇచ్చిన వివరణలో డిస్కంలు ఎక్కడా పేర్కొనలేదు. ఛత్తీస్‌గఢ్‌కి ఇవ్వాల్సిన బిల్లుల బకాయిలతోపాటు మార్వా విద్యుత్ కేంద్రం పెట్టుబడి వ్యయంపై వివాదంతోనే సరఫరా జరగడం లేదని తెలిపాయి.



Reply:


- The actual Power Purchased by TSDISCOMs from CSPDCL for FY 2021-22 is 1631 MU (availability of 19%). For H1 of FY 2022-23 the actual Power Purchased is zero from CSPDCL due to the reasons mentioned below. However for H2 of FY 2022-23 the estimated power purchase from CSPDCL is 2713 MU (under the assumption that the disputes will be resolved by then). Hence for the FY 2022-23 the overall Power purchase is estimated at 2713MU (availability of 31%).
- The Availability declared by CSPDCL to TSDISCOMs for FY 2020-21 is 39.67% with Fixed Charges claim of Rs.828.13Crores, for FY 2021-22 is 19.71% with Fixed Charges claim of Rs. 394.98Crores.

బిల్లుల బకాయిలు, వివాదాలతోనే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలంగాణ డిస్కంలు రాష్ట్ర ఈఆర్సీకి సమర్పించిన డాక్యుమెంట్

బకాయిలిచ్చే వరకు సరఫరా చేయం: ఛత్తీస్‌గఢ్



'మాకు బకాయిపడిన దీర్ఘకాలిక బకాయిలను చెల్లించేవరకు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయం. తెలంగాణకు 2023–24లో ఎలాంటి విద్యుత్ సరఫరాను పరిగణనలోకి తీసుకోబోం' అని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (సీఎస్‌పీడీసీఎల్).. ఆ రాష్ట్ర ఈఆర్సీకి తెలియజేసింది. ఈ విషయాన్ని తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)–2023–24లో పొందుపర్చింది.



CSPDCL has not considered any sale of the power of Marwa to Telangana at state periphery for FY 2023-24 as no power is supplied to Telangana state unless the state shall pay the long pending dues to CSPDCL.

దీర్ఘ కాలిక బకాయిలు చెల్లిస్తేనే తెలంగాణకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఛత్తీస్‌గఢ్ డిస్కం ఆ రాష్ట్ర ఈఆర్సీకి సమర్పించిన ఏఆర్ఆర్ నివేదికలో పేర్కొన్న అంశాన్ని ఇందులో చూడవచ్చు.

దావోస్ సదస్సుపై టీడీపీది దుష్ప్రచారం

- సదస్సుకు హాజరు కావాలని నవంబర్ 25నే ఆహ్వానం అందింది
- విశాఖలో పెట్టుబడుల సదస్సు ఏర్పాట్లు ఉండటం వల్లే వెళ్లలేకపోయాం
- ఏపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆహ్వానం అందలేదంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తీవ్రంగా ఖండించారు. టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. దావోస్ సదస్సులో పాల్గొనాలంటూ నవంబర్ 25నే సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానం అందిందన్నారు. దీనికి సంబంధించిన లేఖ ప్రతిని మంత్రి మీడియా ముందుంచారు. గతేడాది దావోస్ సదస్సుకు హాజరైన సీఎం జగన్ రాష్ట్రంలో వైద్య రంగంలో తెస్తున్న సంస్కరణల గురించి ప్రపంచ దేశాలకు తెలిసేలా చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ గురించి వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో సీఎం వివరించిన తీరుకు ప్రపంచ దేశాల పారిశ్రామికవేత్తలు ముగ్ధులయ్యారని చెప్పారు. మార్చిలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించాలన్న కృతనిశ్చయంతో సీఎం వైఎస్ జగన్ ఉన్నారన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉండటంతోనే దావోస్ సదస్సుకు వెళ్లలేదని స్పష్టం చేశారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పార్టీ ఆదేశిస్తే పవన్‌పై పోటీచేస్తా

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో విజయం సాధిస్తుంది
- ఏపీ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ



నగరి(చిత్తూరు జిల్లా): వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశిస్తే పవన్‌కల్యాణ్‌పై పోటీచేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ చెప్పారు. అదే సమయంలో పార్టీ నిర్ణయిస్తే 175 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచి అయినా పోటీకి తాను సిద్ధమని తెలిపారు. నగరి పట్టణంలో మంగళవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలీ మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుపొందడం ఖాయమన్నారు. పవన్‌కల్యాణ్ 'రణస్థలం యువశక్తి' సభలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సాధారణమని అన్నారు. సినిమాలు వేరు, రాజకీయాలు వేరని పేర్కొన్నారు. అయితే, ఎవరు మేలు చేస్తారో ప్రజలకు తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి రోజాను పవన్‌కల్యాణ్ అతి విలువైన డైమండ్‌తో పోల్చారన్నారు. తన సొంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందరికీ మంచిచేస్తున్న రోజమ్మ నిజంగా కోహినూర్ డైమండే అని అలీ అన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి'



సాక్షి, హైదరాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్యక్షులు విశ్వాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి తమ సమస్యలు వివరించారు. పింఛన్లు ప్రతి నెల 1 నుండి 15వ తేదీ మధ్య విడుదల అవుతున్నాయని, దీనివల్ల పింఛనుదారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లు విడుదలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం కొన్ని ఆస్పత్రుల్లో అమలు చేయడం లేదని, అందువల్ల తమ పెన్షన్ నుండి 1 శాతం తీసుకుని ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను వీలైనంత త్వరగా విడుదల చేయాలన్నారు.

22న నాగర్‌కర్నూల్‌లో

దళిత, గిరిజన ఆత్మగౌరవసభ

- హాజరుకానున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే
- నేడు సీఎస్‌ను కలవనున్న టీపీసీసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: మార్కండేయ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా తమ పార్టీకి చెందిన దళిత, గిరిజన నాయకులపై అధికార బీఆర్ఎస్ నేతల దాడిని నిరసిస్తూ ఈనెల 22న నాగర్‌కర్నూల్ కేంద్రంగా 'దళిత గిరిజన ఆత్మగౌరవ సభ' నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ సభకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో తెలంగాణలో పర్యటించనున్న ఆయన రాష్ట్ర ఇన్‌చార్జి హోదాలో ఈ సభకు తొలిసారి అతిథిగా రానున్నారు. కాగా, పంజగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలంటూ టీపీసీసీ బృందం బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి విజ్ఞప్తి చేయనుంది. పంజగుట్ట చౌరస్తా నుంచి తొలగించి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన అంబేడ్కర్ విగ్రహాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌కు అప్పగించాలంటూ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆ విగ్రహాన్ని పంజగుట్ట చౌరస్తాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరనుంది. ఇందుకోసం శాంతికుమారి అపాయింట్‌మెంట్ కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే పార్టీ తరఫున లేఖ రాశారు. సీఎస్ అపాయింట్‌మెంట్ లభిస్తే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సీఎస్‌ను కలిసి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, ఎమ్మెల్యేలకు ఎర కేసుతోపాటు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడాన్ని కూడా విచారించాలని కోరనుంది.



గొంతుపై కాలుపెట్టి చంపే యత్నం చేశారు: నాగం

మార్కండేయ ప్రాజెక్టు సందర్శన కోసం వెళ్లిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తల గొంతుపై కాలు పెట్టి చంపేందుకు యత్నించారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మల్లురవితో కలిసి ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దళిత, గిరిజన నేతలపై దాడులు చేయడమేకాక తిరిగి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో 'రెరా'కు పూర్తిస్థాయి కమిటీ

చైర్‌పర్సన్, సభ్యుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

TS RERA

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి లావాదేవీలను క్రమబద్ధీకరించేందుకు ఏర్పాటైన 'రెరా'కు త్వరలో పూర్తిస్థాయి కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగున్నరేళ్ల క్రితం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో న్యాయబద్ధమైన 'రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ' (రెరా)లను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి హోదా స్థాయి అధికారి చైర్మన్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇద్దరు పూర్తిస్థాయి సభ్యులు ఉంటారు. అయితే 'రెరా'కు ఇప్పటివరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రెరాకు వచ్చే దరఖాస్తుల పరిశీలన, అనుమతులు అన్నీ ఆయన నేతృత్వంలోనే సాగేవి. కాగా రియల్ వెంచర్లు, ఫ్లాట్ల నిర్మాణంలో 'రెరా' నిబంధనలకు తిలోదకాలిచ్చి పలు సంస్థలు, రియల్ వ్యాపారులు దందా సాగిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో 'రెరా'కు పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ పురపాలక శాఖ ఆసక్తి, అర్హత గల వారి నుంచి చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల నియామకానికి దరఖాస్తును ఆహ్వానించింది. ఫిబ్రవరి 17వ తేదీలోగా దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని కోరింది. రెరా వెబ్‌సైట్, తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తుదారులకు అవసరమైన అర్హతలు, వేతనం వివరాలన్నీ ఉన్నాయి.

నగర వార్తలు

ఉమ్రా బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 80 మంది యాత్రికులు మంగళవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరారు. అల్‌మిజాన్ సంస్థ ఆధ్వర్యంలో మక్కా, మదీనా, ఉమ్రా యాత్రకు బయలుదేరిన యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు. యాత్ర నిర్వహణను మహ్మద్ ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి కంటి వెలుగు

పరీక్షల కోసం ఆధార్ తప్పనిసరి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో రెండో విడత కంటి వెలుగు శిబిరాలు గురువారం నుంచి పనిచేయనున్నాయి. సీఎం చేతులమీదుగా బుధవారం రెండో విడత కార్యక్రమం ప్రారంభంకానుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలో సుమారు 327 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు వంద రోజుల్లో దాదాపు 70 లక్షల మందికి పైగా ప్రాథమిక పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఒక్కో శిబిరంలో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది వైద్య సిబ్బంది పనిచేయనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ప్రతి శిబిరంలో సుమారు 400 మంది వరకు స్క్రీనింగ్ నిర్వహిస్తారు. శిబిరానికి హాజరయ్యే వారికి ఆధార్ కార్డు తప్పనిసరి.

- హైదరాబాద్ జిల్లా పరిధిలో 91 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 152 స్క్రీనింగ్ కేంద్రాల ద్వారా 45 లక్షల 38 వేల 821 మంది స్క్రీనింగ్ చేస్తారు.
- మేడ్చల్ జిల్లా పరిధిలో మొత్తం 75 స్క్రీనింగ్ కేంద్రాల ద్వారా 13 లక్షల మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు.
- రంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారు 80 కేంద్రాల్లో 12 లక్షల మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించనున్నారు.

పేరుకే.. పెనాల్టీ..!

రూ.971 కోట్ల పనుల్లో పెనాల్టీలు రూ.18 లక్షలే..

- సీఆర్ఎంపీ ఏజెన్సీలకు విధించిన జీహెచ్ఎంసీ
- చార్మినార్ జోన్‌లో రూపాయి పెనాల్టీ లేదు..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అతుకులు గతుకుల రోడ్లపై ప్రయాణంతో ప్రజల ఇబ్బందులు తప్పించేందుకు సమగ్ర రోడ్డు నిర్వహణ పనుల్ని(సీఆర్ఎంపీ) ప్రధాన రహదారుల మార్గాల్లో ప్రైవేటు బడా కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పగించిన జీహెచ్ఎంసీ పనుల నాణ్యత లోపించిన చోట పెనాల్టీలు విధించింది. అయితే ఇప్పటి వరకు జరిగిన రూ.971.79 కోట్ల పనుల్లో రూ.18.24 లక్షల పెనాల్టీలు మాత్రమే విధించింది. అంటే.. రోడ్లు బాగానే ఉన్నాయన్న మాట. ఈ రోడ్డు నిర్వహణ పనుల్ని జీహెచ్ఎంసీ ఇంజినీర్లే చేసినప్పుడు ఏటా రూ.300 కోట్లకు పైగా రోడ్ల నిర్వహణకు ఖర్చు కావడంతోపాటు వర్షాలు వచ్చాయంటే పరిస్థితి మళ్లీ మొదటికొచ్చేది. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ ఆదేశాలతో సీఆర్ఎంపీని ఏర్పాటు చేసి పెద్ద ఏజెన్సీలకు పనులు అప్పగించారు. 2020 నుంచి ఈ నిర్వహణ పనులు జరుగుతున్నాయి. ఎల్లవేళలా రోడ్లు సాఫీ ప్రయాణానికి అనువుగా ఉండటం లక్ష్యం. తొలుత 709 కి.మీ.ల రోడ్లు మాత్రమే సీఆర్ఎంపీ కింద ఉండగా, గత సంవత్సరం మరో 102 కి.మీ. అప్పగించడంతో మొత్తం 811 కి.మీ.లకు పెరిగాయి. ఇప్పటి



వరకు 737 కి.మీ.ల మేర పనులు పూర్తయ్యాయి. ఈ మార్గాల్లో 1,13,305 గుంతలు పడగా వాటికి మరమ్మతులు చేశారు. 51 కి.మీ.ల మేర సెంట్రల్ మీడియన్లు దెబ్బతినగా బాగుచేశారు. 776 కి.మీ.ల మేర లేన్‌మార్కింగ్‌లు, 352 కి.మీ.ల పొడవునా కెర్బ్ పెయింటింగ్‌లు, 2,501 సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ మార్గాల్లో రోడ్డు కంటే ఎక్కువ ఎత్తున్న మ్యాన్‌హోల్స్‌ను సరిచేశారు. ఈ మార్గాలకు సంబంధించి ప్రజల నుంచి 2,255 ఫిర్యాదులు అందాయి. ఇప్పటి వరకు జరిగిన పనుల విలువ రూ.971.79 కోట్లు. మూడేళ్లలో రోడ్ల రీకార్పెటింగ్ పూర్తిచేయడంతోపాటు మరో రెండేళ్ల నిర్వహణ పనులు కూడా చేయాల్సిందిగా కాంట్రాక్టు ఒప్పందం. మొత్తం ఐదేళ్లకు వెరసి ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,839 కోట్లు.

చార్మినార్ జోన్‌లో పెనాల్టీలే లేవు..

రూ.971.79 కోట్ల పనులకు సంబంధించి విధించిన పెనాల్టీలు కేవలం రూ.18.24 లక్షలు కాగా, అందులోనూ చార్మినార్ జోన్‌లో ఒక్క రూపాయి కూడా పెనాల్టీ పడకపోవడం విశేషం. సికింద్రాబాద్ జోన్‌కు లక్ష రూపాయలు మాత్రమే పెనాల్టీ పడింది. మిగతా జోన్లను పరిశీలిస్తే ఎల్బీనగర్ జోన్‌కు రూ.7 లక్షలు, ఖైరతాబాద్ జోన్‌కు రూ.4.21 లక్షలు, శేరిలింగంపల్లి జోన్‌కు రూ.33 వేలు, కూకట్‌పల్లి జోన్‌కు రూ.5.70 లక్షలు పెనాల్టీలు విధించారు. అస్సలు పెనాల్టీలు వేయకుండా రోడ్లన్నీ బాగున్నాయంటే.. బాగుండదనుకున్నారో ఏమో కానీ మొత్తానికి ఈ పెనాల్టీలు విధించారు.

వంట నూనె గింజల ఉత్పత్తి పెంచాలి



నూనె గింజల పరిశోధనల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

- నగరంలో అంతర్జాతీయ వంటనూనెల సదస్సు
- దేశ విదేశాల నుంచి 300పైగా శాస్త్రవేత్తలు హాజరు

ఏజీవర్సిటీ: దేశంలో వంటనూనె గింజల ఉత్పత్తిని మూడింతలు పెంచాల్సిన అవసరం ఉందని ప్రపంచవ్యాప్తంగా ప్రధానంగా పామాయిల్, సోయా, ఆవాలు, పొద్దుతిరుగుడు నూనె వాడకం పెరుగుతోందని, దేశంలో వంట నూనెల కొరత అధికంగా ఉందని, ఏడాదికి 1.57 లక్షల కోట్లు వంటనూనెల దిగుమతిపై ఖర్చు పెట్టాల్సి వస్తోందని, వంట నూనె గింజల ఉత్పత్తి భారీగా పెంచాల్సిన అవసరం ఉందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆయిల్ రీసెర్చ్(ఐసీఎఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగళ రాయ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వంట నూనెల సదస్సును మంగళవారం ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు జరిగే సదస్సులో దేశ, విదేశాల నుంచి 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ నూనె గింజల పంటల ఉత్పత్తిలో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడి సాధించిన 24 మంది అభ్యుదయ రైతులను సన్మానించారు. నూనె గింజల పరిశోధనలకు గుర్తింపుగా 50 మందికి ఐసీఏఆర్ అవార్డులు అందజేశారు. నూనె గింజల పరిశోధనలపై రాసిన మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యానవన విశ్వవిద్యాలయం వీసీ నీరజా ప్రభాకర్, కర్ణాటక పార్లమెంట్ సభ్యుడు సాహెబ్ శంకర్, మానేష్, సుజాత పాల్గొన్నారు.

వ్యాపారం పెంచడమే లక్ష్యం



- ఇండియా–కెనడా ద్వైపాక్షిక ప్రయోజనాలపై సదస్సు

నాంపల్లి: ఇండియా–కెనడా దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపార అవకాశాలపై ఐసీసీసీ, ఎఫ్‌టీసీసీఐ సంస్థల సంయుక్త నిర్వహణలో మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ సురానా ఆడిటోరియంలో ముఖాముఖి సమావేశం జరిగింది. ఇండో కెనడా ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీసీ) ఏడుగురు సభ్యుల కెనడియన్ ప్రతినిధి బృందం అధ్యక్షుడు అరవింద్ భరద్వాజ్ నేతృత్వంలో సమావేశం జరిగింది. సౌత్ ఇండియన్ కో ఆర్డినేటర్ సూర్య బెజవాడ, భారత కో ఆర్డినేటర్ త్రిభువన్ ఆనంద్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు మీలా జయదేవ్, ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ బిజినెస్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ చక్రవర్తి, ఎఫ్‌టీసీసీఐ సీఈఓ ఖ్యాతి నరేవాణే, డైరెక్టర్ ఆర్.కులకర్ణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద్ భరద్వాజ్ మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య వాణిజ్యం కేవలం నాలుగు బిలియన్ డాలర్లు మాత్రమేనని, ఇది ఏ పరిమితిలో చూసినా తక్కువేనని అన్నారు. తమ సొంత సమస్యల కారణంగా చైనా కూడా నెమ్మదిగా వెళ్తోందని, కాంబోడియా, బంగ్లాదేశ్, హాంకాంగ్, తైవాన్ ద్వైపాక్షిక వాణిజ్యపరంగా వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం, సహకారం కోసం వివిధ ప్రాంతాలను అన్వేషించడం, వ్యాపార సంబంధాలతో వ్యాపారాన్ని పెంచడమే తమ లక్ష్యమని తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు సుదీర్ఘకాలంగా సాగుతున్నట్లు వివరించారు. కెనడాతో మన దౌత్య సంబంధాలు 1947లో ప్రారంభమయ్యాయని, కెనడా ఇంధన వనరుల్లో అగ్రగామిగా ఉందన్నారు.

దారి దీపాలు

పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: దారి దీపాలు సంపుటి పుస్తకావిష్కరణ బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ భవన్‌లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాహిత్య రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ విశేష కృషి చేశారన్నారు. సాహిత్యంపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధతో కొన్ని వేల పుస్తకాలు చదివారన్నారు. రాష్ట్రంలో జన్మించిన కవులు దాశరథి, రావి నారాయణరెడ్డి, సురవరం ఇంకా ఎందరో ప్రపంచ ఖ్యాతి పొందారన్నారు. మాజీ కేంద్రమంత్రి దివంగత నేత జైపాల్ రెడ్డిగారి కుమార్తె అరుణకు మొదటి సంపుటి అందజేశారు. ప్రస్తుత పరిస్థితులు అర్థం చేసుకుని ప్రజలను చైతన్యపరిచే, రాష్ట్రానికి మేలు చేసే రచనలు చేయాలని కవులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ప్రముఖ రచయిత అమ్మంగి వేణుగోపాల్, ప్రముఖ విద్యావేత్తలు ఎంవీ.గోనరెడ్డి, ఎం.మధుసూదన్‌రెడ్డి, పోరెడ్డి రంగయ్య, గంట జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంజగుట్ట కూడలిలో..

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న గద్దర్

పంజగుట్ట: పంజగుట్ట కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తే సరి, లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలను ఐక్యం చేసి విగ్రహం ఏర్పాటు చేసుకుందామని రాజకీయ, ప్రజా, కుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్‌లో విగ్రహం ఉంచరాదని, వెంటనే విగ్రహం అప్పగించాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో సీనియర్ దళిత నాయకులు జేబీ.రాజు అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి మల్లురవి, కోదండరెడ్డి, మాజీ ఎంపీ అజీజ్ పాషా, ప్రజా యుద్ధనౌక గద్దర్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఆప్ నేత ఇందిరా శోభన్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, రాజు ఉస్తాద్, మహేశ్వర్ రాజ్, వినోద్ హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ జయంతికి ఒక్కరోజు ముందు పంజగుట్ట కూడలిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మున్సిపల్ చెత్త వ్యాన్‌లో విరగొట్టి దారుణంగా తరలించారని, రాజ్యాంగ నిర్మాతకు ఘోర అపకారం ఎవరూ చేయనివిధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి అంబేడ్కర్ పేరుపెట్టి, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టి దళితుల ఓట్లు అడిగేందుకు కేసీఆర్ యత్నిస్తున్నాడని, కానీ మన మనోభావాలు దెబ్బతీసిన పంజగుట్టలో అంబేడ్కర్ విగ్రహం పెట్టిన తర్వాతే ఓట్లు అడిగే హక్కు వస్తుందన్నారు. విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోతే వేలాదిగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుందామని పిలుపునిచ్చారు.

డబ్ల్యూసీసీ డైరెక్టర్‌గా డా.అజయ్ అగర్వాల్



సాక్షి, సిటీబ్యూరో: వరల్డ్ కమ్యూనికేటర్స్ కౌన్సిల్(డబ్ల్యూసీసీ)కు నూతన డైరెక్టర్ గవర్నింగ్ కౌన్సిల్‌గా నగరానికి చెందిన డాక్టర్ అజయ్ అగర్వాల్ నియమితులయ్యారు. డబ్ల్యూసీసీ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా అజయ్ అగర్వాల్ నియామకాన్ని పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎమిరిటస్ వ్యవస్థాపకుడు ఎంబీ జయరామ్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం ఆయన ఇంటర్నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్‌కు జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అంతేగాకుండా దుబాయ్, శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాటు తదితర దేశాల్లోని అధ్యాయాలకు సంబంధించిన ప్రజా సంబంధ వ్యవహారాలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు, మాస్ కమ్యూనికేషన్ రంగంలోని విద్యార్థులకు కమ్యూనికేషన్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నాగోల్ మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్–831 వద్ద పడి మృతి చెంది ఉన్నాడనే సమాచారం మేరకు ఉప్పల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
18-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	563	60,656
నిఫ్టీ ▲	158	18,053

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,078	▽	4
డోజోన్స్	33,951	▽	351
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,851	▽	9
డాక్స్	15,187	▲	53
షాంఘై	3,224	▽	3
నికాయ్	26,139	▲	316

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,752	▽	131
బంగారం (99.5 స్వచ్ఛత)	56,525	▽	130
వెండి (కిలో)	68,661	▽	506

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.03	82.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	98.16	101.50
€	యూరో	ఒకటి	87.10	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.51	64.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.94	58.36
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.92	62.93
SAR	సౌదీ రియాల్	ఖామన్‌టీ	20.81	22.48
UAE D	యూఏఈ దిర్హామ్	ఖామన్‌టీ	21.36	23.16
¥	చైనా యువాన్	ఖామన్‌టీ	13.01	10.94

134 నగరాల్లో జియో 5జీ

- తెలుగు రాష్ట్రాల్లో 14 కేంద్రాలు
- డిసెంబర్‌కల్లా దేశవ్యాప్తంగా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో 5జీ సేవలను భారత్‌లో క్రమంగా విస్తరిస్తోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, కాకినాడ, తెలంగాణలో నిజామాబాద్, ఖమ్మంతో సహా మొత్తం ఏడు రాష్ట్రాల్లోని 16 నగరాల్లో సేవలను పరిచయం చేసింది. ఈ నగరాల్లో ప్రస్తుతం జియో మాత్రమే 5జీ సేవలను అందిస్తోంది. పర్యాటకం, వాణిజ్యం, విద్య పరంగా ఈ కేంద్రాలు ప్రధానమైనవని కంపెనీ తెలిపింది. నూతన నగరాల చేరికతో తెలుగు రాష్ట్రాల్లో జియో సేవలు అందుకుంటున్న నగరాల సంఖ్య 14కు పెరిగింది. జియో వెల్కమ్ ఆఫర్ కింద కస్టమర్లు అపరిమిత డేటాను 1 జీబీపీఎస్ కంటే అధిక స్పీడ్‌తో ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ఎంజాయ్ చేయవచ్చు.

డిసెంబర్ చివరినాటికి..

కొత్త కేంద్రాలతో కలిపి భారత్‌లో రిలయన్స్ జియో 5జీ సర్వీసులున్న నగరాలు, పట్టణాల సంఖ్య 134కు చేరుకుంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ, తిరుమల, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, ఏలూరు, తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లో జియో వినియోగదార్లు నూతనతరం టెలికం సేవలను వినియోగించుకుంటున్నారు. దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ చివరినాటికి 5జీ సేవలను మారుమూల పల్లెలకూ చేర్చాలని రిలయన్స్ జియో కృతనిశ్చయంతో ఉంది.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-1-2023	
విశాఖ	575-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	567-00
విజయవాడ	567-00
రిటైల్ ధర (డజను)	84.00
17-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

2022లో చైనా జీడీపీ 3 శాతమే!

- 50 ఏళ్లలో రెండో కనిష్ట స్థాయి
- కరోనా సవాళ్లు, రియల్టీ కష్టాలు కారణం

బీజింగ్: కరోనా తెచ్చిపెట్టిన కష్టాలు, రియల్ ఎస్టేట్ మార్కెట్ దెబ్బతినడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. అమెరికా తర్వాత ప్రపంచ రెండవ అతిపెద్ద ఎకానమీ 2022లో కేవలం 3 శాతం పురోగతి సాధించింది. మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, వార్షిక జీడీపీ విలువ 121.02 ట్రిలియన్ యువాన్ (17.94 ట్రిలియన్ డాలర్లు). 2021 విలువతో (114.37 ట్రిలియన్ యువాన్‌లు) పోలిస్తే ఈ గణాంకాలు కేవలం 3 శాతం అధికం. కనీసం 5.5 శాతం వృద్ధి నమోదవుతుందన్న అంచనాలకన్నా... గణాంకాలు తగ్గినట్లు నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటస్టిక్స్ (ఎన్‌బీఎస్) పేర్కొంది. 1974లో



చైనా జీడీపీ వృద్ధి రేటు 2.3 శాతం. అటు తర్వాత ఈ స్థాయి వృద్ధి నమోదుకావడం ఇదే తొలిసారి. అమెరికా డాలర్లతో పోల్చితే జీడీపీ విలువ 2021లో 18 ట్రిలియన్ డాలర్లుకాగా, తాజాగా 17.94 ట్రిలియన్ డాలర్లకు తగ్గడం గమనార్హం. డాలర్‌లో చైనా కరెన్సీ ఆర్‌ఎంబీ బలహీనపడ్డమే దీనికి కారణం. ఎన్‌బీఎస్ డేటా ప్రకారం, చైనా జాబ్ మార్కెట్ 2022లో స్థిరంగా ఉంది. పట్టణ వార్షిక ఉపాధి కల్పనా లక్ష్యం 11 మిలియన్‌లుకాగా, 12.06 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృష్టి జరిగింది. 2021లో చైనా ఎకానమీ వృద్ధి రేటు 8.4 శాతం.

సాగర్ సిమెంట్స్ చేతికి ఆంధ్రా సిమెంట్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రుణ భారంతో ఉన్న ఆంధ్రా సిమెంట్స్ ఇక సాగర్ సిమెంట్స్ పరం కానుంది. ఈ మేరకు విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచింది. జేపీ గ్రూప్ కంపెనీ అయిన ఆంధ్రా సిమెంట్స్ ప్రస్తుతం కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో ఉంది. సాగర్ సిమెంట్స్ దాఖలు చేసిన పరిష్కార ప్రణాళికకు అనుకూలంగా ఆంధ్రా సిమెంట్స్‌కు చెందిన కమిటీ ఆఫ్ క్రెడిటార్స్ (సీవోసీ) మెజారిటీతో ఓటు



వేసింది. సాగర్ సిమెంట్స్ ప్రణాళికను సీవోసీ ఆమోదించింది. పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్, సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ పిటిషన్ ఆధారంగా ఆంధ్రా సిమెంట్స్‌పై దివాలా ప్రక్రియను ప్రారంభించాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ గతేడాది ఏప్రిల్‌లో ఆదేశించింది. ఆంధ్రా సిమెంట్స్‌కు దాచేపల్లి సమీపంలో, అలాగే విశాఖపట్నం వద్ద ఒక్కో ప్లాంటు ఉంది.

మార్కెట్ బౌన్స్‌బ్యాక్

- సెన్సెక్స్ 563 పాయింట్లు అప్
- నిఫ్టీ 158 పాయింట్లు జూమ్
- 60,656- 18,053 వద్ద ముగింపు
- ఎఫ్‌ఎంసీజీ, ఆయిల్, రియల్టీ ప్లస్



ముంబై: ముందురోజు నష్టాల నుంచి దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. సెన్సెక్స్ 563 పాయింట్లు జంప్‌చేసి 60,656 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 158 పాయింట్లు ఎగసి 18,053 వద్ద ముగిసింది. ప్రధానంగా ఇండెక్స్ హెవీవెయిట్స్‌కు డిమాండ్ పెరగడంతో మార్కెట్లు ప్రస్తావించదగ్గ స్థాయిలో లాభపడ్డాయి. ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు సైతం సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐటీ, బ్యాంకింగ్ సంస్థలు పటిష్ట ఫలితాలు సాధిస్తుండటంతో ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం లభించినట్లు విశ్లేషించారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 60,704- 60,072 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఈ బాటలో నిఫ్టీ 18,072-17,887 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది.

పీఎస్‌యూ బ్యాంక్స్ డీలా

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఆయిల్, ఐటీ, ఆటో రంగాలు 1.2-0.6 శాతం మధ్య పుంజుకున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు 2 శాతం పతనమయ్యాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఎల్‌అండ్‌టీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఆర్‌ఐఎల్, బ్రిటానియా, అల్ట్రాటెక్, మారుతీ 3.7-1.2 శాతం మధ్య ఎగశాయి. అయితే ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్, ఇండస్‌ఇండ్, విప్రో, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ 1.6-0.4 శాతం మధ్య నీరసించాయి.

రూపాయి వీక్

డాలరుతో మారకంలో రూపాయి 12 పైసలు క్షీణించింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 81.70 వద్ద ముగిసింది. సోమవారం ముగింపు 81.58కాగా.. మంగళవారం(17న) ట్రేడింగ్‌లో 81.79 వద్ద ప్రారంభమైంది. తదుపరి 81.89 వరకూ నీరసించింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.2 శాతం పుంజుకుని 102.4కు బలపడటం దేశీ కరెన్సీని దెబ్బ తీసినట్లు ఫారెక్స్ వర్గాలు తెలియజేశాయి. కాగా.. మంగళవారం ట్రేడింగ్‌లో చిన్న షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్‌ఈలో ట్రేడైన షేర్లలో 1,890 నష్టపోగా, 1,621 లాభపడ్డాయి. గత రెండు రోజుల్లో రూ. 3,173 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన ఎఫ్‌పీఐలు తాజాగా రూ. 211 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!

స్టాక్ హైలైట్స్

- హైదరాబాద్‌లో వాణిజ్య నిర్మాణాలకుగాను రూ. 1,000-2,500 కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్లు వెల్లడించడంతో ఎల్‌అండ్‌టీ కౌంటర్ 4 శాతం జంప్‌చేసింది. రూ. 2217 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 2,218 వద్ద సరికొత్త గరిష్టాన్ని చేరింది.
- నేడు(18న) వాటాదారుల అత్యవసర సమావేశం(ఈజీఎం) నిర్వహించనున్న నేపథ్యంలో స్పెషాలిటీ రెస్టారెంట్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 9 శాతంపైగా జంప్‌చేసింది. రూ. 273 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సరికొత్త గరిష్టం రూ. 283 వరకూ దూసుకెళ్లింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభం జూమ్

క్యూ3లో రూ. 775 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 775 కోట్లను తాకింది. నికర వడ్డీ ఆదాయం, మొండి రుణాలు తగ్గడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 325 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 3,893 కోట్ల నుంచి రూ. 4,770 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 30% జంప్ చేసి రూ. 1,980 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 1,527 కోట్ల వడ్డీ ఆదాయం నమోదైంది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 4.73% నుంచి 2.94%కి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 1.24% నుంచి 0.47%కి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 14.85% నుంచి 17.53%కి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో బీవోఎం షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం క్షీణించి రూ. 32.5 వద్ద ముగిసింది.

బీవోఐ లాభం అప్

క్యూ3లో రూ. 1,151 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 12 శాతం వృద్ధితో రూ. 1,151 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 1,027 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,211 కోట్ల నుంచి రూ. 14,160 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 64 శాతం జంప్‌చేసి రూ. 5,596 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 3,408 కోట్ల వడ్డీ ఆదాయం నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 1.21 శాతం మెరుగై 3.72 శాతాన్ని తాకాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 10.46 శాతం నుంచి 7.66 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 2.66% నుంచి 1.61%కి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 15.6%కి చేరింది.

ఫలితాల నేపథ్యంలో బీవోఐ షేరు 5 శాతం పతనమై రూ. 93 వద్ద ముగిసింది.

దేశీయంగా తయారీపై ఎల్‌జీ మరింత దృష్టి

పుణెలో 200 కోట్లతో కొత్త యూనిట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ మేకిన్ ఇండియా నినాదంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా పుణెలో సైడ్ బై సైడ్ (ఎస్ బీ ఎస్) ఫ్రిజ్ ల తయారీ కోసం కొత్త యూనిట్ ప్రారంభించింది. రూ. 200 కోట్లతో దీన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ భారత విభాగం ఎండీ హోంగ్ జు జియోన్ తెలిపారు. దీని వార్షిక తయారీ సామర్థ్యం 2 లక్షల యూనిట్లుగా ఉంటుందని వివరించారు. తాజాగా దేశీయంగానే వీటిని తయారు చేయడం వల్ల ధరలు కూడా కొంత తగ్గే అవకాశం ఉంది. గతేడాదే దేశీయంగా విండో ఏసీల తయారీని ప్రారంభించినట్లు జియోన్ చెప్పారు. భారత్ లో ఎస్ బీ ఎస్ ఫ్రిజ్ ల విభాగంలో తమకు 50 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు ఆయన చెప్పారు. దేశీయంగా ఫ్రిజ్ ల విభాగంలో తమకు 34 శాతం, వాషింగ్ మెషీన్ల విభాగంలో 37 శాతం వాటా ఉండగా అన్ని విభాగాల్లోనూ మార్కెట్ వాటాను మరింతగా పెంచుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు జియోన్ చెప్పారు. ఎల్‌జీకి దేశీయంగా



పుణె, గ్రేటర్ నోయిడాల్లో ప్లాంట్లు ఉన్నాయి. పుణె ప్లాంటుపై 2004 నుంచి గతేడాది వరకూ రూ. 1,619 కోట్లు, నోయిడా ప్లాంటుపై 1997 నుంచి గతేడాది వరకు రూ. 1,778 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు తెలిపారు.

కొత్త ఫ్రిజ్ ల శ్రేణి..

2023కి సంబంధించి ఎల్‌జీ కొత్త ఎస్ బీ ఎస్ ఫ్రిజ్ ల శ్రేణిని ఆవిష్కరించింది. ఎల్‌జీ థింక్యూ టెక్నాలజీతో వీటిలో టెంపరేచర్ సెట్టింగ్ వంటి ఫీచర్లను ఎక్కడ నుంచైనా ఆపరేట్ చేయొచ్చని సంస్థ తెలిపింది. ఎస్ బీ ఎస్ ఫ్రిజ్ లలో 15 మోడల్స్ ఉండగా ధరలు రూ. 1,20,699 నుంచి రూ. 2,29,099గా ఉంటాయని వివరించింది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎల్‌ఐసీలో 300 ఏఏఓఉద్యోగాలు

ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్‌ఐసీ)ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతుంది.దీనిలో భాగంగా అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జరనలిస్ట్) 300పోస్టులను భర్తీ చేయనుంది.డిగ్రీ పూర్తిచేసినవారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 300
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఏఓ)
- **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్/బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ▪ **వయసు:** 01.01.2023 వరకు 21-30 ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనాలు:** నెలకు రూ.53,600 -రూ.1,02,090 చెల్లిస్తారు.

ఎంపిక విధానం

- ఆన్‌లైన్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.
- **ప్రిలిమినరీ:** ఈ పరీక్ష 100ప్రశ్నలకు-70 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. రీజనింగ్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలుంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.
- **మెయిన్:** ఈ పరీక్ష 120 ప్రశ్నలకు-300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటల 30 నిమిషాలు. ఇందులో రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, డేటా అనాలసిస్, ఇన్సూరెన్స్ సంబంధిత ప్రశ్నలు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్(లెటర్ రైటింగ్, ఎస్సే) నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అనేది అర్హత పరీక్ష మాత్రమే.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 31.01.2023
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** పరీక్షకు పదిరోజుల ముందు నుంచి
- **పరీక్ష తేదీ(ప్రిలిమినరీ):** 2023 ఫిబ్రవరి 17, 20 తేదీల్లో
- **పరీక్ష తేదీ(మెయిన్స్):** మార్చి 18, 2023
- **వెబ్‌సైట్:** www.licindia.in

విశాఖపట్నం జిల్లాలో డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ శాఖ,ఎన్నికల విభాగంలో.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీతోపాటు కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్‌లో డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పని అనుభవానికి ప్రాధాన్యత ఉంటుంది. **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.18,500 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఉంచిన బాక్సులో వేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 19.01.2023.
- **వెబ్‌సైట్:** visakhapatnam.ap.gov.in

తెలంగాణ హైకోర్టులో 50 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
- **అర్హత:** ఏడో తరగతి నుంచి పదో తరగతి మధ్య ఏదైనా పరీక్ష లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంటే ఎక్కువ విద్యార్హత ఉంటే అనర్హులు. అభ్యర్థులు దరఖాస్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను దరఖాస్తులో పేర్కొనాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు/బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.19,000 నుంచి రూ.58,650 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
- **పరీక్షతేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, ముంబైలో 15 సీనియర్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ బరోడా..రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగంలో రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
- **అర్హత:** సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ,ఎంబీఏ, పీజీడీఎం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.01.2023.
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సొంత నోట్సు.. సక్సెస్‌కు రూటు

తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్1, 2, 3, 4 సర్వీసులంటే ఎంతో క్రేజ్. వీటికోసం లక్షల మంది పోటీపడుతుంటారు. పోటీలో ముందుండేందుకు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. కానీ సిలబస్ విస్తృతం. సమయం పరిమితం. సమాచారం అపరిమితం. వివిధ పుస్తకాల్లో చదివిన విషయాలు గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడే చాలా మంది అభ్యర్థులకు సమస్య ఎదురవుతోంది. ఈ సమస్యకు చక్కటి పరిష్కారం.. సెల్ఫ్ స్టడీ నోట్స్ అంటున్నారు నిపుణులు. మరి ఈ స్టడీ నోట్స్ రాసుకోవడం ఎలా ? అనేది మరో సందేహం!! ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్-1,2,3,4తోపాటు మరెన్నో ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు లక్షల మంది సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో.. సొంత స్టడీ నోట్స్‌తో ప్రయోజనాలు, దీన్ని సిద్ధం చేసుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

- 'పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు సొంతంగా స్టడీ నోట్స్ రాసుకుంటే.. పునశ్చరణకు ఉపయుక్తంగా ఉంటుంది. లాస్ట్ మినిట్ ప్రిపరేషన్ కోణంలో ఎంతో విలువైన సమయం ఆదా అవుతుంది.'-స్టడీ నోట్స్ ప్రాధాన్యతపై సబ్జెక్ట్ నిపుణుల అభిప్రాయం ఇది.
- 'ప్రిపరేషన్ సమయంలో నోట్స్ రాసుకుంటూ అధ్యయనం సాగించాం. దీనివల్ల ఎంతో మేలు జరిగింది. అభ్యర్థులు ఈ విధానాన్ని పాటిస్తే తమ గమ్యం దిశగా అడుగులు వేయొచ్చు' -ఇవి విజేతలు చెబుతున్న మాటలు.
- పై అభిప్రాయాలను చూస్తే.. స్టడీ నోట్స్ అనేది పోటీ పరీక్షలు, ముఖ్యంగా గ్రూప్స్ విజయంలో ఎంత కీలకమో అర్థం అవుతుంది.

» గ్రూప్ 1,2,3,4 పరీక్షల గెలుపులో కీలకంగా స్టడీ నోట్స్
» ర్యాపిడ్ రివిజన్‌కు దోహదపడే చక్కటి మార్గం
» స్టడీ నోట్స్ రాసేందుకు పలు పద్ధతులు
» సెల్ఫ్ నోట్స్‌తో ఎంతో మేలంటున్న నిపుణులు

స్టడీ నోట్స్ అంటే

స్టడీ నోట్స్ లేదా సొంత నోట్స్ అంటే ఏంటి? పోటీ పరీక్షల అభ్యర్థులకు కలిగే మొట్ట మొదటి సందేహం. వాస్తవానికి స్టడీ నోట్స్ అనేది ఏదైనా ఒక పుస్తకం చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను పాయింట్స్ రూపంలో సంక్షిప్తంగా రాసుకోవడంగా చెప్పొచ్చు. వీటిల్లో కాన్సెప్ట్‌లు, నిర్వచనాలు, సమకాలీన అంశాలను జోడించి సినాప్సిస్ రూపంలో షార్ట్ నోట్స్‌లో పొందుపర్చుకుంటారు. దీనివల్ల ఏదైనా ఒక టాపిక్ ప్రిపరేషన్ పూర్తయిన తర్వాత మళ్లీ దాన్ని చదవాలనుకుంటే.. మొత్తం పుస్తకాన్ని చదవాల్సిన అవసరం లేకుండా.. స్టడీ నోట్స్‌ను చదివితే సరిపోతుంది. ముఖ్యమైన పాయింట్లు ఒకసారి చూసుకుంటే.. మొత్తం విషయమంతా స్ఫురణకు వస్తుంది. దీనివల్ల ఎంతో విలువైన సమయం ఆదా అవుతుందని చెబుతున్నారు.

క్లాస్ రూమ్ స్టడీ నోట్స్

స్టడీ నోట్స్ రూపొందించుకోవడంలో మరో ముఖ్యమైన విధానం.. క్లాస్ రూమ్ స్టడీ నోట్స్. అంటే.. అభ్యర్థులు ఒక సబ్జెక్ట్‌కు సంబంధించి క్లాస్ రూమ్‌లో లెక్చర్ వింటున్న సమయంలో.. సదరు సబ్జెక్ట్ నిపుణులు 'ముఖ్యమైనవి' అని పేర్కొన్న అంశాలను తమ నోట్స్‌లో రాసుకోవడం. సదరు లెక్చరర్.. ఆయా అంశాలకు సంబంధించి గణాంక సహిత బోధన సాగిస్తున్న సమయంలో.. సదరు గణాంకాలను తమకు గుర్తుండే రీతిలో స్టడీ నోట్స్‌లో రాసుకోవచ్చు. పోటీ పరీక్షల కోణంలో క్లాస్ రూమ్ స్టడీ నోట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది.

ప్రిపరేషన్ టైమ్‌లో స్టడీ నోట్స్

స్వీయ ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు.. పలు పుస్తకాల ద్వారా సేకరించే సమాచారం స్టడీ నోట్స్‌లో రాసుకోవచ్చు. అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాల్ని చదువుతున్న సమయంలో రన్నింగ్ నోట్సులా స్టడీ నోట్స్‌ను రాసుకోవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. స్టడీ నోట్స్‌లో.. ఆయా టాపిక్‌లకు సంబంధించి నిర్వచనం, ఫార్ములాలు, భావనలు రాసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

కలరింగ్ మెథడ్

అభ్యర్థులు స్టడీ నోట్స్‌లో ముఖ్యమైన అంశాలను కలర్ పెన్స్ ఉపయోగించి హైలైట్ చేసుకోవాలి. ఫలితంగా రివిజన్ సమయంలో మరింత వేగంగా ఆయా అంశాలకు సంబంధించిన విషయాలను స్ఫురణకు తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ఈ కలర్ కోడింగ్ విధానంలో.. రెండు లేదా మూడు కలర్స్‌కే పరిమితమవడం మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఏదైనా ఒక కీలకమైన పాయింట్‌ను గ్రీన్ కలర్‌తో, గణాంక సమాచారాన్ని రెడ్ కలర్‌తో, నిర్వచనాన్ని పింక్ కలర్‌తో.. ఇలా సంక్షిప్త నోట్స్ తయారు చేసుకోవాలి.

మైండ్ మ్యాపింగ్

స్టడీ నోట్స్ రాసే విషయంలో మరో ముఖ్యమైన విధానం.. మైండ్ మ్యాపింగ్ మెథడ్. ఈ విధానంలో.. ఆయా అంశానికి సంబంధించి విజువలైజేషన్ టెక్నిక్‌ను అనుసరించాలి. అంటే..సదరు టాపిక్‌కు సంబంధించి తమకు అనువైన రీతిలో సింబల్స్, లైన్స్, గ్రాఫ్స్‌ను రూపొందించుకోవాలి. అదే విధంగా ఏదైనా ఒక అంశాన్ని తమ నిత్య జీవితంలోని విషయాలతో ముడిపెట్టి గుర్తుంచుకునే విధానం కూడా మైండ్ మ్యాపింగ్ విధానంలోకి వస్తుంది.

టేబుల్ ఫార్మట్

- పోటీ పరీక్షలకు స్టడీ నోట్స్ కోణంలో టేబుల్ ఫార్మట్ కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



ముఖ్యంగా విస్తృతమైన సమాచారం ఉండే అంశాల విషయంలో ఈ విధానం అభ్యర్థులకు పునశ్చరణ, జ్ఞప్తికి ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. ఉదాహరణకు.. ముఖ్యమైన ప్రదేశాలు లేదా సంవత్సరాల విషయంలో ఒక వరుస క్రమంలో సంవత్సరాన్ని..దాని పక్కనే ఆ సంవత్సరంలో జరిగిన ఘటనలు క్లుప్తంగా రాసుకోవడం వంటివి చేయాలి.

- ఒక టాపిక్‌కు సంబంధించి అన్ని అంశాలు ఒకేసారి జ్ఞప్తికి తెచ్చుకునే విధానం లేదా పునశ్చరణకు ఉపయోగపడే విధానం.. ప్యాట్రన్ మెథడ్. ఈ పద్ధతిలో స్టడీ నోట్స్ రాసుకునేందుకు.. నిర్దిష్ట అంశాన్ని పేపర్ మధ్యలో ఒక వృత్తంలో రాసుకోవాలి. ఆ తర్వాత ఆ అంశానికి సంబంధించిన అనుబంధ పాయింట్లను లైన్స్‌లో రాసుకోవాలి.

చార్ట్‌ల రూపం

స్టడీ నోట్స్ రాసుకునే సమయంలో అభ్యర్థులు చార్ట్‌ల రూపంలోనూ ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి ముఖ్యాంశాలను పొందుపర్చుకోవచ్చు.ఒక పేజీలో రెండు లేదా మూడు వరుసల్లో.. ఒక టాపిక్‌కు సంబంధించిన ముఖ్యాంశాలను మొదటి వరుసలో.. దానికి సంబంధించిన కాన్సెప్ట్‌లు,ఫార్ములాలను రెండో వరుసలో.. సదరు టాపిక్‌కు సంబంధించిన తాజా పరిణామాలను మూడో వరుసలో రాసుకోవాలి. ఫలితంగా రివిజన్ సమయంలో టాపిక్ ఉద్దేశం మొదలు సమకాలీన పరిస్థితుల వరకూ.. అన్నింటినీ వేగంగా గుర్తుకు తెచ్చుకునే వీలుంటుంది.

దయాగ్రమ్స్-అబ్రివేషన్స్

- స్టడీ నోట్స్ విషయంలో డయాగ్రమ్ మెథడ్ కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఒక టాపిక్‌కు సంబంధించి తమకు అనువైన, సులువుగా స్ఫురించేలా ఒక డయాగ్రమ్‌ను రూపొందించుకోవాలి. ఆ తర్వాత.. అందులో ముఖ్య భాగాల రూపంలో సదరు టాపిక్‌కు సంబంధించి ముఖ్య అంశాన్ని, దాని సబ్ టాపిక్స్‌ను రాసుకోవాలి.
- స్టడీ నోట్స్ రాసుకునేటప్పుడు అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం.. అబ్రివేషన్స్ రాసుకోవడం. ఉదాహరణకు.. ఐక్యరాజ్య సమితి అని రాసుకునే బదులు యూఎన్ఓ అని రాసుకుంటే.. సమయం ఆదా అవుతుంది. నోట్స్ కూడా గజిబిజిగా లేకుండా.. సులువుగా ఆయా అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించేలా ఉంటుంది.

సాంకేతిక పదాలు

స్టడీ నోట్స్‌లో అభ్యర్థులు ముఖ్యమైన సాంకేతిక పదాలను రాసుకోవాలి. వీటినే టెక్నికల్ జార్గాన్స్ అని కూడా అంటారు. ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి నిర్దిష్టంగా కొన్ని పదాలు ఉంటాయి. ఉదాహరణకు ఎకానమీలో.. 'రెపో' రేటు, రివర్స్ రెపోరేట్; అదే విధంగా జాగ్రఫీలో గ్లేసియర్స్, బ్యాడ్ ల్యాండ్స్ వంటివి. వీటిని స్టడీ నోట్స్‌లో పొందుపర్చుకోవడంతోపాటు క్లుప్తంగా ఒకటి రెండు వాక్యాల్లో వాటి అర్థాన్ని, నిర్వచనాన్ని కూడా రాసుకుంటే ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది.

చదువుతున్నపుడే

ఏదైనా ఒక టాపిక్‌కు సంబంధించి ప్రామాణిక పుస్తకం చదువుతున్నప్పుడే సొంత నోట్స్‌లో రాసుకోవాలి. అలాకాకుండా చదవడం పూర్తయిన తర్వాత నోట్స్ రాయొచ్చులే అనుకుంటే.. ఆ టాపిక్ పూర్తయ్యాక మళ్లీ మొదటి నుంచి చదవాల్సి ఉంటుంది. దీంతో సమయం వృథా అవుతుంది. కొన్నిసార్లు తర్వాత రాసుకుందాం అనే ఆలోచన చేయడంతో సదరు అంశంపై స్టడీ నోట్స్ రాయలేని పరిస్థితి కూడా ఏర్పడొచ్చు.

సినాప్సిస్‌లకే పరిమితం

అభ్యర్థులు స్టడీ నోట్స్ రాసుకునే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా.. అన్ని అంశాలను వీలైనంత క్లుప్తంగా రాసుకోవాలి. నిర్వచనాలు, భావనలను రాసుకునేటప్పుడు ఇది ఎంతో ముఖ్యం. ఆయా టాపిక్స్‌కు సంబంధించి సినాప్సిస్(సంక్షిప్త వివరణ)కు పరిమితమవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఎస్సే, జనరల్ స్టడీస్, డిస్క్రిప్టివ్ కొశ్చన్స్ అండ్ ఆన్సర్స్ విషయంలో ఇది ఎంతో ప్రధానమని గుర్తించాలి.

నిడివితోపాటు నీట్‌గా

- స్టడీ నోట్స్‌లో ప్రతి పేజీలో నిడివి బాగుండేలా, రైటింగ్ కూడా చక్కగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి పేజీలో ఒక అంశానికి, మరో అంశానికి మధ్య కొంత గ్యాప్(నిడివి) విడిచిపెడితే.. సదరు టాపిక్‌కు సంబంధించి తర్వాత దశలో ఏదైనా కొత్త విషయం చదివినప్పుడు లేదా స్ఫురించినప్పుడు.. దాని కిందనే రాసుకోవడానికి వీలవుతుంది. అదే విధంగా రైటింగ్ కూడా నీట్‌గా ఉంటే రివిజన్ సమయంలో గందరగోళానికి గురవకుండా.. వేగంగా సదరు టాపిక్స్‌ను రివిజన్ చేసుకునే అవకాశం ఉంటుంది. • ఇలా.. స్టడీ నోట్స్ రాసుకుంటూ అంకిత భావంతో ప్రిపరేషన్ సాగిస్తే.. పోటీ పరీక్షల్లో విజయావకాశాలు మెరుగవుతాయి.

పిల్లలను తాత ముత్తాతలతో విడదీయలేం

- తల్లిదండ్రులకే కాదు.. వారికీ ప్రేమ ఉంటుందన్న హైకోర్టు
- 'నల్లగొండ'కు సంబంధించిన ఓ కేసులో కీలక వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: 'తాత ముత్తాతలు, అమ్మమ్మ నానమ్మలు.. తమ మనవళ్లు, మనవరాళ్లను కలవకుండా ఉండలేరు. పిల్లలంటే తల్లిదండ్రులకే కాదు.. నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలకు కూడా ప్రేమ, అభిమానం, వాత్సల్యం ఉంటుంది. పిల్లల ఎదుగుదలలో తాతముత్తాతల పాత్ర కూడా ముఖ్యమైనదే. పిల్లల సంరక్షణ అంటే ఒక్క డబ్బుతో ముడిపడిందే కాదు.. పలు దృక్కోణాల్లో చూడాలి. తండ్రి/తల్లి బిడ్డను జాగ్రత్తగా చూసుకోగలిగినంత మాత్రాన అది పూర్తిగా పరిగణించబడదు. జీవితంలో దగ్గరి వ్యక్తుల, తమకు ఇష్టమైన వారి జీవన విధానాన్ని అనుసరిస్తూ చిన్నారులు వ్యక్తిగా ఎదుగుతారు. ప్రతి బిడ్డ సంతోషకరమైన బాల్యానికి అర్హులు. తాత-తల్లిదండ్రుల ఉనికి నుంచి మనుమలు పొందే ప్రేమ, ఆప్యాయత, భద్రత నిస్సందేహంగా ముఖ్యమైనవి. వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి'అని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మొదటి భార్య(ఓ చిన్నారి తల్లి) మరణించడంతో నల్లగొండకు చెందిన ఓ వ్యక్తి రెండో వివాహం చేసుకున్నాడు. ఆ చిన్నారి ప్రస్తుతం తండ్రి వద్దే ఉంటోంది. చిన్నారిని తన సంరక్షణకు ఇవ్వాలంటూ నల్లగొండకు చెందిన 56 ఏళ్ల మహిళ(చిన్నారి అమ్మమ్మ) జిల్లా కోర్టులో పిటిషన్ వేసింది. కేసు విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, మనవరాలిని చూసేందుకు తనకు అనుమతి ఇవ్వడం లేదని, ఇచ్చేలా ఆమె తండ్రిని ఆదేశించాలని కోరుతూ ఆ మహిళ హైకోర్టును ఆశ్రయించింది. ఈ సివిల్ రివిజన్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కన్నెగంటి లలిత విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున కె.సీతారాం, ప్రతివాది తరఫున పి.వి జయ్‌కుమార్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి అనుబంధాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ కేసులో అత్త, అల్లుడి వివాదాలను కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలేదు. వారి వివాదాలు పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపకూడదు. అమ్మమ్మ తాతయ్యల పట్ల ద్వేషంతో పెంచితే పాప కచ్చితంగా మంచి మనిషిగా పరిణామం చెందదు. ఇది జీవితకాల ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది అనడంలో సందేహం లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత అమ్మమ్మ తన మనవరాలిని వారానికి ఒకసారి కలవడానికి అనుమతి ఇస్తున్నాం'అని ఆదేశించింది.


పాతపంటల జాతరలో భాగంగా చిరు ధాన్యాలను ఎడ్లబండ్లపై పెట్టుకొని ఊరేగిస్తూ రైతుల్లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆదాయం.. ఆరోగ్యం

మహిళల 'చిరు' యత్నం

జహీరాబాద్ ప్రాంతంలో చిరుధాన్యాలను పండిస్తున్న మహిళా రైతులు

- ఒక సంఘంగా ఏర్పడి సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో సాగు
- వర్షాభావ పరిస్థితులను అధిగమిస్తూ ఎన్నో ఏళ్లుగా సాగు కొనసాగింపు
- తాము పండించిన పంటల్నే వినియోగిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న వైనం
- తమ అవసరాలకు పోను మిగతా పంటల్ని విక్రయిస్తూ ఆదాయార్జన
- ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న స్థానిక స్వచ్ఛంద సంస్థ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సామలు.. కొర్రలు.. అరికెలు.. ఊదలు.. జొన్నలు.. ఇలా పలు పాత పంటలు సేంద్రియ పద్ధతిలో సాగు చేయడమే కాకుండా వాటిని వినియోగిస్తూ తమతో పాటు తమ కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు ఆ మహిళా రైతులు. అంతేకాదు వారి అవసరాలు పోను మిగతా ధాన్యాన్ని మంచి ధరకు అమ్ముకుంటూ లాభాలు ఆర్జించడంతో పాటు ఇతరులకు ఆరోగ్యాన్ని పంచుతున్నారు. చాలా ప్రాంతాల్లో ఈ పాత పంటల సాగు దాదాపు కనుమరుగైందనే చెప్పాలి. అయితే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇటీవలి కాలంలో చాలా మంది తృణ ధాన్యాల వైపు మొగ్గు చూపుతుండటంతో.. కొద్ది సంవత్సరాలుగా కొన్ని ప్రాంతాల్లో మళ్లీ వీటి సాగు మొదలైంది. అయితే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంత రైతులు మాత్రం ఏళ్ల తరబడి తృణ ధాన్యాల సాగును కొనసాగిస్తుండటం గమనార్హం.

ఒక సంఘం..3 వేలమంది సభ్యులు

జహీరాబాద్ ప్రాంతంలో సరైన సాగు నీటి సౌకర్యం లేదు. వరుణుడు కరుణిస్తేనే పంటలు చేతికందుతాయి. ఈ ఎర్ర నేలల్లో ప్రస్తుతం సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో చిన్న సన్నకారు రైతులు చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. అందరూ కలిసి ఒక సంఘంగా ఏర్పడి ఈ పంటలను పండిస్తున్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన గ్రూపుల్లో సుమారు మూడు వేల మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు.

ఒక్క కరోనా మరణం లేదు


చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా రూ.లక్షల్లో లాభాలను గడించకపోయినప్పటికీ.. నిత్యం వాటినే వినియోగిస్తుండడంతో ఆ రైతులు ఆరోగ్యంగా ఉంటున్నారు. కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని పొట్టనబెట్టుకుంది. కానీ ఈ చిరుధాన్యాలు వినియోగించిన రైతు కుటుంబంలో ఒక్క కరోనా మరణం కూడా జరగలేదని డీడీఎస్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. మూడు వేవ్‌ల్లో అసలు ఈ మహమ్మారి బారిన పడిన రైతులే చాలా తక్కువని చెబుతున్నారు. రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, ఇతరత్రా వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య కూడా తక్కువేనని అంటున్నారు.



కొనసాగుతున్న జాతర

చిరుధాన్యాల ఆవశ్యకత.. పౌష్టికాహార భద్రత.. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యతపై రైతుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా గత 23 ఏళ్లుగా పాత పంటల జాతర జహీరాబాద్ ప్రాంతంలో కొనసాగుతోంది. సంక్రాంతి నుంచి మొదలుపెట్టి కనీసం రోజుకో గ్రామం చొప్పున నెల రోజుల పాటు సుమారు 40 గ్రామాల్లో ఈ జాతర సాగుతుంది. సుమారు 80 రకాల చిరుధాన్యాలను ఎడ్ల బండ్లపై ఆయా గ్రామాలకు తీసుకెళ్లి వాటి సాగు ప్రాధాన్యతను రైతులకు వివరిస్తూ ఆయా పంటల సాగును ప్రోత్సహిస్తుంటారు. డీడీఎస్ ఆధ్వర్యంలో జాతర కోసం ఏర్పాటైన ప్రత్యేక బృందం.. రసాయనాలు లేకుండా విత్తనాలు భద్రపరుచుకోవడం, సేంద్రియ ఎరువుల తయారీ, భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తుండటం విశేషం. జహీరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ 35 గ్రామాల్లో రైతులను ప్రోత్సహిస్తోంది. జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్ తదితర మండలాల రైతులకు తృణ ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తోంది. పండిన పంటలు రైతులు వినియోగించేలా వారిని చైతన్యం చేస్తోంది. మిగిలిన పంటలను మార్కెట్ ధర కంటే సుమారు పది శాతం ఎక్కువ ధరకు రైతుల వద్ద డీడీఎస్ కొనుగోలు చేస్తోంది.

మేం పండించిన సాయి జొన్నలనే తింటున్నం..



నాకు ఏడు ఎకరాలు ఉంది. టమాటా, మిర్చి వంటి కూరగాయల పంటలకు భూమి అనుకూలంగా ఉన్నప్పటికీ.. చిరుధాన్యాలను సాగు చేయాలనే ఉద్దేశంతో రెండు ఎకరాల్లో సాయి జొన్న పండిస్తున్న. కూరగాయల పంటలతో పాటు శనగలు, కందులు కూడా సాగు చేస్తున్నా. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివనే ఉద్దేశంతో మేం పండించిన సాయి జొన్నలనే ఎక్కువగా తింటాం. ఇవి తింటేనే మాకు ఆరోగ్యంగా అనిపిస్తుంది.

- గార్లపాటి నర్సింహులు,
బర్దిపూర్, సంగారెడ్డి జిల్లా

ఐదు ఎకరాల్లో 20 రకాల పంటలు



మాకు ఐదు ఎకరాలుంది. వర్షం పడితేనే పంట పండుతుంది. నీటి సౌకర్యం లేదు. తొగర్లు, జొన్నలు, సామలు, కొర్రలు.. ఇట్లా 20 రకాల పంటలు వేస్తున్నాం. విత్తనాలు మావే.. కొనే అవసరం లేదు. మేమే సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటున్నాం. దీంతో పెట్టుబడి వ్యయం చాలా తక్కువగా ఉంటోంది.

- పర్మన్‌గారి నర్సమ్మ,
మెటల్‌కుంట, సంగారెడ్డి జిల్లా

ఎంతో ఆరోగ్యంతో ఉంటున్నారు..



నెల రోజుల పాటు జరిగే పాతపంటల జాతరలో రైతులకు చిరుధాన్యాల సాగు ఆవశ్యకతను వివరిస్తున్నాం. వివిధ రకాల పంటలు సాగు చేయడం ద్వారా వాతావరణం అనుకూలించక ఒక పంట నష్టపోయినా.. మరో పంట చేతికందుతుంది. ఈ చిరుధాన్యాలను పండించడంతో పాటు వాటిని వినియోగిస్తే వచ్చే ఆరోగ్యపరమైన ప్రయోజనాలపై మహిళా రైతులను చైతన్యం చేస్తున్నాం. చిరు ధాన్యాలను వినియోగిస్తున్న రైతులు, వారి కుటుంబాల వారు ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నారు.

- బూచనెల్లి చుక్కమ్మ, జాతర కోఆర్డినేటర్

కొత్తగా ముగ్గురికి కరోనా పాజిటివ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 4,733 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా,వారిలో ముగ్గురు వైరస్ బారిన పడినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరిందని వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.